Crime Mirror QR Code
https://epaper.crimemirror.com/

# క్రైమ్ మిర్రర్
Voice of Anti Corruption

హైదరాబాద్
24-9-2024
వెల: రూ.5/-
పేజీలు: 10+10
సంపుటి:13
సంచిక: 324

PUBLISHED FROM HYDERABAD CIRCULATED BY RANGAREDDY, NALGONDA, KHAMMAM, KARIMNAGAR, WARANGAL, MAHABOOBNAGAR, MEDAK, NIZAMABAD, ADILABAD

## ప్రభుత్వ పథకాలన్నిటికీ
# ఇకపై ఒకే కార్డు

### ప్రతి కుటుంబానికి ఓ డిజిటల్ కార్డు ఇచ్చే సన్నాహాల్లో సర్కారు
### సీఎం రేవంత్ ఆధ్వర్యంలో జరిగిన ఉన్నతస్థాయి సమీక్షలో చర్చ

- ఆరోగ్య, సంక్షేమ పథకాలతోపాటు రేషన్‌కు సైతం ఈ కార్డే ఆధారం
- ఆధార్/సెల్ నంబర్‌తో అనుసంధానంకుటుంబసభ్యుల వివరాలన్నీ నమోదు
- పొందుతున్న పథకాలు, ఆరోగ్య సమాచారం నిక్షిప్తం
- ప్రతి నియోజకవర్గంలోని ఒక పట్టణం, ఒక గ్రామంలో పైలట్ ప్రాజెక్టు
- ఇతర రాష్ట్రాల్లో అధ్యయనం చేసి త్వరగా నివేదిక ఇవ్వాలన్న సీఎం



హైదరాబాద్: రాష్ట్ర ప్రభుత్వ ప్రతి పథకానికి ఇకపై ఒకే కార్డు ఆధారం కానుంది. అదే డిజిటల్ కార్డు. ప్రతి కుటుంబానికీ ఇచ్చే ఈ డిజిటల్ కార్డులో కుటుంబసభ్యుల వివరాలన్నీ నమోదై ఉంటాయి. ఆరోగ్య, సంక్షేమ పథకాలతో పాటు రేషన్ సరుకులకు సైతం ఉపయోగపడేలా ఈ కార్డును రూపొందించనున్నారు. కుటుంబానికి చెందిన ఆధార్ కార్డు లేదా సెల్ నంబర్‌ను ఈ డిజిటల్ కార్డుతో అనుసంధానిస్తారు. ప్రస్తుతం కర్ణాటక, రాజస్థాన్, మహారాష్ట్ర, హరియాణా రాష్ట్రాల్లో కుటుంబ ఆరోగ్యానికి సంబంధించిన సమాచారాన్ని డిజిటల్ కార్డులో పొందుపరిచి ఉపయోగిస్తున్నారు. కాగా రాష్ట్ర ప్రభుత్వం ఒక అడుగు ముందుకేసి అన్ని ప్రభుత్వ పథకాలకు చిప్ అమర్చిన ఒకే డిజిటల్ కార్డు ఇవ్వాలనే నిర్ణయానికి వచ్చింది.

మిగతా 2లో



# ప్రజా పాలన కాదు.. గూండా రాజ్యం

### ఎమ్మెల్యే సునీత ఇంటిపై దాడి దారుణం
### వరుస దాడుల వెనక కాంగ్రెస్ కుట్రలు
### ఎమ్మెల్యే హరీశ్‌రావు ఘాటు విమర్శలు

**మెదక్,(క్రైమ్ మిర్రర్):** ఈ రాష్ట్రంలో ప్రజా పాలన కాదు.. గూండా రాజ్యం నడుస్తుందని బీఆర్ఎస్ ఎమ్మెల్యే హరీశ్‌రావు ధ్వజమెత్తారు. కాంగ్రెస్ ప్రభుత్వం ప్రజల హక్కులను పూర్తిగా కాలరాస్తుందని మండిపడ్డారు. నర్సాపూర్ గోమారంలోని ఎమ్మెల్యే సునీత లక్ష్మారెడ్డి నివాసంలో మాజీ మంత్రి హరీష్ రావు మీడియాతో మాట్లాడారు. సీనియర్ శాసనసభ్యులు, మాజీ మంత్రి సునీత లక్ష్మారెడ్డి ఇంటి మీద కాంగ్రెస్ గూండాలు చేసిన దాడిని తీవ్రంగా ఖండిస్తున్నాం అని హరీశ్‌రావు పేర్కొన్నారు.

# శ్రీవారి ఆస్తుల పరిరక్షణ బాధ్యత ప్రభుత్వానిదే

### గత ప్రభుత్వం ఆస్తుల అమ్మకానికి యత్నం
### ఆభరణాలు క్షేమంగా ఉన్నాయా లేదా విచారించాలి
### డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ ప్రకటన

**అమరావతి, (క్రైమ్ మిర్రర్):** తిరుమల శ్రీవారి ఆస్తుల పరిరక్షణ బాధ్యత కూటమి ప్రభుత్వానిదేనని ఏపీ డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ అన్నారు. వేంకటేశ్వరుడిపై

మిగతా 2లో



# ఢిల్లీ నూతన సీఎంగా ఆతిశీ సోమవారం బాధ్యతలు

### కేజీవ్రాల్‌పై తనకున్న గౌరవాన్ని చాటుకున్న సిఎం
### సిఎం సీటు పక్కన సీటు వేసుకుని బాధ్యతలు

**న్యూఢిల్లీ, (క్రైమ్ మిర్రర్):** ఢిల్లీ నూతన సీఎంగా ఆతిశీ సోమవారం బాధ్యతలు స్వీకరించారు. ఈ సమయంలో ఆమె ఆప్ అధినేత అరవింద్ కేజ్రీవాల్‌పై తనకున్న గౌరవాన్ని చాటుకున్నారు. ఆయన కోసం పక్కన కుర్చీని ఖాళీగా ఉంచి, తాను వేరే సీట్లో కూర్చొని బాధ్యతలు చేపట్టారు.

మిగతా 2లో




# భారత్‌కు చెందిన పురాతన వస్తువుల అప్పగింత

### ప్రధాని మోడీ పర్యటనలో అమెరికా నిర్ణయం
### క్వాడ్ ఎవరికీ వ్యతిరేకం కాదని మోడీ స్పష్టీకరణ



న్యూఢిల్లీ,సెప్టెంబర్: 4 వేల పురాతన వస్తువులను అమెరికా భారత్ కు ఇచ్చేయడానికి సిద్ధమైంది. భారత్ నుంచి అక్రమంగా తరలించిన అత్యంత విలువైన పురాతన వస్తువులను తిరిగిచ్చేందుకు

మిగతా 2లో



మిగతా 2లో

# దుర్గం చెరువు ఎఫ్‌టిఎల్ నిర్ధారించండి

### అప్పటి వరకు కూల్చివేతలు ఆపండి
### బాధితుల ఫిర్యాదుతో హైకోర్టు ఆదేశాలు

# గాంధీ ఆస్పత్రి వద్ద తీవ్ర ఉద్రిక్తత

### బిఆర్ఎస్ బృందాన్ని అడ్డుకున్న పోలీసులు
### ఆస్పత్రిలో వసతుల పరిశీలనకు వెళ్లిన టీమ్
### పోలీసుల తీరుపై మండిపడ్డ బిఆర్ఎస్ నేత కెటిఆర్



**హైదరాబాద్, (క్రైమ్ మిర్రర్):** హైదరాబాద్ గాంధీ దవాఖాన వద్ద తీవ్ర ఉద్రిక్తత ఏర్పడింది. దవాఖానలో పరిస్థితులను అధ్యయనం చేయడానికి వెళ్లిన బీఆర్ఎస్ నిజనిర్ధారణ కమిటీ సభ్యులు, బీఆర్ఎస్


## ఢిల్లీ నూతన సీఎంగా ఆతిశీ సోమవారం బాధ్యతలు

దీనికి సంబంధించిన దృశ్యాలను ఆప్(ంంఖ) ఎక్స్(ట్విటర్) ఖాతాలో షేర్ చేసింది. అనంతరం ఆమె మీడియాతో మాట్లాడుతూ రామాయణంలోని ఓ సందర్భాన్ని ప్రస్తావించారు. నాకు ప్రస్తుతం భరతుడికి ఎదురైన పరిస్థితే ఉంది. రాముడు వనవాసానికి వెళ్లినప్పుడు.. భరతుడు పాలించాల్సి వచ్చింది. సింహాసనంపై రాముడి పాదుకలు ఉంచి రాజ్యాన్ని ఏలాడు. ఈ కుర్చీ అరవింద్ కేజ్రీవాల్‌ది. నాలుగు నెలల తర్వాత జరిగే ఎన్నికల్లో ఢిల్లీలో మళ్లీ ఆయన అధికారాన్ని చేపడతారని విశ్వసిస్తున్నాను. ఆయన తిరిగివచ్చేవరకు ఈ కుర్చీ ఇక్కడే ఉంటుందని ఆతిశీ అన్నారు. మద్యం కుంభకోణం కేసులో ఆరోపణలు ఎదుర్కొని, జైలుకు వెళ్లి ఇటీవలే విడుదలై వచ్చిన ఆప్ జాతీయ కన్వీనర్ అరవింద్ కేజ్రీవాల్ సీఎం పదవికి రాజీనామా చేసిన సంగతి తెలిసిందే. ఈ క్రమంలోనే తదుపరి ముఖ్యమంత్రిగా ఆతిశీ పేరును ప్రతిపాదించగా.. ఆప్ ఎమ్మెల్యేలంతా ఏకగ్రీవంగా ఆమోదించారు. దీంతో ప్రభుత్వ ఏర్పాటుకు లెఫ్టినెంట్ గవర్నర్ వీకే సక్సేనా అంగీకరించ డంతో..రెండు రోజుల క్రితం ప్రమాణస్వీకారం చేశారు. ఆమెతో పాటు తొలిసారి ఎమ్మెల్యేగా గెలిచిన ముకేశ్ అహ్లావత్, గోపాల్‌రాయ్, ఇమ్రాన్ హుస్సేన్, కైలాశ్ గహ్లోత్, సౌరభ్ భరద్వాజ్ కేబినెట్ మంత్రులు ప్రమాణం చేశారు. దీనికిముందు ఆప్ నేత సౌరభ్ భరద్వాజ్ మాట్లాడుతూ..ఢిల్లీ ప్రజలు ఎన్నికల్లో తీర్పు ఇచ్చేవరకు తాను ముఖ్యమంత్రి కుర్చీపై కూర్చోనని కేజ్రీవాల్ అన్నారు. అయితే గత ఎన్నిల్లో ప్రజల తీర్పు మేరకు ఈ ఐదు సంవత్సరాల పాటు ఆ కుర్చీ ఆయనకే చెందుతుంది. వచ్చే ఎన్నికలు జరిగేవరకు మాలో ఒకరు కుర్చీలో కూర్చుంటారు. రాముడు లేనప్పుడు(రామాయణంలో) భరతుడు అయోధ్యను ఎలా పాలించాడో, మాలో ఒకరు ఢిల్లీకి సీఎంగా ఉంటారని వ్యాఖ్యానించిన సంగతి తెలిసిందే.

# దుర్గం చెరువు ఎఫ్‌టిఎల్ నిర్ధారించండి

(మొదటి పేజీ తరువాయి)

**హైదరాబాద్,(క్రైమ్ మిర్రర్):** చెరువులు, నాలాలపై ఆక్రమణలను కూల్చివేస్తూ దూసుకెళు న్న హైడ్రాకు తెలంగాణ హైకోర్ట్ కీలక ఆదేశాలు జారీ చేసింది. దుర్గం చెరువు పరిసరాల్లో హైడ్రా కూల్చివేతల పై హైకోర్ట్ స్టే విధించింది. 2014లో జారీ చేసిన ప్రిలిమినరీ నోటిఫికేషన్‌పై దుర్గం చెరువు పరిసర నివాసితులు అభ్యంతరాలు వ్యక్తం చేశారు. ఈ మేరకు వారు పిటిషన్ దాఖలు చేశారు. ఈ అభ్యంతరాలను లేక్ ప్రొటెక్షన్ కమిటీ పరిగణలోకి తీసుకోవాలని హైకోర్ట్ పేర్కొంది. దుర్గం చెరువు ఎఫ్‌టీఎల్ నిర్ధరణ శాస్త్రీయంగా జరగలేదంటూ పలువురు దాఖలు చేసిన పిటిషన్లపై తెలంగాణ హైకోర్టులో విచారణ జరిగింది. ఎఫ్‌టీఎల్ బాధితుల అభ్యంతరాలను పరిగణనలోకి తీసుకోవాలని ప్రభుత్వాన్ని ఉన్నత న్యాయస్థానం ఆదేశించింది. వారంలోపు చెరువుల పరిరక్షణ కమిటీ ముందు హాజరై అభ్యంతరాలను చెప్పాలని బాధితులకు సూచించింది. 6 వారాల్లోపు ఎఫ్‌టీఎల్ పరిధిని నిర్ధరించాలని హైకోర్టు ఆదేశించింది. అప్పటి వరకు అక్కడ ఎలాంటి కూల్చివేతలు చేపట్టబోమని జీహెచ్‌ఎంసీ తెలిపింది. రికార్డుల ప్రకారం దుర్గం చెరువు ఎఫ్‌టీఎల్ 65 ఎకరాలు మాత్రమే ఉందని.. అధికారులు 160 ఎకరాలు అని చెప్పడం సరైందని పిటిషనర్ల తరఫు న్యాయవాదులు కోర్టు దృష్టికి తీసుకెళ్లారు. అక్టోబర్ 4న లేక్ ప్రొటెక్షన్ కమిటీ ముందు దుర్గం చెరువు పరిసర నివాసితులు హాజరు కావాలని కోర్ట్ తెలిపింది. అభ్యంతరాలను పరిగణలోకి తీసుకొని అక్టోబర్ 4 నుంచి ఆరు వారాల లోపు తుది నోటిఫికేషన్ జారీ చేయాలని స్పష్టం చేసింది. ఈ మేరకు లేక్ ప్రొటెక్షన్ కమిటీకి హైకోర్టు ఆదేశాలు జారీ అయ్యాయి. ఈ పరిణామంతో దుర్గం చెరువు పరిసర నివాసితులకు ఊరట దక్కినట్టు అయ్యింది. కాగా జెట్ స్పీడ్‌లో హైడ్రా బుల్డోజర్లు దూసుకెళ్తున్నాయి. జూన్ 26 నుంచి కూల్చివేతలు మొదలు పెట్టింది. ఇప్పటి వరకు 30 ప్రాంతాల్లో 300 ఆక్రమణలను కూల్చి వేసింది. ఆక్రమణలకు గురైన 120 ఎకరాలను ప్రభుత్వానికి అప్పగించింది. ఎఫ్టీఎల్, బఫర్ జోన్లను కబ్జా చేస్తూ బహుళ అంతస్తుల నిర్మాణాలపై ఫిర్యాదులు రావడంతో చెరువును హైడ్రా కమిషనర్ రంగనాథ్ పరిశీలిస్తున్నారు. వెంటనే రంగంలోకి దిగి హైడ్రా సిబ్బంది కూల్చివేస్తున్నారు. హై రీచ్ జా క్రషర్స్‌తో పాటు జేసీబీలతో, బుల్డోజర్లతో కూల్చి వేతలు చేపట్టారు. జీహెచ్‌ఎంసీతో పాటు ఓఆర్ఆర్ లోపల ఉన్న 27 మున్సిపాలిటీలు, 33 గ్రామాల్లో హైడ్రా దూకుడు పెంచింది. అమీన్ పూర్‌లో హైడ్రా బిగ్ ఆపరేషన్ చేపట్టింది. 17 గంటలపాటు నాన్ స్టాప్ గా ఇళ్లులు, భవనాలు, అపార్టుమెట్లు కూల్చివేసింది. అలాగే ఓ హాస్పిటల్, రెండు అపార్ట్ మెంట్లు కూల్చివేసి ప్రభుత్వ భూమిని స్వాధీనం చేసుకుంది. పటేల్ గుడాలో 16 విల్లాలు కూల్చివేసింది. సోమవారం తెల్లవారుజాము ఒంటిగంట వరకు కూల్చివేతలు



కొనసాగాయి. హైడ్రా ఏర్పాటు తర్వాత తొలిసారిగా డే అండ్ నైట్ కూల్చివేతలు జరిగాయి. అక్రమ నిర్మాణాలకు అనుకొని ఉన్న పక్క ఇళ్లకు డ్యామేజ్ కాకుండా జాగ్రత్తలు తీసుకున్నారు. హైడ్రా 17 గంటలపాటు హైరిస్క్ ఆపరేషన్ కొనసాగించి రికార్డు క్రియేట్ చేసింది. గణెశిశ్ నవరాత్రి ఉత్సవాల నేపథ్యంలో రెండు వారాలపాటు కూల్చివేతలకు తాత్కాలిక విరామం ప్రకటించిన హైడ్రా.. తిరిగి తన పనిని మొదలుపెట్టింది. చెరువులు, ప్రభుత్వ స్థలాల్లోని అక్రమ నిర్మాణాలపై మరోసారి కొరడా ఝుళిపించింది. ఏకకాలంలో కూకట్‌పల్లిలో, అమీన్‌పూర్ మునిసిపాలిటీలోని కిష్టారెడ్డిపేట, పటేల్‌గూడలో ప్రభుత్వ భూముల్లోని నిర్మాణాలను నేలమట్టం చేసింది. కూకట్‌పల్లి శాంతినగర్‌లోని నల్లచెరువు ఎఫ్‌టీఎల్, బఫర్ జోన్ పరిధిలో నాలుగు ఎకరాల విస్తీర్ణంలో, కిష్టారెడ్డిపేటలోని ఎకరంపైగా, పటేల్‌గూడలోని మూడు ఎకరాలకుపైగా విస్తీర్ణంలోని నిర్మాణాలను కూల్చివేసింది. రెవెన్యూ, నీటి పారుదల, పట్టణ ప్రణాళిక విభాగం అధికారులతో కలిసి హైడ్రా బృందం కూల్చివేతలు చేపట్టింది. మూడు ప్రాంతాల్లోని 8 ఎకరాల విస్తీర్ణంలో ఉన్న ఆక్రమణలు, భవనాలు తొలగించినట్టు హైడ్రా కమిషనర్ ఏవీ రంగనాథ్ తెలిపారు. అయితే తమ సామాన్లను కూడా తీసుకునే సమయం ఇవ్వకుండా నిర్మాణాలు నేలమట్టం చేశారని బాధితులు లబోదిబోమన్నారు.




# ప్రజా పాలన కాదు.. గూండా రాజ్యం

(మొదటి పేజీ తరువాయి)

మొన్న సిద్దిపేటలో నా కార్యాలయం మీద దాడి కావచ్చు, హైదరాబాద్‌లో ఎమ్మెల్యే కౌశిక్ రెడ్డి ఇంటి మీద దాడి కావచ్చు, నిన్న సునీత లక్ష్మారెడ్డి ఇంటి మీద దాడి కావచ్చు, రాష్ట్రంలో గూండాయిజం రాజ్యాన్ని తలపించే విధంగా పరిపాలన సాగుతుంది అని హరీశ్‌రావు తెలిపారు.తెలంగాణకున్న మంచి పేరును మంటగలిపి.. ఈరోజు బీహార్‌లాగా తెలంగాణను మారుస్తున్నారని హరీశ్‌రావు ధ్వజమెత్తారు. నిన్న సునీతా లక్ష్మారెడ్డి ఇంటిమీద జరిగిన దాడి కాంగ్రెస్ నాయకత్వం ప్రోత్సాహంతో జరిగిన దాడి అని పేర్కొన్నారు. రేవంత్ రెడ్డి రెచ్చగొట్టే మాటలు రాష్ట్రంలోని కాంగ్రెస్ కార్యకర్తలను ప్రతిపక్షాల మీద దాడి చేసే విధంగా ప్రోత్సహించినట్లు ఉన్నాయి. ఎమ్మెల్యే నివాసంలో లేనప్పుడు ఉద్దేశపూర్వకంగా దాడి చేయాలని, ఎమ్మెల్యే ఇంటి ముందు పటాకులు కాల్చడం, ఇంట్లోకి పటాకులు విసరడం ఇంట్లో ఉన్న వారిపై దాడి చేయడం హేయమైన చర్య అని హరీశ్‌రావు పేర్కొన్నారు. అప్పుడే ఎస్పీ, ఐజీతో మాట్లాడాను.. వెంటనే కాంగ్రెస్ గూండాలను అరెస్ట్ చేయాలని డిమాండ్ చేయడం జరిగిందని హరీశ్‌రావు తెలిపారు. కాంగ్రెస్ నాయకులు దాడి చేశారన్న విషయం వీడియోలో స్పష్టంగా కనిపిస్తున్నది. అంతే కాకుండా విధులు నిర్వహిస్తున్న హెడ్ కానిస్టేబుల్‌పై కూడా దాడి చేసే ప్రయత్నం చేశారు. హెడ్ కానిస్టేబుల్ చేతిలోని ఫోన్ లాక్కొని నెట్టేస్తే, ఆయన కింద పడిపోయాడు. పోలీసులపై దాడి జరిగినా కేసు నమోదు చేయడం లేదు. కాంగ్రెస్ రాష్ట్రంలో ప్రజాస్వామ్యాన్ని ఖూనీ చేస్తున్నారు. దేశంలో తెలంగాణ పోలీసులు అంటే మంచి పేరు ఉండేది కానీ ఇప్పుడు రేవంత్ రెడ్డి పోలీసులను చెడగొడుతున్నారని హరీశ్‌రావు నిప్పులు చెరిగారు. పోలీసు అధికారులు ఒక విషయం గుర్తుపెట్టుకోండి ఇక్కడ కాంగ్రెస్ ప్రభుత్వం, రేవంత్ రెడ్డి శాశ్వతం కాదు. 10 సంవత్సరాలు బిఆర్ఎస్ పార్టీ అధికారంలో ఉంది.. ఏనాడైనా ఎమ్మెల్యేల ఇంటిపైన దాడి జరిగిందా? ఫిర్యాదు ఇచ్చిన 24 గంటల్లో ఎఫ్ఐఆర్ నమోదు చేసిన సందర్భాలు ఉన్నాయి. కాంగ్రెస్ గూండాల రాజ్యంలో ఎఫ్ఐఆర్ ౯÷ల్ చేయరు.. దాడి చేసిన వారిని అరెస్ట్ చేయరు. వెంటనే గోమారంలో దాడి చేసిన కాంగ్రెస్ గుండాలను అరెస్ట్ చేయాలి. దాడిని ప్రోత్సహించిన వారిపై కూడా కేసు నమోదు చేయాలని డిమాండ్ చేస్తున్నామని హరీశ్‌రావు తెలిపారు. నేషనల్ హ్యూమన్ రైట్స్ కమిషన్, స్టేట్ హ్యూమన్ రైట్స్ కమిషన్‌కి కూడా వెళ్తాం. దాడి చేసిన వారికి శిక్ష పడేదాకా వదిలిపెట్టం అన్నారు. ఇది ప్రజా పాలన కాదు గూండాల పాలన. మా ఓపికకు కూడా ఒక హద్దు ఉంటది. పోలీసులు ఇలాంటి దాడులను కట్టడి చేయడంలో విఫలమైతే రాయలసీమ లాంటి ఫ్యాక్షన్ పరిస్థితులు తెలంగాణలో కూడా వచ్చే అవకాశం ఉంది. తెలంగాణ ప్రాంతంతో, తెలంగాణ ప్రజలతో మాది పేగు బంధం. ఎక్కడ ఎలాంటి హింసాత్మక ఘటనలు జరగకుండా మేము చాలా జాగ్రత్తగా వ్యవహరిస్తున్నాం. అదేవిధంగా ప్రభుత్వం పోలీసులు కూడా వ్యవహరిస్తే మంచిది. ఇంట్లో చొరబడి దాడి చేసిన వారిని అరెస్టు చేసి రాష్ట్రంలో లా అండ్ ఆర్డర్ సక్రమంగా ఉందని నిరూపించుకోవాలి.

## శ్రీవారి ఆస్తుల పరిరక్షణ బాధ్యత ప్రభుత్వానిదే

విశ్వాసంతో భక్తులు ఆస్తులు ఇచ్చారని, వాటిని నిరర్థక ఆస్తులంటూ గత తితిదే పాలకమండలి అమ్మే ప్రయత్నం చేసిందని ఆరోపించారు. గత ప్రభుత్వం తితిదే ఆస్తులకు, భగవంతుడి ఆభరణాలకు రక్షణ కల్పించిందా? లేదా? అనే కోణంలో విచారణ అవసరమన్నారు. శ్రీవాణి ట్రస్టుకు వచ్చిన విరాళాలు, ఖర్చుల లెక్కలను, స్వామివారి ఆభరణాలను పరిశీలించాలన్నారు. ఈ మేరకు ఆయన ఓ ప్రకటన విడుదల చేశారు. తితిదేకు ఆంధ్రప్రదేశ్‌తోపాటు తెలంగాణ, మహారాష్ట్ర, కర్ణాటక, తమిళనాడు ఇలా చాలా రాష్ట్రాల్లో స్థిరాస్తులు ఉన్నాయి. ముంబయి, హైదరాబాద్ నగరాల్లో భవనాలు ఉన్నాయి. శ్రీ వేంకటేశ్వర స్వామివారి ఆస్తులను గత పాలకమండళ్లకు నేతృత్వం వహించినవారు కాపాడారా? వాటిని అమ్మేశారా? అనే సందేహాలు వస్తున్నాయి. తిరుమల శ్రీవారి ఆస్తులను పరిరక్షించే బాధ్యతను కూటమి ప్రభుత్వం తీసుకొంటుంది. ఈ క్రమంలో గత పాలక మండళ్ళు తితిదే ఆస్తులు విషయంలో చేసిన నిర్ణయాలపై సమగ్ర విచారణ చేయించాలని ముఖ్యమంత్రి చంద్రబాబుకు విజ్ఞప్తి చేస్తున్నాను. అదే విధంగా తిరుమల శ్రీవారికి కొన్ని శతాబ్దాలుగా రాజులు, భక్తులు నగలు, ఆభరణాలు అందజేశారు. వాటి జాబితాను కూడా పరిశీలించి, వాటి పరిస్థితిని కూడా గణించాలని తితిదే అధికారులకు సూచిస్తున్నాను. శ్రీవాణి ట్రస్ట్ ద్వారా ప్రతి భక్తుడి నుంచి రూ.10,500 తీసుకున్నారు. ఇందులో బిల్లు రూ.500కే ఇచ్చారు. ట్రస్ట్ ఏర్పాటు చేసినప్పటి నుంచి వచ్చిన ఆదాయాన్ని నాటి పాలక మండళ్ళు ఎటు మళ్లించాయో కూడా విచారించాలని ఇప్పటికే సీఎంను కోరా. శ్రీవాణి ట్రస్ట్ ద్వారా అటు కశ్మీర్ నుంచి ఇటు బెంగాల్ వరకూ ఆలయాలు నిర్మించేస్తామని అప్పటి పాలకులు చెప్పారు. అసలు ఆ ఆలయాలు ఎవరి ద్వారా నిర్మాణం చేపట్టారు? ఆ సంస్థ ఏమిటి? ఎంత మేరకు శ్రీవాణి ఆదాయం మళ్లించారో భక్తులకు తెలియజేయాల్సిన అవసరముంది. కేవలం తితిదే మాత్రమే కాదు.. దేవాదాయ శాఖ పరిధిలోని అన్ని ఆలయాలు, సత్రాల ఆస్తుల విషయంలో సమీక్ష అవసరమని చంద్రబాబుకు సూచిస్తున్నా. ప్రభుత్వ ఆస్తులను తాకట్టు పెట్టిన గత పాలకులు దేవుడి మాన్యాలు, ఆస్తుల జోలికి వెళ్లకుండా ఉంటారా అనే సందేహం ప్రజల్లో ఉంది. ఆయా వివరాలు భక్తులకు అందుబాటులోకి వస్తే దేవుడి ఆస్తులు అన్యాక్రాంతం కాకుండా ఉండటంతోపాటు, ఆలయాల పాలక మండళ్ళు జవాబుదారీతనంతో పని చేస్తాయి.

## భారత్‌కు చెందిన పురాతన వస్తువుల అప్పగింత

(మొదటి పేజీ తరువాయి)

అమెరికా నిర్ణయం తీసుకుంది. భారత ప్రధానమంత్రి నరేంద్రమోదీ అమెరికా పర్యటన సందర్భంగా ఆ దేశం ఈ నిర్ణయం తీసుకుంది. ఇందులో 2వేలు బీసీఈ 19వేల సీఈ - వరకు అంటే 4వేళ ఏళ్ల పరిధిలోని యాంటిక్విటీస్ ఉన్నాయని భారత్ అధికారులు తెలిపారు. ఇండియాకు రానున్న తూర్పు భారతంలోని టెర్రకోట బొమ్మలు, కళాకృతులు; ఇతర ప్రాంతాల్లోని రాతి, లోహ, కలప, ఐవరీ శిల్పాలు.. త్వరలోనే వీటిని భారత్‌కు తరలించనున్నట్లు విదేశాంగ శాఖ అధికారులు ప్రకటించారు. కాగా క్వాడ్ కూటమి ఏ దేశానికీ వ్యతిరేకం కాదు. అన్ని దేశాల సార్వభౌమత్వాన్ని గౌరవిస్తాం. భద్రత, అభివృద్ధి చెందుతున్న సాంకేతికత, వాతావరణ మార్పులు, సామర్థ్య నిర్మాణమే మా లక్ష్యం. సమస్యలను శాంతియుతంగా పరిష్కరించు కోవడమే క్వాడ్ అభిమతం. మేం(క్వాడ్ కూటమి) నిలబడతాం.. బలపడతాం అని భారత ప్రధాని నరేంద్ర మోదీ ఉద్ఘాటించారు. అమెరికా అధ్యక్షుడు జోబైడెన్ స్వస్థలమైన విల్మింగ్టన్‌లో ఆదివారం జరిగిన క్వాడ్ దేశాధినేతల శిఖరాగ్ర సదస్సులో ఆయన మాట్లాడారు. నాలుగేళ్లక్రితం ఇండో-పసిఫిక్ రీజియన్‌లో స్వేచ్ఛాయుత వాణిజ్యం, భద్రత వంటి అంశాలతో అమెరికా, ఆస్ట్రేలియా, జపాన్, భారత్ కలిసి క్వాడ్ కూటమిగా ఏర్పడ్డ విషయం తెలిసిందే..! ఈ కూటమి ఏర్పడి నాలుగేళ్లు పూర్తయిన సందర్భంగా జరిగిన సదస్సులో మోదీ, బైడెన్‌తోపాటు.. ఆస్ట్రేలియా ప్రధాని అల్బనేస్, జపాన్ ప్రధాని కిషిదా పాల్గొన్నారు.క్వాడ్‌కు వ్యతిరేకంగా చైనా వ్యాఖ్యలు చేస్తున్న నేపథ్యంలో.. మోదీ ఆ దేశం పేరును ప్రస్తావించకుండా తాము అన్ని దేశాల సార్వభౌమత్వాన్ని గౌరవిస్తామని, ఎవరికీ వ్యతిరేకం కాదని స్పష్టం చేశారు. తమ సందేశం ఒక్కటేనని, బలంగా నిలబడి, సభ్యదేశాల సహకారానికి కృషిచేస్తామని పేర్కొన్నారు. ప్రపంచంలో ఉద్రిక్తతలు, సంఘర్షణలు చోటుచేసుకుంటున్న సమయంలో క్వాడ్ కూటమి ఏర్పాటైంది. మానవాళి శ్రేయస్సుకు, ప్రజాస్వామ్య విలువల పరిరక్షణకు కంకణబద్ధమైంది. క్వాడ్ సదస్సులో ఫలవంతమైన చర్చలు జరిగాయి. ప్రపంచానికి మేలు జరిగేలా ఇంకా సమర్థంగా పనిచేయాలని నిర్ణయించాం అని ఆయన వ్యాఖ్యానించారు. ఇండో-పసిఫిక్ రీజియన్‌లో స్వేచ్ఛాయుత వాణిజ్యానికి సహకరించేందుకు భారత్ కట్టుబడి ఉందన్నారు.

## గాంధీ ఆస్పత్రి వద్ద తీవ్ర ఉద్రిక్తత

(మొదటి పేజీ తరువాయి)

ఎమ్మెల్యేలను పోలీసులు అరెస్టు చేశారు. ఈ సందర్భంగా పోలీసులు, బీఆర్ఎస్ నాయకులకు మధ్య స్వల్ప తోపులాట చోటుచేసుకున్నది. మాజీ ఉపముఖ్యమంత్రి రాజయ్యతోపాటు మాజీ ఎమ్మెల్యే మెతుకు ఆనంద్, ఎమ్మెల్యేలు డాక్టర్ సంజయ్, మాగంటి గోపీనాథ్‌ను పోలీసులు అదుపులోకి తీసుకుని అక్కడినుంచి తరలించారు. పోలీసు వాహనాన్ని అడ్డుకునేందుకు బీఆర్ఎస్ కార్యకర్తలు ప్రయత్నించారు.గాంధీ సహా రాష్ట్రంలోని ప్రభుత్వ దవాఖానల అధ్వాన పరిస్థితిని అధ్యయనం చేసేందుకు రాజయ్య నేతృత్వంలో బీఆర్ఎస్ నిజ నిర్ధారణ కమిటీని నియమించిన విషయం తెలిసిందే. సోమవారం నుంచి నిపుణులైన డాక్టర్లతో కూడిన త్రిసభ్య కమిటీ క్షేత్రస్థాయి పరిశీలన ప్రారంభించింది. ఇందులో భాగంగా గాంధీ దవాఖానను పరిశీలించాల్సి ఉన్నది. అయితే కమిటీ పర్యటనను కాంగ్రెస్ సర్కార్ అడ్డుకున్నది. రాజయ్య సహా కమిటీ సభ్యులైన మాజీ ఎమ్మెల్యే మెతుకు ఆనంద్, ఎమ్మెల్యే సంజయ్‌ను పోలీసులు హౌస్ అరెస్టు చేశారు. అనేక నిర్బంధాల నడుమ గాంధీ దవాఖానకు చేరుకున్న కమిటీ సభ్యులతోపాటు బీఆర్ఎస్ ఎమ్మెల్యేలను పోలీసులు అరెస్టు చేశారు. మరోవైపు జనగామ బీఆర్ఎస్ ఎమ్మెల్యే పల్లా రాజేశ్వర్ రెడ్డి పోలీసులు హౌస్ అరెస్టు చేశారు. జూబ్లీహిల్స్‌లోని ఆయన నివాసంలో నుంచి బయటకు రాకుండా భారీగా పోలీసులు మోహరించారు. ఇదిలావుంటే గాంధీ ఆస్పత్రి వద్ద బీఆర్ఎస్ నేతలను అరెస్ట్ చేయడాన్ని ఆ పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ తీవ్రంగా ఖండించారు. ఎక్స్ (ట్విట్టర్) వేదికగా స్పందిస్తూ.. ప్రభుత్వాస్పత్రుల్లో ఉన్న పరిస్థితులను తెలుసుకునేందుకు వెళ్లిన త్రిసభ్య కమిటీ సభ్యులను అరెస్ట్ చేయటమా.. అసలు ప్రభుత్వానికి ఎందుకంత భయం.. కమిటీ తన పని తాను చేసుకొని పోతే నిజం బయటపడుతుందనా.. అసమర్థ చేతగాని ప్రభుత్వం అసలు రంగు బయట పడుతుందనా అంటూ ట్వీట్ చేశారు..నిజంగా ప్రభుత్వం ఏమీ దాచటం లేదంటే బీఆర్ఎస్ నిజ నిర్ధారణ కమిటీని దర్యాప్తు చేయనివ్వండి.

## ప్రభుత్వ పథకాలన్నిటికీ ఇకపై ఒకే కార్డు

(మొదటి పేజీ తరువాయి)

ఇందులో ఒక్కో పథకానికి ఒక్కో నంబర్‌ను కేటాయిస్తారు. తొలిదశలో ప్రుయోయుగాత్మకంగా ప్రతి నియోజకవర్గంలో ఒక ముట్టణం, ఒక గ్రామాన్ని ఎంపిక చేసుకుని ఈ విధానాన్ని అమలు చేసేందుకు రంగం సిద్ధమైంది. అయితే ప్రయోగాత్మకంగా అమల్లోకి తీసుకురావడానికి ముందే ఆయా రాష్ట్రాల్లో అమల్లో ఉన్న విధానాన్ని అధ్యయనం చేయాలని, అక్కుడ ఎదురవుతున్న సమస్యలు ఇక్కడ తలెత్తకుండా పథకాన్ని అమలు చేయాలని రాష్ట్ర ప్రభుత్వం భావిస్తోంది. ఈ మేరకు అధికారుల బృందాన్ని అక్కడకు పంపించాలని నిర్ణయించారు. అన్ని రికార్డులు ఒకే దగ్గర..: కేవలం ఆరోగ్యానికి సంబంధించిన అంశాలే కాకుండా.. ప్రభుత్వం ప్రస్తుతం అమలు చేస్తున్న అన్ని సంక్షేమ పథకాలు, ఆ కుటుంబ సభ్యులకు అందుతున్న పథకాల వివరాలను కూడా ఈ డిజిటల్ కార్డులో పొందుపర్చనున్నారు. ఒక కుటుంబంలో నలుగురు సభ్యులుంటే..ఆ కుటుంబానికి ఒక యూనిక్ ఐడెంటిఫికేషన్ నంబర్ (యూఐఎన్)ను కేటాయించి, కుటుంబసభ్యుల సంఖ్య ఆధారంగా ఆ యూఐఎన్‌కు బై నంబర్ కేటాయిస్తారు. ఆ బై నంబర్ ఎదురుగా ఆ కుటుంబ సభ్యుని పేరు, ఆ సభ్యుడి సమస్త సమాచారం ఉంటుందని అధికార వర్గాలు తెలిపాయి. ఈ డిజిటల్ కార్డు పూర్తిగా సురక్షితమైనదని, అన్నిరకాల రికార్డులు ఒకే దగ్గర అందుబాటులో ఉంటాయని ప్రభుత్వం చెబుతోంది. కాగా కుటుంబంలోని ప్రతి ఇంటి సభ్యుని హెల్త్ ప్రొఫైల్ అందులో ఉండాలని, తద్వారా దీర్ఘకాలంలో వైద్య సేవలకు ఇది ఉపయోగపడుతుందని ముఖ్యమంత్రి ఈ సమావేశంలో అభిప్రాయపడ్డారు. రాష్ట్ర ప్రజల ఆరోగ్య సమాచారంతో పాటు, సంక్షేమ పథకాలు కూడా ఒకేచోట ఒకే క్లిక్‌తో లభ్యమవుతాయని అధికార వర్గాలు పేర్కొంటున్నాయి. రాజస్థాన్, హరియాణ, కర్ణాటక రాష్ట్రాల్లో కార్డులపై అధ్యయనం చేయాలని, వాటితో కలుగుతున్న ప్రయోజనాలు, ఇబ్బందులపై అధ్యయనం చేసి త్వరగా ఒక సమగ్ర నివేదిక రూపొందించాలని ముఖ్యమంత్రి అధికారులను ఆదేశించారు. అర్హులందరికీ సంక్షేమ పథకాలు అందేలా ఈ ఫ్యామిలీ డిజిటల్ కార్డులు ఉండాలని సూచించారు. లబ్ధిదారులు ఎక్కడైనా రేషన్, ఆరోగ్య సేవలు పొందేలా ఈ కార్డులు ఉండాలని అన్నారు.



## సిఎం రేవంత్‌తో మహేశ్ దంపతుల భేటీ

**వరదబాధితులకు 50లక్షల చెక్కు అందచేత**

**హైదరాబాద్, (క్రైమ్ మిర్రర్):** ముఖ్యమంత్రి సహాయనిధికి విరాళాలు అందతూనే ఉన్నాయి. తాజాగా సినీ నటుడు మహేష్ బాబు దంపతులు రూ.50 లక్షలు విరాళం అందజేసారు. కథానాయకుడు మహేశ్‌బాబు ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డిని కలిశారు. వరద బాధితుల సహాయార్థం ప్రకటించిన రూ.50 లక్షల చెక్కును సీఎంకు అందజేశారు. దీనికి సంబంధించిన ఫొటోలు నెట్టింట వైరల్‌గా మారాయి. పొడవాటి జుత్తు, గడ్డంతో మహేశ్ న్యూలుక్ అభిమానులను ఆకట్టుకుంటోంది. తన తదుపరి చిత్రంలో ఆయన ఈ లుక్‌లో కనిపించనున్నారని సమాచారం. మహేశ్‌బాబు, రాజమౌళి దర్శకత్వంలో తెరకెక్కనుంది. భారతీయ చిత్ర పరిశ్రమలో ఇప్పటివరకూ చూడని సరికొత్త ప్రపంచాన్ని రాజమౌళి ఆవిష్కరించబోతున్నారని రచయిత



విజయేంద్రప్రసాద్ గతంలో ఓ ఇంటర్వ్యూలో తెలిపారు. అమెజాన్ అడవుల నేపథ్యంలో సాగే ఈ కథలో పలువురు విదేశీ నటులు కనిపించనున్నారు. భారతీయ భాషలతో పాటు, విదేశీ భాషల్లోనూ దీనిని అనువదించనున్నారు. దుర్గా ఆర్ట్స్‌పై కె.ఎల్.నారాయణ ఈ చిత్రాన్ని నిర్మిస్తున్నారు. దీనికి 'గరుడ' అనే టైటిల్‌ను అనుకుంటున్నట్లు టాక్.

## కావూరి హిల్స్‌లో ఆక్రమణ కూల్చివేత

**కోర్టు ఆదేశాలు ఉన్నాయన్న కమిషనర్ రంగనాథ్**

**హైదరాబాద్, (క్రైమ్ మిర్రర్):** హైదరాబాద్‌లో హైడ్రా ఆక్రమణల కూల్చివేతలు కొనసాగు తున్నాయి. మాదాపూర్‌లో అక్రమ నిర్మాణాలను హైడ్రా కూల్చివేస్తోంది. కావూరి హిల్స్‌లోని పార్కు ప్రాంతంలో ఆక్రమణలను అధికారులు తొలగించారు. పార్కులో ఏర్పాటు చేసిన స్పోర్ట్స్ అకాడమీపై గత కొంతకాలంగా కావూరి హిల్స్ అసోసియేషన్ ఫిర్యాదు చేస్తోంది. ఈ క్రమంలో సోమవారం ఉదయం అకాడమీ నిర్మాణాలను తొలగించారు. అనంతరం అక్కడ కావూరి హిల్స్ పార్కు అని బోర్డు ఏర్పాటు చేశారు. మరోవైపు దీనిపై స్పోర్ట్స్ అకాడమీ నిర్వాహకులు స్పందించారు. కావూరి హిల్స్ అసోసియేషన్ తమకు 25 ఏళ్లకు లీజుకు ఇచ్చిందన్నారు. ఆ గడువు ముగియక ముందే నిర్మాణాలను అన్యాయంగా తొలగిస్తున్నారని ఆరోపించారు. హైడ్రా కమిషనర్ రంగనాథ్ మాట్లాడుతూ కోర్టు ఆదేశాలతో అక్రమ నిర్మాణాలను కూల్చివేసినట్లు స్పష్టం చేశారు.

## హైడ్రాతో ప్రజల్లో భయాందోళనలు

**కూకట్‌పల్లి ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు**



**హైదరాబాద్, (క్రైమ్ మిర్రర్):** శనివారం, ఆదివారం వస్తుందంటే హైదారాబాద్‌లో ప్రజలు భయంతో ఉండాల్సిన పరిస్థితి ఉందని కూకట్‌పల్లి ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు వ్యాఖ్యానించారు. కూకట్‌పల్లి నల్ల చెరువులో హైడ్రా కూల్చివేతలపై సోమవారం మీడియాతో మాట్లాడుతూ.. హైడ్రా కమిషనర్ వ్యాఖ్యలకు ప్రజలు భయభ్రాంతులకు గురవుతున్నారన్నారు. కూల్చివేతలు చేశాక డిబ్రిస్ తీసివేయకుండా, చెత్తను జమ చేస్తున్నారని తెలిపారు. నల్ల చెరువులో ఆదివారం కూల్చివేతలు చేపట్టిన స్థలం పట్టదారులకు చెందిందని.. పట్టాదారులకు ఏ విధమైన న్యాయం చేయనున్నారని ప్రశ్నించారు. చెరువులలో పట్టాలు ఉన్న వారికి నష్ట పరిహారం చెల్లించి, ఆ స్థలాన్ని ప్రభుత్వం తీసుకోవాలని డిమాండ్ చేశారు. నిన్న షెడ్లు కూల్చివేస్తున్న సమయంలో అక్కడ ఉంటున్న వారికి కనీసం వారి సామాన్లను తరలించేందుకు కూడా సమయం ఇవ్వకపోవడం దురదృష్టకరమని మండిపడ్డారు. హైడ్రా విధి విధానాలను స్పష్టం చేయాలన్నారు. రాత్రి నోటీసులు ఇచ్చి, ఉదయాన్నే కూల్చి వేస్తే అక్కడ ఉంటున్న వారి పరిస్థితి ఏంటి అంటూ మండి పడ్డారు. నిన్న కూల్చివేతలలో నష్టపోయిన వారికి నష్ట పరిహారం చెల్లించాలని డిమాండ్ చేశారు. శనివారం, ఆదివారం హైడ్రా కాదు హైడ్రామా చేస్తున్నారని వ్యాఖ్యలు చేశారు. కోర్టు ఆదేశాలకు వ్యతిరేకంగా నిన్న కూల్చివేతలు చేపట్టారని విమర్శించారు. ప్రజలను సంక్షేమ పథకాల నుంచి దారి మళ్లించేందుకు హైడ్రా కూల్చివేతలు చేస్తున్నారని మాధవరం కృష్ణారావు తీవ్రస్థాయిలో ధ్వజమెత్తారు.కాగా.. కూకట్‌పల్లిలో, అమీన్‌పూర్ మునిసిపాలిటీలోని కిష్టారెడ్డిపేట, పటేల్‌గూడలో ప్రభుత్వ భూముల్లోని నిర్మాణాలను నిన్న హైడ్రా నేలమట్టం చేసిన విషయం తెలిసిందే. కూకట్‌పల్లి శాంతినగర్‌లోని నల్లచెరువు ఎఫ్‌టీఎల్, బఫర్ జోన్ పరిధిలో నాలుగు ఎకరాల విస్తీర్ణంలో, కిష్టారెడ్డిపేటలోని ఎకరంపైగా, పటేల్‌గూడలోని మూడు ఎకరాలకు పైగా విస్తీర్ణంలోని నిర్మాణాలను కూల్చివేసింది. రెవెన్యూ, నీటి పారుదల, పట్టణ ప్రణాళిక విభాగం అధికారులతో కలిసి హైడ్రా బృందం కూల్చివేతలు చేపట్టింది. మూడు ప్రాంతాల్లోని 8ఎకరాల విస్తీర్ణంలో ఉన్న ఆక్రమణలు, భవనాలు తొలగించినట్టు హైడ్రా కమిషనర్ ఏవీ రంగనాథ్ తెలిపారు. అయితే తమ సామాన్లను కూడా తీసుకునే సమయం ఇవ్వకుండా నిర్మాణాలు నేలమట్టం చేశారని బాధితులు లబోదిబోమన్నారు. అప్పులు చేసి చిన్న చిన్న వ్యాపారాలు చేసుకునే తాము హైడ్రా చర్యతో రూ.లక్షల్లో నష్టపోయి రోడ్డున పడ్డాయని ఆవేదన చెందారు. దీనికి ప్రభుత్వం సమాధానం చెప్పాలని ఎమ్మెల్యే డిమాండ్ చేశారు.

## కొనసాగనున్న కాళేశ్వరం విచారణ

**హైదరాబాద్, (క్రైమ్ మిర్రర్):** కాళేశ్వరం ఎత్తిపోతల్లోని బ్యారేజీలపై న్యాయ విచారణ నిర్వహిస్తున్న జస్టిస్ పీసీ ఘోష్ కమిషన్ మళ్లీ దర్యాప్తు కొనసాగించనుంది. మేడిగడ్డ, అన్నారం, సుందిళ్ల ఆనకట్టల నిర్మాణంలో పనిచేసిన ఇంజనీర్లను శనివారం వరకు విచారించనుంది. అప్పటి ఈఎన్సీలను, ఉన్నతాధికారులను ప్రశ్నించనుంది. ఈ నేపథ్యంలో అన్ని నివేదికలు ఇవ్వాలని నీటి పారుదల శాఖను కమిషన్ ఆదేశించింది. బ్యారేజీల నిర్మాణానికి సంబంధించిన ప్లేస్‌మెంట్ రిజిస్టర్, ఎంబుక్‌లను కూడా తీసుకురావాలని కమిషన్ ఇంజినీర్లకు ఆదేశాలు జారీ చేసింది. ఈ విచారణలో కమిషన్‌ను తప్పుదోవ పట్టించినా, నేరపూరితంగా వ్యవహరించినా, వారిపై అవినీతి నిరోధక చట్టం కింద కేసులు నమోదు చేయాలని, భవిష్యత్‌లో పదోన్నతులు ఇవ్వవద్దని ప్రభుత్వానికి సిఫారసు చేసే యోచనలో ఉన్నట్లు జస్టిస్ పీసీ ఘోష్ కమిషన్ వెల్లడించింది. తుది నివేదిక ఇవ్వాలని విజిలెన్స్ విభాగానికి ఆదేశాలు జారీ అయ్యాయి. కాళేశ్వరం నివేదిక ఆధారంగా కాగ్ అధికారుల నుంచి కూడా వివరాలు తీసుకోనున్నట్లు కమిషన్ తెలిపింది.

# ఖమ్మంలో పంటలు ఎండుతున్న కానరాదా




**కృష్ణాలో నీళ్లున్నా..ఎందుకు ఇవ్వడం లేదు**

**గండ్లు పూడ్చడంలో నిర్లక్ష్యం ఎందుకు**

**ముగ్గురు మంత్రులు ఉన్నా ఫలితం లేదు**

**మాజీమంత్రి, బిఆర్ఎస్ ఎమ్మెల్యే హరీష్ రావు**

**హైదరాబాద్, (క్రైమ్ మిర్రర్):** ఉమ్మడి ఖమ్మం జిల్లాల్లో పంటలు దెబ్బతింటున్నా, ఎండిపోతున్నా ప్రభుత్వం పట్టించుకోవడం లేదని మాజీ మంత్రి, సిద్దిపేట ఎమ్మెల్యే హరీశ్‌రావు ఆరోపించారు. ఖమ్మం జిల్లాలో ప్రభుత్వ వైఫల్యం వల్ల ఎండిపోతున్న పంట పొలాలపై మాజీ మంత్రి హరీష్ రావు తెలంగాణ భవన్‌లో మీడియాతో మాట్లాడారు.తలాపున సముద్రం ఉన్న చేప పిల్లలు నీటికి ఏడ్చినట్టు ఉందని కాంగ్రెస్ ప్రభుత్వాన్ని హరీశ్‌రావు విమర్శించారు. ఖమ్మం జిల్లాలో పంటలు ఎండిపోతున్నాయి. 22 రోజులైన కాల్వకు గండి పూడ్చడం చేతకాగ.. రైతుల పొలాలను కాంగ్రెస్ ప్రభుత్వం ఎండపెడుతుందన్నారు. పాలేరు, ఖమ్మం, వైరా, సత్తుపల్లి, మధిర నియోజకవర్గాల్లోని రైతులు ఎన్ఎస్పీ ఆఫీసులను ముట్టడి స్తున్నారు. పార్టీలకతీతంగా ధర్నా చేస్తున్న ప్రభుత్వం నిద్రపోతున్నదని హరీశ్‌రావు ధ్వజమెత్తారు. 9 మంది ఎమ్మెల్యేలను గెలిపిస్తే.. 3 లక్షల ఎకరాల పంటలు ఎండబెడుతారా.. అని కాంగ్రెస్ సర్కార్‌పై హరీశ్‌రావు నిప్పులు చెరిగారు. ఒకవైపు కృష్ణా నది నిండు కుండలా ఉన్నప్పటికీ.. పంటలన్నీ ఎండిపోతున్నాయని తెలిపారు. కాంగ్రెస్ సర్కార్‌కు కూల్చివేతలు తప్ప పూడ్చివేతలు రావా.. అని హరీశ్‌రావు నిలదీశారు. గతేడాది నీరు లేక పంటలు ఎండిపోయాయి. మరి ఈ ఏడాది పుష్కలంగా వర్షాలు పడినా కూడా కాంగ్రెస్ ప్రభుత్వం చేతికాని తనం వల్ల లక్షల ఎకరాల్లో పంటలు ఎండిపోయాయని హరీశ్‌రావు తెలిపారు. మంత్రులు భట్టి విక్రమార్క, పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి, తుమ్మల నాగేశ్వర్ రావు గండి పడిన కాలువ పక్క నుంచే వెళ్తున్నారు. 22 రోజులైనా గండిపూడ్చాలని సోయిలేదా..ఆకాశాన్ని దించుతాం, సూర్యుడిని వంచుతాం అనే డైలాగులు కొడుతున్న రేవంత్ రెడ్డికి, జిల్లా మంత్రులకు కాల్వ గండి పూడ్చాడం చేతకాదా? అని నిలదీశారు. హైడ్రా పేరుతో పేదల ఇండ్లు కూలగొట్టడం వచ్చుగానీ.. రైతులకు నీరు ఇవ్వడం రాదా? కాంగ్రెస్‌కు రైతుల పట్ల జాలి, దయ లేదా..? అని నిలదీశారు. వరదల్లో కొట్టుకుపోయిన పంటలకు నష్టం పరిహారం ఇవ్వరా? కాంగ్రెస్ ప్రభుత్వం రైతులు కన్నీళ్లు తూడ్చడం కాదు.. కన్నీళ్లు పెట్టిస్తుంది. ఎకరాకు రూ. 25 వేలు సాయం చేయాలని బీఆర్ఎస్ పార్టీ డిమాండ్ చేస్తుంది. వరద నష్టం వల్ల సాగర్ పరివాహక ప్రాంతాల్లో వల్ల 60 వేల ఎకరాలు, కాంగ్రెస్ నిర్వాకం వల్ల లక్ష ఎకరాలు పోయినట్లు ప్రాథమిక అంచనాలో తేలిందన్నారు. ఇప్పుడు కాంగ్రెస్ సర్కార్ నీరు ఇచ్చినా పంటలు చేతికొచ్చే పరిస్థితులు లేవు. ఆగస్టు 15వ తేదీ ముఖ్యమంత్రి రేవంత్ ఖమ్మం జిల్లాలో సీతారామా ప్రాజెక్టు ప్రారంభించి, సీఎం, మంత్రులు డైలాగులు కొట్టింన్రు. 70 రోజుల్లో ప్రాజెక్టును పూర్తి చేశామని గొప్పలు చెప్పుకున్నారు. మరి సీతారామా ప్రాజెక్టు ద్వారా దిగువన ఉన్న పాలేరుకు నీరు ఎందుకు ఇవ్వట్లేదు అని హరీశ్‌రావు ప్రశ్నించారు. బీఆర్ఎస్ పార్టీ తరుపున మేం ఖమ్మం జిల్లాకు వెళ్తాం.. రైతులకు మనోధైర్యం చెబుతాం అని హరీశ్‌రావు తెలిపారు. దాడులకు బీఆర్ఎస్ భయపడదు. వరద బాధితులను పరామర్శించేందుకు వెళ్తే మాపై దాడులు చేసింన్రు.. అధికారం ఎప్పుడు శాశ్వతం కాదు. పోలీసులు అతి ఉత్సాహం వల్ల ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో ఏం జరిగిందో మనం చూసాం. పోలీసు అధికారులు చట్టాలకు లోబడి పనిచేయాలి ప్రభుత్వాలకు లోబడి కాదు. ప్రభుత్వ వైఫల్యాలను డైవర్ట్ చేసేందుకు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి హైడ్రాతో హైడ్రామా చేస్తుంన్రు. లక్షల ఎకరాల్లో పంట పొలాలు ఎండిపోతుంటే, లక్షల మంది చికెన్ గున్యా, డెంగీ వంటి విషజ్వరాలతో బాధపడుతున్నారు. ప్రభుత్వ వైఫల్యాలను డైవర్ట్ చేసేందుకు హైడ్రా పేరుతో రేవంత్ రెడ్డి డైవర్షన్ పాలిటిక్స్ చేస్తున్నారని హరీశ్‌రావు నిప్పులు చెరిగారు.

## ఎమ్మెల్యే సునీతలక్ష్మారెడ్డి ఇంటిపై దాడి

**కాంగ్రెస్ తొత్తులుగా పోలీసులు**

**ఎపి తరహాలో వారికి శిక్షలు తప్పవు**

**హరీష్ రావు తీవ్ర హెచ్చరికలు**

**హైదరాబాద్, (క్రైమ్ మిర్రర్):** కాంగ్రెస్ ప్రభుత్వానికి కొందరు పోలీస్ అధికారులు తొత్తులుగా వ్యవహరిస్తున్నారని.. ఏపీ తరహా పరిణామాలు ఎదుర్కోవటానికి పోలీసులు సిద్ధంగా ఉండాలంటూ మాజీ మంత్రి హరీష్ రావు హెచ్చరించారు. మాజీ మంత్రి సునీతా లక్ష్మారెడ్డి ఇంటిపై దాడి ఘటనకు సంబంధించి మాజీ మంత్రి హరీష్‌రావు స్పందించారు. ఈ సందర్భంగా ఏపీ పోలీస్‌శాఖలో జరిగిన పరిణామాలను మాజీ మంత్రి గుర్తుచేశారు. సోమవారం మీడియాతో మాట్లాడిన హరీష్‌రావు.. పోలీసులకు వార్నింగ్ ఇచ్చారు. ఏపీలో ఏమైందో పోలీస్ అధికారులు గుర్తుంచుకోవాలన్నారు. చట్టాలకు లోబడి మాత్రమే పోలీసులు పనిచేయాలని హితవుపలికారు. బీఆర్ఎస్ క్యాడర్‌పై అక్రమ కేసులు పెడితే సహించేది లేదన్నారు. కొందరు పోలీసు అధికారాలు తీరు మార్చుకోవాలన్నారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి (అఓ ఖీ।లజీనిబిర ఖీ।టటా) హయాంలో గుండాయిజం పెరిగిపోయిందన్నారు. అత్యాచారాలు నిత్యకృత్యంగా మారాయని తెలిపారు. తొమ్మిది నెలల కాలంలో 2 వేల అత్యాచారాలు జరిగాయన్నారు. మాజీ మంత్రి సునీతా లక్ష్మారెడ్డి ఇంటి మీదకు వెళ్ళి దాడి చేయటం దుర్మార్గమని ఆగ్రహం వ్యక్తం చేశారు. సునీతా లక్ష్మారెడ్డి ఇంటిపై దాడి చేసిన వారిపై కేసులు పెట్టాలని డీజీపీని డిమాండ్ చేస్తున్నట్లు మాజీ మంత్రి పేర్కొన్నారు. పార్టీ ఫిరాయింపులపై హరీష్ మాట్లాడుతూ.. ఇప్పటికైనా ఫిరాయింపులపై కాంగ్రెస్ బుకాయింపులు మానుకోవాలన్నారు. అబద్ధం అతికేటట్టు ఉండాలని మంత్రి శ్రీధర్ బాబు తెలుసుకోవాలని హితవుపలికారు. ఫిరాయింపులపై మంత్రి శ్రీధర్ బాబు తెలివితేటలు ప్రదర్శిస్తున్నారన్నారు. మర్యాదపూర్వకంగా అయితే సీఎంను పార్టీ మీటింగ్‌లో కలుస్తారా? అని ప్రశ్నించారు. అరికెపూడి గాంధీ సొంత నియోజకవర్గానికి సీఎం వస్తే.. ప్రకాష్ గౌడ్ ఎందుకొచ్చినట్లు అని అడిగారు. కాంగ్రెస్ నీతిని ప్రజలు గమనిస్తున్నారని. ప్రజాక్షేత్రంలో కాంగ్రెస్ కు శిక్ష తప్పదని హరీష్‌రావు హెచ్చరించారు.

## ఆర్టీసీ డ్రైవర్‌పై దాడికి యత్నం

**ఇద్దరిపై పోలీసుల కేసు**

**హైదరాబాద్, (క్రైమ్ మిర్రర్):** నగరంలో ఆర్టీసీ ఉద్యోగులపై దాడులు జరుగుతూనే ఉన్నాయి. తాజాగా అఫ్జల్‌గంజ్ నుంచి కుషాయిగూడకు వెళ్తున్న కుషాయిగూడ డిపోనకు చెందిన ఆర్టీసీ డ్రైవర్‌పై ఇద్దరు వ్యక్తులు దాడికి పాల్పడ్డారు. ఓయూ పీఎస్ పరిధిలో ఈ ఘటన చోటుచేసుకుంది. తమకు దారి ఇవ్వలేదనే కోపంతో దుండగులు బస్సును ఆపి డ్రైవర్‌పై దాడికి దిగారు. అప్రమత్తమైన డ్రైవర్, కండక్టర్.. దాడికి పాల్పడిన ఆటో ట్రాలీ డ్రైవర్ జాన్‌ను పట్టుకుని పోలీసులకు అప్పగించారు. మరో వ్యక్తి జగదీశ్‌ను కూడా పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టినట్లు పోలీసులు తెలిపారు. ఈనెల 20న అఫ్జల్‌గంజ్ నుంచి ఘట్‌కేసర్ వైపు వెళ్తున్న మెట్రో ఎక్స్‌ప్రెస్ బస్సులో విధులు నిర్వర్తిస్తున్న డ్రైవర్ గణెళిశ్‌పై కొంతమంది వ్యక్తులు విచక్షణారహితంగా దాడి చేసి గాయపరిచిన విషయం తెలిసిందే.

## సునీత ఇంటిపై దాడి హేయం

**ఖండించిన మాజీమంత్రి సబిత**

**హైదరాబాద్, (క్రైమ్ మిర్రర్):** సీనియర్ ఎమ్మెల్యే, మాజీ మంత్రి సునీతా లక్ష్మారెడ్డి ఇంటి మీద కాంగ్రెస్ గూండాలు చేసిన దాడిని తీవ్రంగా ఖండిస్తున్నట్లు బీఆర్ఎస్ ఎమ్మెల్యే సబితా ఇంద్రారెడ్డి పేర్కొన్నారు. ఈ మేరకు ఆమె ట్వీట్ చేశారు. ఎమ్మెల్యే సునీత ఇంటిపై దాడి చేసిన వారిని తక్షణమే అరెస్టు చేయాలని డీజీపీ జితేందర్‌ను సబితా ఇంద్రారెడ్డి డిమాండ్ చేశారు. మెదక్ జిల్లాలోని నర్సాపూర్ నియోజకవర్గం పరిధిలోని గోమారంలోని ఎమ్మెల్యే సునీత లక్ష్మారెడ్డి నివాసంపై ఆదివారం రాత్రి కాంగ్రెస్ గూండాలు దాడులకు పాల్పడిన సంగతి తెలిసిందే. ఎమ్మెల్యే సునీతా లక్ష్మారెడ్డి ఇంటిపై దాడి ఘటనలో నలుగురిపై కేసు నమోదు చేసినట్లు పోలీసులు తెలిపారు. మణిదీపక్ ఫిర్యాదుతో కాంగ్రెస్ కార్యకర్తలు రమేశ్, నరసింహా, భాస్కర్, సుధాకర్‌పై కేసు నమోదైనట్లు వివరించారు.



క్రైమ్ మిర్రర్
Voice of Anti Corruption

# ఎడిటోరియల్

4

మంగళవారం

24-9-2024

## ఎడిటోరియల్



# ఆత్మరక్షణలో పడ్డ మాజీ సీఎం జగన్

తిరుపతి లడ్డూ వ్యవహారం బయటపడటంతో జగన్ నిజాయితీ ప్రదర్శించి విచారణ కోరివుంటే బాగుండేది. ఓవైపు హిందూ సమాజం అట్టుడుకుతున్నా దీనిపై నిర్లక్ష్యంగా మాట్లాడారు. అందుకే ఇప్పుడు జగన్ ఐదేళ్ల పాలనను ఓసారి గుర్తుచేసుకోవల్సిన అవసరం ఎంతైనా ఉంది. 2019లో వైసీపీ అధికారంలోకి వచ్చినప్పటి నుంచి జగన్ చెప్పేవన్నీ అబద్దాలు.. చేసేవన్నీ మోసాలని

ఎన్నికల ఫలితాలతో ప్రజలు తేల్చేశారు. చివరకు సొంత చెల్లెళ్లు వైఎస్ షర్మిల, సునీతలు కూడా జగన్‌ను నమ్మడం లేదు. తండ్రి దివంగత వైఎస్ రాజశేఖర్ రెడ్డి పాలనలోనూ ఇంతటి ఘోరం జరగలేదని షర్మిల వాపోయారు. తిరుమలలో జరిగిందని అనుకుంటున్న మొత్తం వ్యవహారంపై సీబీఐతో విచారణ జరిపించాలంటూ కేంద్ర హోం మంత్రి అమిత్‌షాకు ఏపీ కాంగ్రెస్ అధ్యక్షురాలుగా షర్మిల లేఖ రాశారు.

తిరుపతి లడ్డూల తయారీలో ఉపయోగించే నెయ్యిలో కల్తీకి జగన్ ఎలా కారణమవుతారనే వాదనను కొందరు వినిపిస్తున్నారు. ప్రత్యక్షంగా జగన్ కారణం కాకపోయినా.. ప్రపంచ ప్రసిద్ధ పవిత్ర పుణ్యక్షేత్రం తిరుమలలో ఏం జరుగుతుందనేది తెలుసుకోవల్సిన బాధ్యత ప్రభుత్వంపై ఉంటుంది. టీటీడీ పాలకమండలిని నియమించేది రాష్ట్రప్రభుత్వమే. దీంతో పాలకమండలితో పాటు తిరుమలలో జరిగే పొరపాట్లకు ప్రభుత్వం బాధ్యత వహించాల్సి ఉంటుంది. కల్తీ నెయ్యిని సరఫరా చేస్తుంటే అధికారులు ఏం చేశారు.. అధికారులు నియంత్రించే ప్రయత్నం చేసినా ప్రభుత్వ పెద్దల ఆదేశాలతోనే కల్తీ నెయ్యి సరఫరా జరిగిందా అనేది విచారణలో తేలాల్సిఉంది.మొత్తంగాతిరుమల లడ్డు ప్రసాదం లో ఉపయోగించే నెయ్యి కల్తీ వివాదం రాజకీయ రంగు పులుముకుంది. ఓ వైపు భక్తులు ఆందోళన వ్యక్తం చేస్తుంటే.. మరోవైపు రాజకీయ నేతలు స్పందిస్తున్నారు. ఒకరు సుప్రీంకోర్టుకు వెళితే...మరొకరు హైకోర్టు తలుపులు తట్టారు. ఇంకొకరు సీబీఐ దర్యాప్తునకు డిమాండ్ చేశారు. ఇక ఈ విషయంపై కేంద్రం కూడా కదిలింది. రాష్ట్ర ప్రభుత్వాన్ని సమగ్ర నివేదిక కోరింది. తిరుమల శ్రీవారి లడ్డూలో కల్తీ వ్యవహారం...దేశవ్యాప్తంగా ఆగ్రహజ్వాలను పెంచింది. అంతేకాదు తదుపరి ఏం జరుగనుందనే ఆలోచన అందరిలోనూ కలుగుతుంది. పరమ పవిత్రమైన శ్రీవారి లడ్డూ ప్రసాదం కల్తీ అయిందనే వార్తలు భక్తుల్లో ఆందోళన, ఆగ్రహాన్ని రగిలి స్తున్నాయి. తిరుమల లడ్డూ వివాదంపై కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీ కూడా స్పందించారు. కల్తీ నెయ్యి ఘటన ఎంతో బాధ కలిగించిందని, ఇలాంటి ఘటనలతో ప్రపంచవ్యాప్తంగా భక్తుల మనోభావాలు దెబ్బతిన్నాయన్నారు. దీనిపై లోతైన విచారణ జరపాలన్నారు. ఇదే విషయంపై ఏపీ సీఎం చంద్రబాబుకు కేంద్ర మంత్రి బండి సంజయ్ లేఖ రాశారు. అన్యమతస్తులకు టిటిడి పగ్గాలు ఇవ్వడం వల్లే ఈ దుస్థితి వచ్చిందన్నారు. సిబిఐతో విచారణ జరిపిస్తేనే వాస్తవాలు నిగ్గు తేలుతాయన్నారు. కేంద్ర మంత్రులు ప్రల్హాద్ జోషి, గిరిరాజ్ సింగ్ కూడా ఈవ్యవహారంపై సీబీఐ విచారణ జరపాలని డిమాండ్ చేశారు. తిరుమల లడ్డూ విషయంలో ఏపీ సీఎం చంద్రబాబు చెప్పిన మాటలు చాలా తీవ్రమైనవని, ఆ వ్యవహారంపై సమగ్ర విచారణ జరగాలని, దోషులను కఠినంగా శిక్షించాలన్నారు. మన మధ్య హిందూ వ్యతిరేకులు ఉన్నారు, మమ్మల్ని క్షమించు వెంకటేశ్వర అంటూ కేంద్ర మంత్రి శోభా కరంద్లాజే ట్వీట్ చేశారు. ఈ విషయంలో ల్యాబ్ రిపోర్ట్ పంపించాలని ఏపీ సీఎం చంద్రబాబును కేంద్ర ఆరోగ్య శాఖ మంత్రి జేపీ నడ్డా కోరారు. ఆ నివేదికపై సమగ్ర పరిశీలన జరిపి తగిన చర్యలు తీసుకుంటామన్నారు. ఈ విషయంలో సుప్రీంకోర్టు జోక్యం చేసుకోవాలని, ఆలయాల పవిత్రత, మత విశ్వాసాలు, సంప్రదాయాలపై అవగాహన ఉన్నవారికే దేవాలయాల నిర్వహణ అప్పగించాలని కోరారు. దోషులను 48 గంటల్లో గుర్తించి, వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని, దీనిపై కాలయాపన చేస్తే ప్రభుత్వంపై యుద్ధం ప్రకటిస్తామని బీసీ యువజన పార్టీ అధ్యక్షుడు రామచంద్ర యాదవ్ హెచ్చరించారు. అయితే దోషులు ఎవరన్నది తేలాలి. విచారణ జరగాలి. దీనిని ప్రధానంగా కోరాల్సింది వైసిపియే. కానీ అలా చేయలేదు. తిరుమల లడ్డూ వివాదంపై హైకోర్టును వైసీపీ ఆశ్రయించింది. తమపై తప్పుడు ఆరోపణలు చేస్తున్నారంటూ కోర్టులో లంచ్ మోషన్ పిటిషన్ దాఖలు చేసింది ఆ పార్టీ. ఈ విషయంపై సిట్టింగ్ జడ్జి లేదా కోర్టు నియమించిన కమిటీ ద్వారా విచారణ జరిపించాలని కోరింది. వచ్చే బుధవారం నాడు పిటిషన్‌ను విచారిస్తామంది కోర్టు. సీబీఐ విచారణకు డిమాండ్లు, హైకోర్టు, సుప్రీంకోర్టులో పిటిషన్లు వేయడంతో.. సర్వత్రా ఉత్కంఠ నెలకొంది. నిజానికి మోసపూర్తి విధానాల కారణంగా జగన్ పాలన అవసరం లేదని ప్రజలు తీర్పునిచ్చారు. అధికారంలోకి వచ్చిన తర్వాత జగన్ మాటలతో ప్రజలను మభ్యపెట్టే ప్రయత్నం చేశారు. ప్రజలకు ఇచ్చిన హామీలన్నీ అమలు చేశానంటూ ప్రచారం చేసుకున్నారు. జగన్ పైకి చెప్పేది ఒకటి.. చేసేది మరొకటని తాజాగా ఆ పార్టీ నాయకులే చెబుతున్నారు. జగన్ వ్యవహారశైలి నచ్చకపోవడంతో కొందరు నాయకులు పార్టీకి రాజీనామా చేశారు. జగన్ ఆలోచనల్లోనే మాయ, మోసం దాగి ఉంటాయనే చర్చ సాగుతోంది. లడ్డూ ప్రసాదంలో కల్తీ నెయ్యి వివాదంలో టీటీడీ ఈఓ నివేదిక కీలకంగా మారనుంది.. టీటీడీ లడ్డూ కల్తీ నెయ్యి విషయంలో పూర్తిస్థాయి నివేదిక ఇవ్వాలని ఏపీ ప్రభుత్వం ఈఓను ఆదేశించింది. టీటీడీ ఈఓ శనివారం ప్రభుత్వానికి నివేదిక ఇవ్వనున్నారు. టెండర్ పక్రియ, పాల్గొన్న సంస్థలు, తక్కువ రేట్ కు కోట్ చేయడం వెనుక కారణాలు అన్నింటితో సమగ్ర విచారణ చేసి నివేదిక ఇవ్వాలని టీటీడీ ఈఓకు ప్రభుత్వం సూచించింది.. దీంతో ఆ నివేదికను తీసుకుని సీఎం చంద్రబాబును టీటీడీ ఈవో కలవనున్నారు. ఈ సందర్భంగా కల్తీ వివాదం, నెయ్యి కొనుగోలు, రిపోర్టులతోపాటు పలు విషయాల గురించి చంద్రబాబుకు వివరించనున్నారు.

# తిరుమలలో అన్యమతస్థుల వల్లనే ఈ దుస్థితి !

తిరుమల లడ్డూకు జరిగిన అపచారం విషయంలో నిజానిజాలు నిగ్గు తేల్చాల్సిన బాధ్యత అందరిపైనా ఉంది. కల్తీ నెయ్యి అదికూడా జంతువుల కొవ్వు కలిపిన నెయ్యి వాడిన విషయం కోట్లాది హిందువుల మనోభావాలను దెబ్బతీసింది. ఇందులో దోషం ఉంటే గత ఐదేళ్లుగా సాగిన వ్యవహారంపై నిజాయితీగా విచారణ జరగాలి. దోషులను కఠినంగా శిక్షించాలి. అన్యమతస్థులకు తిరుమల తిరుపతి దేవస్థానం వ్యవహారాల్లో స్థానం లేకుండా చేయాలి. హిందూ దేవాలయాల్లో అన్యమతస్థుల జోక్యం, పెత్తనం లేకుండా చేయాలి. ఇప్పటికైనా ధర్మసంస్థలు ముందుకు రావాలి. రాజకీయ నేతలను తిరుమల బోర్డులో లేకుండా చేయాలి. జాతీయ స్థాయిలో హిందూధర్మ ప్రచారపరిషత్ ఏర్పడాలి. దేవాలయాల్లో ఇతరుల, రాజకీయాల పెత్తనం లేకుండా చేయాలి. అలాగే కల్తీ నెట్టి విషయంలో తక్షణమే చర్యలకు ఉపక్రమించాలి. ఇకపోతే కల్తీనెయ్యి ఉపయోగించారన్న విసయం బయటకు రాగానే గతంలో సిఎంగా పనిచేసిన జగన్, ఆయన హయాంలో టిటిడి ఛైర్మన్లుగా పనిచేసిన వారు రాజకీయ విమర్శలు చేయడం ఇంకా పాపం. వారి మనోభావాలు దెబ్బతినే వ్యవహారం కాదు కనుక దీనిని రాజకీయ కోణంలోనే చూశారు. చంద్రబాబు రాజకీయ ఎత్తుగడలు అని జగన్ వ్యాఖ్యానించడానికి మించిన పాపం మరోటి కాదు. నిజానికి ఈ వ్యవహార మంతా జగన్ కనుసన్నల్లోనే జరిగిందని భావించాలి. తిరుపతి లడ్డూలో కల్తీ అంశం కలకలం రేపింది. కోట్లాది మంది భక్తుల విశ్వాసాలతో ముడిపడి ఉండటంతో ప్రతి ఒక్కరూ ఈ అంశంపై తీవ్రంగానే స్పందించారు. అయితే దీనిని ఖండించి, విచారణ కోరాల్సిన మాజీ ప్రభువులు మాత్రం శ్రీవారి లడ్డూను జంతువుల కొవ్వుతో అపవిత్రం చేసిన వ్యవహారం జాతీయ స్థాయిలో గగ్గోలు రేపుతోంది. లడ్డూ తయారీకి గత ప్రభుత్వం వాడిన నెయ్యిలో జంతువుల కొవ్వు కలిసి నట్టు తేలడంతో వైసీపీ నిర్వాకంపై సర్వత్రా ఆగ్రహ



నెయ్యి వాడారన్న విషయం బయటకు రావడంతో వైసీపీ అధ్యక్షులు జగన్ కించిత్ కూడా భయం లేదా బాధను వ్యక్తం చేయడం లేదు. ఇదేదో చంద్రబాబు వ్యవహారంగా కొట్టి పారేశారు. ఇలా జరిగిన విషయం తెలియగానే అందుకు కారకులైన వారిపై చర్య తీసుకోవాలని కోరుతారని అంతా భావించారు. కానీ చంద్రబాబు డైవర్షన్ పాలిటిక్స్ అంటూ చేసిన ప్రకటన ఈ దోషం నుంచి తప్పించుకునే చర్యలకు పరాకాష్టగా చూడాలి. వైకాపా పార్టీ శ్రేణులు జగన్ వైఖరిపై తమ అభిప్రాయాలను చెప్పాలి. వైసీపీ అధికారంలో ఉన్న సమయంలోనే.. జగన్ తాబేదారులు అయిన అన్యమతస్థులు టిటిడి ఛైర్మన్లుగా ఉన్న సమయంలోనే ... తిరుపతి లడ్డూ నాణ్యత, రుచి తగ్గిందంటూ వరుస ఆరోపణలు వచ్చాయి. ప్రసాదం లడ్డూ నాణ్యతలో రాజీపడేది లేదంటూ అప్పటి ప్రభుత్వం వివరణ ఇచ్చిన సందర్భాలు కూడా ఉన్నాయి. ప్రసాదం తయారీలో రుచిని పెంచేది నాణ్యమైన నెయ్యి. ఆవునెయ్యి ఔషధ గుణాలు కలిగి ఉంటుంది. అందుకే వైద్యశాస్త్రంలో దీనికి ప్రత్యేక స్థానం ఉంది. ఆయుర్వేద వైద్యంలో దీనిని విరివిగా ఉపయోగిస్తారు. అలాంటి ఆవునెయ్యి రోజుకు వందల కిలోలు తిరుమల శ్రీవారి లడ్డూ తరయారీలో వినియోగానికి అవసరం. ఇలాంటి నెయ్యి విషయంలో, స్వామి వారికి నైవేద్యం విషయంలో ఇతర మతాల వారికి విశ్వాసం ఉండకపోవచ్చు. ఇప్పుడు అదే జరిగింది. గత ఐదేళ్లో తిరుమలలో ఇంకేం జరిగిందన్నది కూడా తెలుసుకోవాల్సిన అవసరం ఇప్పుడు ఉంది. ఎందుకంటే శ్రీవారికి ఆవు నెయ్యి పేరుతో సరఫరా చేసిన నేతిలో కల్తీ జరిగిందంటూ ప్రస్తుతం ల్యాబ్ నివేదికలు బయటపడ్డాయి. దీంతో ఒక్కసారిగా దేశ వ్యాప్తంగా ఈ భిన్నంగా స్పందించారు. ఇది ఎక్కడ తమకు చుట్టుకుంటుందో అని ముందే గ్రహించి, చంద్రబాబుతో ఉన్న రాజకీయ విభేదాలకు ముడిపెట్టారు. జగన్ కల్తీ నెయ్యి మరకలు తనకు అంటకుండా టీడీపీ కూటమి ప్రభుత్వానికి అంటించే ప్రయత్నం చేస్తున్నారు. తమ పార్టీ అధికారంలోకి రాకముందే నెయ్యిలో కల్తీ జరిగిందంటూ ప్రచారం చేసే ప్రయత్నం చేసారు. ఒకవేళ అలా జరిగివుంటే ఆయన తన ఐదేళ్ల కాలంలోనే చంద్రబాబుపై ఎందుకు చర్యలు తీసుకోలేక పోయారన్నది కూడా ముఖ్యం. అలాగే ఎప్పటి నుంచి కల్తీ జరిగినా విచారణ చేయాల్సిందే. ఒకవేళ చంద్రబాబు హయాంలోనే జరిగినా విచారణ జరగాల్సిందే. నిజానికి తిరుమలలో టిటిడి బోర్డు ఎప్పుడూ నెయ్యి నాణ్యత విషయంలో రాజీపడలేదు. వాస్తవానికి 2014–19 మధ్య కాలంలో అంటే చంద్రబాబు హయాంలో తిరుమలలో ప్రసాదం తయారీకి బ్రాండెండ్ నెయ్యిని ఉపయోగించేవారు. ప్రసాదం తయారీ కోసం నాణ్యత కలిగిన పదార్థాలను మాత్రమే వాడేవారు. నెయ్యి కొరత ఉన్నా తిరుమలలో అధికారులు ఎక్కడా రాజీపడలేదు. వైసీపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత నెయ్యి నాణ్యత విషయంలో రాజీపడ్డారు. లడ్డూ నాణ్యత తగ్గుతోందన్న ఆరోపణలను పట్టించుకోలేదు. అలాగే ఇష్టం వచ్చినట్లుగా తిరుమల వ్యవహారాలను మార్చేశారు. అవసరమైన స్వచ్ఛమైన నెయ్యి మార్కెట్‌లో అందుబాటులో లేకపోయినా కల్తీ నెయ్యి వినియోగించారనే విషయం ఇప్పుడు స్పష్టమవుతోంది. తాజాగా ల్యాబ్ రిపోర్టులు నెయ్యిలో కల్తీ జరిగిందని స్పష్టం చేయడంతో వైసీపీ అసలు రంగు బయట పడింది. ఇది ప్రజల మనోభావాలతో ముడిపడి ఉన్న వ్యవహారం. అందుకే జ్వాలలు ఎగసిపడుతున్నాయి. ఆధ్యాత్మిక ప్రాధాన్యం కలిగిన లడ్డూను కలుషితం చేయడాన్ని కేంద ప్రభుత్వం తీవ్రంగా పరిగణించింది. దీనిపై కేంద్ర స్థాయిలో విచారణ జరిపించేందుకు సిద్ధమైంది. బీజేపీ జాతీయ అధ్యక్షుడు, కేంద్ర ఆరోగ్య శాఖ మంత్రి జేపీ నడ్డా శుక్రవారం సీఎం చంద్రబాబుకు ఫోన్ చేసి వివరాలు అడిగి తెలుసుకున్నారు. హిందూ విశ్వాసాల పట్ల ఇది కుట్ర, ద్రోహం, క్షమించరాని నేరమంటూ కేంద్ర మంత్రులు ప్రహ్లాద్ జోషి, గిరిరాజ్ సింగ్, బండి సంజయ్, పలువురు ఎన్డీయే, బీజేపీ జాతీయ నేతలు తీవ్రంగా స్పందించారు. మరోవైపు, 'కలియుగ దైవానికి ఇంత అపచారామా' అంటూ కోట్లాదిమంది భక్తులు, ప్రభుత్వ నేతలు, వివిధ రంగాల ప్రముఖులు చలించి పోతున్నారు. దీనిపై సుప్రీంకోర్టు జోక్యం చేసుకోవాలని ఒకవైపు,కేంద్ర దర్యాప్తు సంస్థను రంగంలోకి దింపాలని మరోవైపు ఒత్తిడి పెరిగిపోతోంది. శ్రీవారినీ, భక్తులనూ కొల్లగొట్టిన జగన్‌ను, అప్పటి అదనపు ఈవో ధర్మారెడ్డిని శిక్షించాలంటూ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలకు, డీజీపీకి లేఖలు అందుతున్నాయి. తిరుమల పవిత్రతను కాపాడాలంటూ సుప్రీంకోర్టు చీఫ్ జస్టిస్‌కు లేఖ రూపంలో పిటిషన్ దాఖలైంది. జగన్‌పైనా, కల్తీ నెయ్యిని సరఫరా చేసిన కాంట్రాక్ట్ సంస్థలపైనా జాతీయ భద్రతా చట్టం కింద చర్య తీసుకోవాలని కేంద్ర హోంమంత్రి అమిత్‌షాకు, డీజీపీ ద్వారకా తిరుమలరావుకు లేఖ రాశారు. ఇది సనాతన ధర్మంపై కుట్ర, దాడిగా పరిగణించాలని అయోధ్య ప్రధాన పూజారి సత్యేంద్ర దాస్ ఆగ్రహం వ్యక్తంచేశారు. మొత్తంగా ఈ వ్యవహారంలో నిగ్గు తేలాలి. దోషులు ఎవరైనా వదిలి పెట్టరాదు.

(ఆధ్యాత్మిక చింతన)

## నాణ్యతను పరీక్షించే ల్యాబ్ ఏర్పాటులో నిర్లక్ష్యం


### అవకాశం ఉన్నా పట్టించుకోని టిటిడి బోర్డు

తిరుమలలో నాణ్యతను పరీక్షించే ల్యాబ్ లేకపోవడం దురదృష్టకరం. నెయ్యి కావచ్చు..ఇతర పదార్థాల నాణ్యతను గుర్తించాలంటే పరీక్షలకు ఇతర ప్రాంతాలకు వెళ్లాల్సిన దుస్థితి ఉంది. కలియుగ వైకుంఠనాథుడు శ్రీనివాసుడి దర్శనం కోసం వందల కిలో మీటర్ల ప్రయాణం చేస్తారు. క్షణకాలం పాటు దర్శనం చేసుకుని పునీతులు అవుతారు. తమ కోర్కెలు తీర్చిన భగవంతుడికి తమ వద్ద ఉన్న మేరకు కానుకలు సమర్పిస్తారు. ఇలా ప్రతిరోజు తిరుమల శ్రీవారి దర్శనం కోసం వచ్చే భక్తులు హుండీ ద్వారా సమర్పించే కానుకలు రూ. 3 నుంచి 5 కోట్లు వరకు రద్దీ దృష్ట్యా మారుతూ ఉంటుంది. ప్రపంచ వ్యాప్తంగా కోట్లాది మంది భక్తులు మనోభావాలు దెబ్బతిసే పరిస్థితి ఏర్పడింది. టీటీడీ వంటి ధార్మిక సంస్థ చేసే అనేక కార్యక్రమాలు..ఉత్సవాలు..క్యూ లైన్ నిర్వహణ.. టికెట్ల విక్రయం.. ప్రసాదాల తయారీ.. వాటి పంపిణీ.. నిరంతరాయంగా పారిశు ధ్యం..ప్రకృతి...వసతి సముదా యాలు ఇలా టీటీడీ శ్రీవారి భక్తుల కోసం చేసే పనులు అందరికి ఆదర్శంగా నిలుస్తున్నాయి. వీటిని చూసి నేర్చుకోవడానికి అనేక దేవాలయాలు అధికారులు పలుమార్లు పర్యటించారు. ఎంతో పవిత్రంగా భావించే స్వామి వారి లడ్డూ, నైవేద్యాల్లో వాడే ముడి సరుకులు పరీక్షించేందుకు టిటిడి ల్యాబ్ ఎందుకు ఏర్పాటు చేయలేదు అనేది భక్తుల ప్రశ్న. టీటీడీ కోరితే కోట్లాది రూపాయలు ఏ రూపంలో అయిన అందించేందుకు వేలాది మంది భక్తులు వేచి ఉన్నారు. టీటీడీ ట్రస్టులకు, విద్య, వైద్య ఇతర కార్యక్రమాలకు సంబంధించి అనేక మంది విరాళాలు సమర్పిస్తుంటారు. ఇలాంటి చోట టీటీడీ ఒక ల్యాబ్ ను అయితే ఏర్పాటు చేసుకుని ఉంది. ఇప్పటి నాయకులు పాలకులు ల్యాబ్ అయితే ఏర్పాటు చేశారు కాని దానికి సంబంధించి నిపుణులు ఎవ్వరు లేరు. 2015, 2016 లో ల్యాబ్ ఏర్పాటు చేసినా పని చేసే వారు లేక మరుగున పడింది. ఇక్కడ నామమాత్రపు తనిఖీ చేసే వారు.. రాను రాను అది పూర్తిగా మరుగున పడిపోయింది. ప్రస్తుతం ఎవరో రిటైర్ అయిన ఉద్యోగి ఇక్కడ నాణ్యత ప్రమాణాలు పరీక్ష చేస్తున్నారని చెబుతున్నారు. ప్రభుత్వాలు.. ఇంత మంది పాలకమండలిలు... అనేక మంది అధికారులు ల్యాబ్ ఏర్పాటు పై దృష్టి పెట్టలేదు.

# రాజకీయ పెత్తనమే తిరుమల పవిత్రతకు దెబ్బ

### రాజకీయ పెత్తనం నుంచి టిటిడిని బయటపడేయాలి

తిరుమల తిరుపతి దేవస్థానాలకు ప్రత్యేకమైన వ్యవస్థ ఉంది. పేరుకు స్వతంత్ర బోర్డు ఉంటుంది కానీ.. ప్రభుత్వ కనుసన్నల్లోనే ఉంటుంది. టీటీడీ బోర్డుకు రాజకీయనాయకుల్నే చైర్మన్లుగా నియమిస్తున్నారు. సభ్యులుగా రాజకీయ నేతలు, వ్యాపారులు, పారిశ్రామిక వేత్తలు ఉంటున్నారు. వీరే టీటీడీని నడిపిస్తారు. ఈవోగా ఐఏఎస్ అధికారి ఉన్నప్పటికీ కీలకమైన నిర్ణయాలు రాజకీయ పరంగానే సాగుతాయి. ఎందుకంటే ప్రభుత్వం ఆగ్రహిస్తే ఈవో పదవి ఉండదు. అందుకే ఏ పార్టీ అధికారంలో ఉంటే.. ఆ పార్టీ నేతలు చైర్మన్లుగా. సభ్యులుగా ఉంటారు. ఈవో వారు చెప్పింది చేస్తారు. ఇక్కడే అక్రమాలకు బీజం పడుతోంది. తిరుమల తిరుపతి దేవస్థానం అంటే.. వేల కోట్ల బ్జడెట్ మాత్రమే కాదు.. కోట్లాది మంది హిందువుల మనోభావాలు కాపాడాల్సిన బాధ్యత ఉన్న సంస్థ. ఈ సంస్థకు వైసీపీ అధికారంలోకి వచ్చిన తర్వాత చైర్మన్ గా వైవీ సబ్బారెడ్డి నాలుగేళ్ల పాటు ఉన్నారు. అలాగే రక్షణ శాఖలో పని చేస్తూ.. డిప్యూటేషన్ మీద ఏపీకి వచ్చిన ధర్మారెడ్డి పూర్తిగా ఐదేళ్ల కాలం అనేక సార్లు తన డిప్యూటేషన్ పొడిగించుకుంటూ తిరుమలలోనే కొనసాగారు చివరికి ఆయనకు ఈవో పోస్టింగ్ ఇచ్చారు. సహజంగానే సీనియర్ ఐఏఎస్‌లకు మాత్రమే ఈవో పోస్టింగ్ ఇస్తారు. అర్హత లేకపోయినా పదవి ఇచ్చారని కొంత మంది కోర్టుల్లోనూ పిటిషన్లు వేశారు. ధర్మారెడ్డి వ్యవహారశైలి... ఆయన టీటీడీలో పాతుకు పోవడంపై అనేక విమర్శలు వచ్చాయ. చివరిలో భూమన కరుణాకర్ రెడ్డిని టీటీడీ చైర్మన్ ను చేశారు. ఆయన పైనా అనేక ఆరోపణలు వచ్చాయి. మొత్తంగా ఐదేళ్ల పాటు టీటీడీ వివాదాల మయంగా మారింది.శ్రీవారి లడ్డూ ప్రసాదం ఉత్కృష్టమైనది. భౌగోళిక గుర్తింపు ఉన్న వంటకం. ఆ లడ్డూ పవిత్రత కాపాడటానికి అత్యంత నాణ్యమైన సరుకుల్నే కొనుగోలు చేయాలి. ఇది రోజువారీ అన్న క్యాంటీన్ల లేదా మధ్యాహ్న భోజనానికి సంబంధించిన టెండర్లు కాదు. అతి తక్కువకు ఇస్తామని టెండర్లు వేస్తే.. ఎలా ఇస్తారో ఆలోచించకుండా టెండర్లు ఇవ్వడం అనేది దుర్మార్గమైన విషయం. స్వచ్ఛమైన ఆవు నెయ్యి రూ. వెయ్యి వరకూ అవతుందని డెయిరీ నిపుణులు చెబుతారు. మరి టీటీడీ పెద్దలకు ఎందుకు తెలియలేదో కానీ. మూడు వందలకు.. నాలుగు వందలకు ఇస్తామని చెప్పగానే టెండర్లు ఇచ్చేశారు. క్క లీటర్‌కు వంద.. రెండు వందలు నష్టం చేసుకుని వేల లీటర్లు ఏ కంపెనీ మాత్రం సరఫరా చేస్తుంది. అత్యంత నాసిరకం.. కల్తీ నెయ్యిని సరఫరా చేసి దొరికిపోయారు. ఇది చిన్న విషయం కాదు. ప్రపంచవ్యాప్తంగా హిందువుల మనోభావాలను దెబ్బతీసింది. టీటీడీలో గతంలో పని చేసిన పాలక మండళ్లు.. ఇలా రోజువారీ కొనుగోళ్లు..క్వాలిటీ అంశంలో జోక్యం చేసుకోవు. అధికారులే అత్యంత జాగ్రత్తగా ఉంటారు. కానీ గత ప్రభుత్వంలో ఏర్పాటు చేసిన టీటీడీ బోర్డు ప్రతి విషయంలోనూ జోక్యం చేసుకుని ప్రతి టెండర్ ఎవరికి దక్కాలో డిసైడ్ చేసుకుని ఆ మేరకు టెండర్లు..రివర్స్ టెండర్ల పక్రియ నిర్వహించేవారన్న ఆరోపణలు వచ్చాయి. అందులో భాగంగానే సామర్థ్యం లేని కంపెనీలు టెండర్లలో పాల్గొని తక్కువ ధరకు సరఫరా చేస్తామని ముందుకు



వచ్చినా అంగీకరించారని అంటున్నారు. ఈ కంపెనీలకు టెండర్లు దక్కడం వెనుక కీలక పరిణామాలు ఉన్నాయని.. దర్యాప్తులో అన్నీ బయటకు వస్తాయని అంటున్నారు. టీటీడీ లాంటి ఆలయాలను నిర్వహించడం ఆషామాషీ కాదు. స్వార్థ పరుల చేతుల్లో పడితే అనేక సమస్యలు వస్తాయి. దేవుడండే భయం, భక్తి ఉన్న వారు అయితేనే సక్రమంగా నిర్వహించగలరని.. అలాంటి అధ్యాత్మక వాదులకే పాలక మండలిలో చోటు కల్పిస్తేనే పరిస్థితులు మెరుగుపడుతాయన్న వాదన వినిపిస్తోంది.

# గుంత పూడ్చండి మహా ప్రభో...!

## ప్రమాదకరంగా మారిన డ్రైనేజీ గుంత

## ఇబ్బందులు పడుతున్న గాంధీనగర్ ప్రజలు

## చిన్నారులు అటుగా వెళ్తే ప్రమాదమే





మునుగోడు క్రైమ్ మిర్రర్: మునుగోడు మండల కేంద్రంలో గత నెల రోజుల క్రితం ఎంఎల్ఏ రాజగోపాల్ రెడ్డి పలు వార్డులు కలియతిరిగి ప్రజలను అడిగి సమస్యలను తెలుసుకున్నారు..రెండవ వార్డు గాంధీనగర్ కాలని పాత గ్రంథాలయం,కరెంటు ఆఫీసు కు వెళ్ళే రోడ్డులో వున్న డ్రైనేజీ వ్యవస్థ సరిగలేక ఇబ్బందులు పడుతున్నామని ప్రజలు ఎంఎల్ఏ దృష్టికి తీసుకెళ్లడంతో ప్రజలకు ఇబ్బందులు కలుగకుండా వెంటనే డ్రైనేజీ పనులు చేపట్టాలని అధికారులను ఆదేశించారు.. రోజులు గడుస్తున్న కానీ డ్రైనేజీ పూర్తి కాక,ప్రజలు అనేక ఇబ్బందులు పడుతున్నారు..అక్కడ తీసిన గుంతలో చిన్న పిల్లలు ఆడుకుంటూ వెళ్లి అందులో పడితే ప్రమాదం జరిగే పరిస్థితి నెలకొందని,రాత్రి పూట అదుపుతప్పి బైక్ లు పడటం జరిగిందని కాలని వాసులు పేర్కొన్నారు.కనీసం ప్రమాద సూచికలు ఏర్పాటు చేయకపోవడంపై అధికారులపై మండిపడుతున్నారు.గుంత తీసి అధికారులు గాలికి వదిలివేయడంపై మండిపడుతున్నారు..సంబంధిత అధికారులు వెంటనే ప్రమాదకరంగా వున్న గుంతను పూడ్చాలని కోరుతున్నారు.



## పరిసరాల పరిశుభ్రతపై ప్రజలు అవగాహన పెంచుకోవాలి

### మణికొండ మున్సిపాలిటీ కౌన్సిలర్ రామకృష్ణారెడ్డి

గండిపేట్(క్రైం మిర్రర్): పరిసరాల పరిశుభ్రతపై ప్రజలు అవగాహన పెంచుకోవాలని మణికొండ మున్సిపాలిటీ కౌన్సిలర్ రామకృష్ణారెడ్డి అన్నారు. మణికొండ మున్సిపాలిటీలోని 19వ వార్డు ప్రభుత్వ పాఠశాల విద్యార్థులకు స్వచ్ఛత సేవా పచ్చదనం%-%పరిశుభ్రతపై అవగాహన కల్పించారు. ప్రధానోపాధ్యాయులు నిరంజన్ ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిథిగా హజరై విద్యార్థుల చేత ప్రతిజ్ఞ చేయించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గృహ నివాసం దారులు తడి, పొడి చెత్తను వేరు చేసి ఇంటి వద్దకు వచ్చే చెత్త సేకరణ కార్మికులకు అందించాలన్నారు. పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందన్నారు. ఈ కార్య క్రమంలో నార్సింగి మార్కెట్ కమిటి మాజీ వైస్ బుద్దోళ్ల శ్రీరాములు, నాయకులు బషీర్, ఏర్పులకుమార్, శ్రావణ్‌కుమార్, గంగాధర్, ఆరిఫ్, మున్సిపాలిటీ ఎన్విరాల్‌మెంటల్ ఇన్‌చార్జీ సంపత్, శానిటేషన్ ఇన్‌స్పెక్టర్ సాజిత్, శానిటేషన్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## మహిళలు తలచుకుంటే సాధించలేనిది ఏది లేదు

### రాజేంద్రనగర్ నియోజకవర్గ ఎమ్మెల్యే టి.ప్రకాష్‌గౌడ్



గండిపేట్(క్రైం మిర్రర్): మహిళలు తలచుకుంటే సాధించలేనిది ఏది లేదని రాజేంద్రనగర్ నియోజకవర్గ ఎమ్మెల్యే టి.ప్రకాష్‌గౌడ్ అన్నారు. ఇందిరా మహిళా శక్తి వారి ఆధ్వర్యంలో మెప్మా వారి సౌజన్యంతో నార్సింగి మున్సిపాలిటీ పరిధిలోని ఖానాపూర్‌లో పర్యావరణ రహిత విస్తరాకుల తయారీ కేంద్రాన్ని ఆయన ముఖ్య అతిథిగా హజరై ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ రంగారెడ్డి జిల్లాలోనే మొట్టమొదటి మహిళా సంఘం సభ్యులచే ఇందిరా మహిళా శక్తి పథకంలో భాగడంగా శ్రీ లక్ష్మి స్వయంకృషి పర్యావరన విస్తరాకుల తయారీ కేంద్రం ప్రారంభించడం అభినందనీయమన్నారు. పర్యావరణానికి మేలు చేసే ఆకులతో ఇస్తరాకుల తయారు చేయడం చాలా సంతోషకరమన్నారు. వీరి స్ఫూర్తితో మహిళా సంఘం సభ్యులు ఇందిరా మహిళా శక్తి పథకాన్ని ఉపయోగించుకోని స్వయం సంవృద్ధి సాధించాలన్నారు. ఈ కార్యక్రమంలో నార్సింగి మున్సిపల్ చైర్ పర్సన్ నాగపూర్ణశ్రీనివాస్, వైస్ చైర్మన్ విజయ్ బాబు, మాజీ ఎంపీపీ తలారి మల్లేష్, గండిపేట్ మండల అధ్యక్షులు అశోక్ యాదవ్, మాజీ సర్పంచ్ గండయ్య కౌన్సిలర్లు, ప్రవళిక కిరణ్, యాదమ్మ, అమరేందర్ రెడ్డి, పార్టీ నాయకులు, కార్యకర్తలు, ప్రజాప్రతినిధులు, మెప్మా ృఅధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.





## ఘనంగా ముఖ్యర్ల మల్లేష్ జన్మదిన వేడుకలు

సంస్థాన్ నారాయణపూర్, సెప్టెంబర్ 23(క్రైమ్ మిర్రర్): యాదాద్రి భువనగిరి జిల్లా నారాయణపుర్ మండలం అల్లందేవిచెరువు గ్రామ పరిధిలోని నాగవరిగూడెం గ్రామంలో ముఖ్యార్ల మల్లేష్ జన్మదిన వేడుకలు ఘనంగా నిర్వహించారు.ఈ వేడుకల్లో ముఖ్యర్ల మల్లేష్ కేక్ కట్ చేసి, స్వీట్ పంపిణీ చేశారు. ఈ జన్మదిన వేడుకల్లో వేడుకల్లో పాల్గొన్న ప్రతి ఒక్కరు జన్మదిన శుభాకాంక్షలు తెలియజేశారు. రాబోయే రోజులలో యువకులకు ఆదర్శంగా నిలబడతానని తన యొక్క జన్మదిన సందర్భంగా తెలియజేయడం జరిగిందిఈ కార్యక్రమంలో వార్డు సభ్యులు ముక్కార్ల స్వామి యాదవ్ జెనిగల కిరణ్, అన్యాలపు కిరణ్, అన్యాలపు లింగస్వామి, దోటీ స్వామి, ఏలిమేనేటి రాజేందర్, బద్దుల శ్రీకాంత్, వంటల లింగస్వామి, అన్యాలపు అనిల్, ముఖ్యర్ల స్వామి, ఎలిమినేటి శ్రీనివాస్ రెడ్డి జక్కా భరత్ రెడ్డి, స్నేహితులు తదితరులు పాల్గొన్నారు.

## మాజీ మంత్రి మహేందర్‌రెడ్డికి జన్మదిన శుభాకాంక్షలు తెలిపిన ఎమ్మెల్యే ప్రకాష్‌గౌడ్






గండిపేట్(క్రైం మిర్రర్): శాసన మండలి సభ్యులు, మాజీ మంత్రి పట్నం మహేందర్‌రెడ్డి జన్మదిన వేడుకలు సోమవారం ఘనంగా జరిగాయి. రాజేంద్రనగర్ నియోజకవర్గ ఎమ్మెల్యే టి.ప్రకాష్‌గౌడ్ ఆధ్వర్యంలో పట్నం మహేందర్‌రెడ్డిని కలిసి పూలబోకే, శాలువాలతో ఘనంగా సన్మానించి జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో నాయకులు పాల్గొన్నారు.

## తుక్కుగూడ మున్సిపాలిటీలో హర్షగూడ విలీనం

### హర్షం వ్యక్తం చేసిన హర్షగూడ గ్రామస్తులు



మహేశ్వరం ప్రతినిధి క్రైమ్ మిర్రర్): మహేశ్వరం నియోజకవర్గం తుకుగూడ మున్సిపాలిటీలో మరోగ్రామాన్ని విలీనం చేసిన ప్రభుత్వం.గతంలో గ్రామపంచాయితీగా ఉన్న హర్ష గూడ ఇప్పుడు తుక్కుగూడ మున్సిపాలిటీలో విలీనం చేసారు. తెలంగాణ రాష్ట్ర కమిషనర్ డైరక్టర్ మున్సిపల్ అడ్మినిస్ట్రేషన్ ఆధ్వర్యంలో పిఆర్‌ఓసి నం.720450/2024/%ట%1ప్రకారం హర్షగూడ గ్రామపంచాయితీని తుక్కుగూడ పురపాలక సంఘంలో విలీనం చేసారు. హర్ష గూడ గ్రామపంచాయతీ రికార్డులను 23.09.2024సోమవారం జాయింట్ డైరక్టర్ శ్రీధర్ ఆధ్వర్యంలో స్వాధీనం చేసుకున్నారు ఈ కార్యక్రమంలో కార్యక్రమంలో మున్సిపల్ చైర్ పర్సన్ కాంటేకార్ మధుమోహన్,వైస్ చైర్ పర్సన్భవాని వెంకట్ రెడ్డి ఎంపిడిఓ పి.శైలజ రెడ్డి మున్సిపల్ కమీషనర్ బి.వెంకట్ రామ్ మేనేజర్ టి.పర్వతాలు,వెంకటేష్ ఆర్ ఐ.మల్లేష్,కౌన్సిల్ సభ్యులు కొప్పుల పద్మ శివయ్య,జాపాల భావన సుధకర్,హర్ష గూడ పంచాయతీ కార్యదర్శి మనీషరెడ్డి,హర్ష గూడ మాజీ సర్పంచ్ పాండు నాయక్,ఉప సర్పంచ్, వార్డు సభ్యులు, గ్రామా యువకులు తదితరులు పాల్గొన్నారు.

## ప్రజావాణికి మూడు ఫిర్యాదులు

గండిపేట్(క్రైం మిర్రర్): ప్రజల సమస్యలను తెలుసుకునేందుకు ప్రతి సోమవారం సర్కిల్ కార్యాలయంలో ప్రజావాణి కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నామని రాజేంద్రనగర్ సర్కిల్ ఉపకమీషనర్ రవికుమార్ సూచించారు. సోమవారం సర్కిల్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన ప్రజావాణి కార్యక్రమానికి మూడు ఫిర్యాదులు అందినట్లు తెలిపారు. బాబుల్‌రెడ్డినగర్, శివరాంపల్లి ప్రాంతాలకు చెందిన వారు పలు సమస్యలపై ఫిర్యాదు చేశారన్నారు. వీటిని వెంటనే సంబంధిత అధికారులకు పంపించామని త్వరలోనే పరిష్కారం అవుతాయన్నారు. ప్రజలకు ఎలాంటి సమస్యలు ఉన్నా ప్రజావాణికి వచ్చి ఫిర్యాదు చేసుకోవాలన్నారు. వాటిని సాధ్యమైనంత తొందరగా పరిష్కరించేందుకు చర్యలు తీసుకుంటామన్నారు. ఈ కార్యక్రమంలో అధికారులు, సిబ్బంది ఉన్నారు.

## ప్రజలకు అందుబాటులో ఉంటూ ఇబ్బందులు లేకుండా చూస్తున్నాం

### రాజేంద్రనగర్ సర్కిల్ ఉపకమీషనర్ రవికుమార్



గండిపేట్(క్రైం మిర్రర్): అధికారులు, సిబ్బంది సమన్వాయంతో పని చేస్తూ ప్రజలకు ఇబ్బందులు లేకుండా చూడాలని రాజేంద్రనగర్ సర్కిల్ ఉపకమీషనర్ రవికుమార్ సూచించారు. కురుస్తున్న వర్షాల నేపథ్యంలో సోమవారం మైలార్‌దేవ్‌పల్లి డివిజన్ పరిధిలో ఆయన పర్యటించారు. దుర్గానగర్, శాంతినగర్ తదితర ప్రాంతాల్లో ఆయన అధికారులతో కలిసి పర్యవేక్షించారు. డ్రైనేజీ పనులు, రోడ్లపై నిలిచిన వర్షం నీటిని త్వరగా చేపట్టాలని సూచించారు. గోతులమయంగా మారిన రోడ్లకు మరమ్మత్తు పనులు చేపడతామని తెలిపారు. ఈ కార్యక్రమంలో అధికారులు, సిబ్బంది, స్థానిక ప్రజలు ఉన్నారు.

## కిస్మత్‌పూర్ ఎర్రకుంట తండాలో గోర్ మలావ్ యజ్ఞం పూజలు

### పాల్గొన్న లంబాడి నాయకులు, సభ్యులు.





గండిపేట్(క్రైం మిర్రర్): బండ్లగూడ జాగీరు మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలోని కిస్మత్‌పూర్‌లోని ఎర్రకుంట తండా దగ్గర లంబాడ జాతికి చెందిన సుమారు 1500 మంది లంబాడ నాయకులతో కలిసి మహబోగ్ ఉమ్మడి రంగారెడ్డి జిల్లా గోర్ మలావ్ యజ్ఞం సేవాలాల్ మహరాజ్ పూజలు నిర్వహించారు. అనంతరం జాతిని ఉద్దేశించి పలువురు వక్తలు మాట్లాడారు. ఈ కార్యక్రమంలో స్థానిక కార్పొరేటర్ ప్రతినిధి గోకరి సురేష్‌గౌడ్ గోర్ సేవా కమిటికి చెందిన నాయకులు హీరాలాల్ నాయక్, గోపాల్, స్వామి, గోవింద్‌నాయక్, బాలాజీనాయక్, రాములునాయక్, గోపాల్‌నాయక్, శివనాయక్, ప్రశాంత్‌నాయక్, రాజునాయక్, లక్ష్మణ్‌నాయాక్, చందర్‌నాయక్, సంజునాయక్, రాందాస్‌నాయక్, జయరాంనాయక్, రవినాయక్ తదితరులు పాల్గొన్నారు.

## తడి, పొడి చెత్తను వేరు చేసి అందించాలి.

గండిపేట్(క్రైం మిర్రర్): మణికొండ మున్సిపాలిటీ పరిధిలో సోమవారం స్వచ్ఛత హీ సేవా కార్యక్రమాన్ని నిర్వహించారు. ఇందులో భాగంగా 15వ వార్డులో డోర్ టూ డోర్ క్యాంపు నిర్వహించి తడి, పొడ చెత్తపై ప్రజలకు అవగాహన కల్పించారు. చెత్తను వేరు చేసి ఇంటి వద్దకు వచ్చే చెత్త సేకరణ కార్మికులకు అందించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో కమీషనర్ ప్రదీప్‌కుమార్, కౌన్సిలర్ బుద్దోలు కావ్య, టీఎంసీ లక్ష్మి, ఈఈ సంపత్, జవాన్లు, కాలనీ వాసులు తదితరులు పాల్గొన్నారు.

క్రైమ్ మిర్రర్
Voice of Anti Corruption
తెలంగాణ జిల్లాలు
6 మంగళవారం 24-9-2024

# సిఐటియు కృషి ఫలితంగా సింగరేణి ప్రైవేట్ సెక్యూరిటీ కార్డులకు ఏరియర్స్ విడుదల

## ఎస్. సి. కె ఎస్ సిఐటియు బీ గట్టు మహేందర్



మంచిర్యాల జిల్లా ప్రతినిధి,క్రైమ్ మిర్రర్ : సింగరేణి కాంటాక్ట్ కార్మికుల సంఘం ఎస్ సి కె ఎస్ కృషి ఫలితంగా శ్రీరాంపూర్ ఏరియాలోని 138 మంది సింగరేణి ప్రైవేట్ సెక్యూరిటీ గార్డులకు 2021 ఏప్రిల్ లో చెల్లించాల్సిన ఏరియాస్ ను సింగరేణి యాజమాన్యం ప్రైవేట్ సెక్యూరిటీ గార్డ్ లో అకౌంట్స్ లో నేరుగా జమ చేసిందని సింగరేణి కాంట్రాక్ట్ కార్మికుల సంఘం సిఐటియు శ్రీరాంపూర్ బ్రాంచ్ కార్యదర్శి గట్టు మహేందర్ ప్రకటనలో తెలియజేశారు, ఇంకా కాంట్రాక్టర్ మారిండనే పేరుతో 2021 ఏప్రిల్ లో 11 రోజుల ఏరియర్స్ ను సెక్యూరిటీ గార్లకు చెల్లించలేదు. దీనిపై సిఐటియు అనేకసార్లు సింగరేణి యాజమాన్యానికి విజ్ఞప్తి చేసింది. ఆయన రెస్పాండ్ కాకపోవడంతో అసిస్టెంట్ లేబర్ కమిషనర్ (సెంట్రల్ ) మంచిర్యాల వద్ద కేసు వేసింది. కేసు జరిగిన అనంతరం సింగరేణి యాజమాన్యం ప్రైవేట్ సెక్యూరిటీ గార్లకు రావలసిన ఏరియాస్ ను ది 20.9.2024 సెక్యూరిటీ గార్డులు అకౌంట్స్ లో నేరుగా జమ చేసింది. . అంతేకాదు ఆనాడు వేసిన కేసు ఫలితంగా ఫ్రీ మెడికల్ వచ్చింది. దీని ద్వారా మెడికల్ చేయించుకునే ప్రతి సెక్యూరిటీ గార్డ్ కి 2500 రూపాయలు మిగిలాయి. అలాగే సెక్యూరిటీ గార్డుల వివరాలను మొత్తం ఆన్లైన్ చేసి రెగ్యులర్గా సింగరేణి హాస్పిటల్ కి పంపుతూ వారికి వైద్యం అందించేందుకు చర్యలు తీసుకున్నారు. కార్మికులకు రావాల్సిన హక్కులను సింగరేణి కాంటాక్ట్ కార్మికుల సంఘం సిఐటియు వదిలి పెట్టదని వాటికోసం ఎంత దూరం వెళ్ళైనా, ఎంతకాలమైనా సాధించి తీరుతుందని దీని ద్వారా తేటతెల్లం అయింది.ఏరియర్స్ చెల్లింపుతో పాటు, ఇతర సమస్యల పరిష్కారానికి సహకరించిన ఏరియా సెక్యూరిటీ ఆఫీసర్ శ్రీ మురళీమోహన్ గారు మరియు ఇతర అధికారులకు, పర్సనల్ అధికారలకు, లేబర్ ఆఫీస్ వద్ద కేసు వేసి గెలిపించిన సింగరేణి కాంటాక్ట్ కార్మికుల సంఘం రాష్ట్ర అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు దూలం శ్రీనివాస్, బి మధులకు సింగరేణి కాంట్రాక్టు కార్మికుల సంఘం సిఐటియు శ్రీరాంపూర్ బ్రాంచ్ కమిటీ తరఫున ధన్యవాదాలు తెలియజేస్తున్నాము.



## కార్మికుల సమస్యలపై అలుపెరుగని పోరాటం చేస్తాం

గండిపేట్(క్రైం మిర్రర్): కార్మికుల సమస్యలపై అలుపెరుగని పోరాటం చేసి హక్కులను సాధించుకుంటామని గండిపేట మండల కన్వీనర్ దప్పు ప్రవీణ్ కుమార్, నార్సింగి మున్సిపల్ వర్కర్స్ యూనియన్ ఎంప్లాయిస్ కార్యదర్శి జనార్ధనరెడ్డిలు అన్నారు. నార్సింగి చౌరస్తాలో సెప్టెంబర్ 23 బ్లాక్ డే కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ సమాన పనికి సమాన వేతనం ఇవ్వాలన్నారు. కాంట్రాక్ట్, ఔట్సోర్సింగ్ సిబ్బందికి ఉద్యోగ భద్రత కల్పించాలన్నారు. కార్మికులందరికి కనీస వేతనం రూ.26 వేలు అందించాలన్నారు. ఇన్సూరెన్స్, పీఎఫ్, సౌకర్యం కల్పించాలన్నారు. ప్రభుత్వ రంగ సంస్థలు ప్రైవేటీకరణను ఆపాలని నేషనల్ మానిటైజేషణ్ పైపులైన్ని రద్దు చేయాన్నారు. కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం తీసుకోచ్చిన నాలుగు లేబర్ కోర్డులను రద్దు చేయాలని, బొగ్గు బ్లాక్లను వేలం వేయడాన్ని నిలుపుదలను చేయాలన్నారు. సింగరేణికి నేరుగా గనులు కేటాయించాలని డిమాండ్ చేశారు. ఈ నెల 30వ తేదీన లేబర్ ఆఫీస్ ముట్టడి కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నామని ఇందులో కార్మికులు పెద్ద సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో మహిపాల్యాదవ్, అహ్మద్, వీరేశం, శ్రీనివాస్, పురుషోత్తంచారి, అనిల్ తదితరులు పాల్గొన్నారు.

## బఫర్జోన్లో నిర్మించిన అక్రమ నిర్మాణాలను కూల్చివేయాలి: మాజీ కౌన్సిలర్ కోరని దయానంద్



గండిపేట్(క్రైం మిర్రర్): బఫర్ జోన్లో అక్రమ నిర్మాణాలను గుర్తించి వెంటనే కూల్చివేయాలని మాజీ కౌన్సిలర్ కోరని దయానంద్ అన్నారు. ఈ మేరకు సోమవారం హైదరాబాద్ డిజాస్టర్ రెస్పాన్స్ అండ్ ఎసెట్ మానిటరింగ్ అండ్ ప్రొటెక్షన్ ఏజెన్సీకి లిఖితపూర్వకంగా ఆయన ఫిర్యాదు చేశారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఫిరంగినాలా హిమాయత్సాగర్ నుంచి బుద్వేల్, డైరీ ఫామ్, ఉప్పర్పల్లి, చింతల్మెట్ మీదుగా మిరాలం చెరువులో కలుస్తుందన్నారు. కానీ ప్రస్తుతం ఫిరంగి నాలా బుద్వేల్ గ్రామంలో బాలాజీ బిల్డింగ్తో పాటు దీని పక్కన కన్స్ట్రక్షన్స్ మెటిరియల్స్ రెడ్ సాయిల్ డంపింగ్ చేయటం షెడ్ వేశారన్నారు. ఇది మొత్తం ఫిరంగి నాలీఆ భూమిలోనే ఉందన్నారు. సంజీవనీ కాలనీ ఉప్పర్పల్లి, హైదర్గూడ శివారులోని వెనుకభాగడం మొత్తం విల్లాలు బఫర్ జోన్లో కడుతున్నారన్నారు. అలాగే సిగ్నేచర్ విల్లాస్ కూడా బఫర్జోన్లోనే నిర్మాణాలు చేస్తున్నారన్నారు. ఈ బఫర్జోన్లోని నిర్మాణాలైన బుద్వేల్, కిస్మత్పూర్, ఉప్పర్పల్లి, హైదర్గూడ, అత్తాపూర్లో అక్రమ నిర్మాణాలను గుర్తిదంచి చట్టపరమైన చర్యలు తీసుకోవాలని విన్నవించామన్నారు. అంతేకాకుండా ఫిరంగి నాలాను ఆక్రమించి నిర్మించిన అక్రమ కట్టడాలను గుర్తించి ఫిరంగి నాలాను పునరుద్ధరించాలన్నారు. ప్రకృతి వైపరిత్యాలకు చుట్టు పక్కల ప్రజలు ఇబ్బంది పడకుండా తగిన చర్యలు తీసుకోవాలన్నారు. గతంలో అనేకపత్రికల్లో వచ్చిన కూడా రాజకీయ నాయకుల పలుకుబడితో ఆగిపోయాయన్నారు. వెంటనే చర్యలు తీసుకోవాలని కోరారు.

## రాజేంద్రనగర్ నియోజకవర్గంలో స్వచ్ఛత - హీ - సేవా కార్యక్రమాన్ని విజయవంతం చేస్తాం

### - ఎమ్మెల్యే ప్రకాష్గౌడ్

గండిపేట్, (క్రైమ్ మిర్రర్) : రాజేంద్రనగర్ నియోజకవర్గంలో స్వచ్ఛత హీ సేవా కార్యక్రమాన్ని ప్రణాళికబద్ధంగా నిర్వహిస్తామని ఎమ్మెల్యే ప్రకాష్గౌడ్ స్పష్టం చేశారు. నార్సింగి మున్సిపాలిటీ పరిధిలోని ఖానాపూర్ లో ప్రభుత్వ పాఠశాల విద్యార్థులకు స్వచ్ఛత- సేవా, పచ్చదనం - పరిశుభ్రత పై అవగహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో విద్యార్థులతో ఎమ్మెల్యే ప్రతిజ్ఞ చేయించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. స్వచ్ఛతా - హి - సేవ కార్యక్రమంలో భాగంగా పరిశుభ్రతపై అవగాహన కల్పిస్తూ ప్రతి ఒక్కరూ పరిశుభ్రత పాటించాలని సూచించారు. మన ఇంటి ఆవరణతో చుట్టుపక్కల శుభ్రం చేసుకోవాల్సిన బాధ్యత మనందరిపై ఉందని అన్నారు. అదేవిధంగా స్వచ్ఛదనం పాటిస్తూనే వన మహోత్సవంలో ప్రతి ఒక్కరూ భాగస్వామ్యులు కావాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో నార్సింగ్ మున్సిపల్ చైర్మన్ నాగపూర్ణ శ్రీనివాస్, ఆయా వార్డు కౌన్సిలర్లు, అధికారులు, ఉపాధ్యాయులు, విద్యార్థులు, స్థానికులు పాల్గొన్నారు.



# విద్యార్థులతో కిక్కిరిసిపోతున్న ప్రభుత్వ పాఠశాల

ప్రతి తరగతి గదిలో నిండిపోతున్న విద్యార్థులు

**విద్యార్థుల సంఖ్యకు అనుగుణంగా తరగతి గదులను పెంచాలని కోరుతున్న విద్యార్థులు.**






గండిపేట్(క్రైం మిర్రర్): ప్రభుత్వ పాఠశాలల్లో చేరాలంటేనే కొందరు జంకుతుంటారు... అక్కడ ఉపాధ్యాయులు సరిగ్గా పాఠాలు చెప్పరని, సౌకర్యాలు ఉండవని అనేక వంకలు చెబుతుంటారు. కానీ వీటిని బిన్నంగా ఉంది నగర శివారు ప్రాంతమైన జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల. గండిపేట మండలం హైదర్షాకోట్లోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల తరగతి గదుల్లో లెక్కకు మించిన విద్యార్థులతో కిక్కిరిసి ఉంటున్నాయి. ప్రభుత్వ సౌకర్యాలు, ఉపాధ్యాయుల బోధన బాగుంటుండడంతో విద్యార్థుల సంఖ్య భారీగా పెరుగుతుంది. గత ఏడాది 540 మంది విద్యార్థులు ఉండగా ప్రస్తుతం ఈ సంఖ్య 612కు చేరింది. ప్రతి తరగతి గదిలో 100మందికి పైగా విద్యార్థులు ఉండడంతో వారిని నియంత్రించడానికి ఉపాధ్యాయులు పడరాని పాట్లు పడుతున్నారు. మరోవైపు ఉపాధ్యాయులు బోధిస్తున్న అంశాలు సరిగ్గా వినపడి వినపడకుండా పోవడంతో చదువు తలకెక్కడం లేదని విద్యార్థులు వాపోతున్నారు. ముఖ్యంగా గణిత శాస్త్రం, సామాన్య శాస్త్రం తరగతులకు సంబంధించిన అర్థం కావడం లేదని పేర్కొంటున్నారు. 8 తరగతిలో 160 మంది విద్యార్థులు ఉండడం జిల్లా స్థాయిలో రికార్డుగా పేర్కొంటున్నారు. 8 ఏళ్ల క్రితం విద్యార్థుల సంఖ్య సుమారు 350 ఉండగా, ఆ సంఖ్యకు అనుగుణంగా 8 మంది ఉపాధ్యాయులను మంజూరు చేశారని,ప్రస్తుతం పెరిగిన విద్యార్థుల సంఖ్యకు అనుగుణంగా అదనంగా ఉపాధ్యాయులను మంజూరు చేయాల్సిన అవసరం ఉందని విద్యార్థుల తల్లిదండ్రులు పేర్కొంటున్నారు. ప్రభుత్వం విద్యార్థుల భవిష్యత్తును దృష్టిలో ఉంచుకొని అదనపు సిబ్బందిని నియమించాలని విద్యార్థులు, వారి తల్లిదండ్రులు కోరుతున్నారు. విద్య శాఖ అధికారులు పల్లు మరల్లు చేసిన పట్టించు కోవడం లేదు.. అన్నటున్నారు. తరగతి గదిలో విధార్థుల సంఖ్య కు అనుగున్నాగా బేచిల్లు లేక పోవడం తో పల్లవూరు విధర్ష్హుల్లు నెల్ల పై కూర్చొని పాఠాలు విన్నల్సిన పరిస్థితి నెల్కొంది.




## శిక్షణా తరగతులు పాత్రికేయుల నైపుణ్యతను మెరుగుపరుస్తాయి

### బ్రోచర్ ఆవిష్కరణలో తహసీల్దార్ ఎం శ్రీనివాస్

చర్ల, సెప్టెంబర్23, క్రైమ్ మిర్రర్: ప్రింట్, ఎలక్ట్రానిక్ మీడియా రంగంలోకి వచ్చిన ఈ తరం పాత్రికేయులకు వృత్తి నైపుణ్యత, మెలుకువలు ఎంతో అవసరం అని గ్రామీణ, పట్టణ ప్రాంత జర్నలిస్టులకు వృత్తి నైపుణ్యతను మెరుగుపరిచేందుకు తెలంగాణ వర్కింగ్ జర్నలిస్ట్ ఫెడరేషన్ ( టిడబ్ల్యూజేఎఫ్) ఆధ్వర్యంలో పాత్రికేయులకు శిక్షణ తరగతులు నిర్వహించడం అభినందనీయమని తహసీల్దార్ ఎం శ్రీనివాస్ అన్నారు. తెలంగాణ వర్కింగ్ జర్నలిస్ట్ ఫెడరేషన్ భద్రాద్రి కొత్తగూడెం జిల్లా ఆధ్వర్యంలో అక్టోబర్ 26, 27 తేదీల్లో భద్రాచలం పట్టణంలో నిర్వహించే శిక్షణా తరగతుల బ్రోచర్ ను ఆయన చాంబర్లో యూనియన్ నాయకులతో కలిసి విడుదల చేశారు. రాష్ట్ర కార్యదర్శి కర్ర అనిల్ రెడ్డి మాట్లాడుతూ భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలో జర్నలిస్టుల హక్కుల కోసం ముందుండి పోరాటాలు నిర్వహిస్తున్న ఏకైక యూనియన్ టిడబ్ల్యూజేఎఫ్ మాత్రమే నని ఆయన అన్నారు. ఫెడరేషన్ ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా ఫ్లాగ్ డే నిర్వహించడంతోపాటు అనేక స్వచ్ఛంద సేవా కార్యక్రమాలు చేపట్టడం జరుగుతుందని అన్నారు. 2022 సంవత్సరంలో వచ్చిన గోదావరి వరదలకు నిరాశ్రయులైన జర్నలిస్టులకు నిత్యవసరాలు అందజేయడంతో పాటు వారికి అండగా నిలవడం జరిగిందన్నారు. అర్హులైన ప్రతి జర్నలిస్టుకు డబుల్ బెడ్ రూమ్ ఇండ్లతోపాటు , అక్రిడిటేషన్ కార్డులు, హెల్త్ కార్డులు అందజేయాలని రాష్ట్ర ప్రభుత్వాన్ని ఆయన డిమాండ్ చేశారు. జర్నలిస్టు పిల్లలకు 50% ఉచిత విద్య యూనియన్ పోరాట ఫలితమేనని అన్నారు. జర్నలిస్టులకు వృత్తి నైపుణ్యత, మెలుకువలు, సమాచార సేకరణ ఒంటి అవగాహన కోసం నిష్టాతులచే ఈనెల 26, 27 తేదీల్లో నిర్వహించే శిక్షణా తరగతులను జిల్లాలో అన్ని యాజమాన్య పత్రికల్లో పనిచేసే పాత్రికేయులు సద్వినియోగం చేసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో టిడబ్ల్యూజేఎఫ్ జిల్లా అధ్యక్ష కార్యదర్శులు పూదోట సూరిబాబు, గుండెబోయిన వెంకటేశ్వర్లు, జిల్లా కోశాధికారి దొడ్డి హరినాగవర్మ, జిల్లా ఉపాధ్యక్షులు తోటమల్ల రమణమూర్తి, సభ్యులు వేణుగోపాలచారి, మహబూబ్ పఠాన్, నెర్రబోయిన చంద్రశేఖర్, గిర్ధవార్ బొలిశెట్టి సత్యనారాయణ తదితరులు ఉన్నారు.

## అమరావతి నాగపూర్ నేషనల్ హైవే అలాట్మెంట్ మార్చాలని సర్వే నెంబర్ 218 రఘునాథపాలెం లో ప్లాట్లు కోల్పోతున్న బాధితులు ఆందోళన.

క్రైమ్ మిర్రర్ ఖమ్మం జిల్లా ప్రతినిధి : ఖమ్మం జిల్లారఘునాథపాలెం మండలం , రఘునాథపాలెం గ్రామ సర్వే నెం.218లోని ప్రభుత్వం ద్వారా %=.ఐ.ా.చీశీ.దీ%/1529/2007లో శాంక్షన్ చేసి , 2018వ సంవత్సరంలో 725 మందికి ఇంటి స్థాలాలు ఎలాట్ మెంట్ చేసి పట్టాలు ఇచ్చారని , మాకు పట్టాలు వచ్చిన వెంటనే ఇండ్ల నిర్మాణం చేయు నిమిత్తం బేస్మెంట్లవరకు తల ఒక లక్ష రూపాయల వరకు ఖర్చు చేశామని , కాని ఈ ఏరియాలో కరెంట్ సౌకర్యం , నీటి సౌకర్యం లాంటి కనీస సౌకర్యాలు లేకపోవడం వలన మరియు కోవిడ్ - 19 లాక్ డౌన్ కూడా ఇదే సమయములో రావడంతో మా అందరికి ఆర్థిక ఇబ్బందులు ఏర్పడడంతో ఇండ్ల నిర్మాణం చేయలేకపోయామని రఘునాథపాలెం సర్వే నెం.218లోని ప్రభుత్వం ఇచ్చిన ప్లాట్లు కోల్పోతున్న బాధితులు కలెక్టరేట్ వద్ద ఆందోళన చేపట్టి అట్టి విషయాన్ని అధికారులకు తెలియజేశారు . ప్రభుత్వ సహకారం కోరగా, గత ప్రభుత్వం వారు ఇంటి నిర్మాణానికి %జీశీ జువ% రూ.3.00 లక్షలు ఇస్తామని హామీ ఇచ్చి విస్మరించియున్నారు . %చీఎ% తదుపరి వచ్చిన కొత్త ప్రభుత్వంలో మాకు న్యాయం జరుగుతుందని ఎదురు చూచుచుండగా మాకు కేటాయించిన స్థలాల ప్రాంతం గుండా “నాగపూర్- అమరావతి గ్రీన్ ఫీల్డ్ నేషనల్ హైవే” నిర్మించుటకు గాను సర్వే జరిగినది . ఈ రోడ్ నిర్మాణం మా స్థలాల గుండా పోవుట వలన నిరుపేదలమైన మాకు తీవ్ర అన్యాయం జరుగుతుంది . అతి నిరుపేదలమైన , రోజువారీ కూలీలలమైన మాకు ప్రభుత్వం ఇచ్చిన ఈ స్థలాలు తప్ప వేరే ఏవిధమైన ఆధారము లేదు . కావున ప్రస్తుతం అట్టి ప్లాట్ల యందు “అమరావతి నాగపూర్ హైవే” వెళ్ళుటకు గాను సర్వే జరిగినది - దీనికి సంబంధించి రోడ్డు క్రింద మా ప్లాట్స్ పోకుండా అలైన్ మెంట్ మార్పు చేయుట గాని లేదా రొడ్డు క్రింద పోవు ప్లాట్ ఓనర్స్కు రీసర్వే చేసి కంపెన్సేషన్ గాని లేదా ఆయొక్క స్థలానికి దగ్గరలో మాకు ప్లాట్స్ ఇచ్చి రూ.5 లక్షలు గృహనిర్మాణానికి ఇప్పించగలరని కోరారు .



# తుక్కుగూడలో ఏఐటీయూసీ రాష్ట్ర కౌన్సిల్ సమావేశాలు

**లాభాలకు ఏఐటీయూసీ వ్యతిరేకం కాదు**

**కార్మికుల కొనుగోలు శక్తి పెంచకుండా ఆర్థిక పురోగతి సాధించలేము :మాజీ ఎమ్మెల్సీ ప్రొఫెసర్ నాగేశ్వర్**







**మహేశ్వరం ప్రతినిధి (క్రైమ్ మిర్రర్):** ఏఐటీయూసీ కార్మిక సంఘంగా పెట్టుబడిదారీ లాభాలను వ్యతిరేకించడం లేదని ఆర్థిక అభివృద్ధి సాధించాలి అంటే కార్మికుల కొనుగోలు శక్తి పెంచాలని మాజీ ఎమ్మెల్సీ ప్రొఫెసర్ నాగేశ్వర్ ప్రభుత్వాలను కోరారు: ఏఐటీయూసీ రాష్ట్ర కౌన్సిల్ సమావేశాల నేపథ్యంలో తుక్కుగూడలో సోమవారం బి.దత్తు నాయక్ ఆధ్వర్యంలో నిర్వహించిన రాష్ట్ర స్థాయి సెమినార్ మన ఆర్థిక లాభాల కోసమా ప్రజల కోసమా అనే అంశంపై జరిగిన సెమినారులో ప్రొఫెసర్ నాగేశ్వర్ మాట్లాడుతూ.భారత ఆర్థిక వ్యవస్థ అభివృద్ధి చెందాలంటే ఉత్పత్తి శక్తులకు ఆదాయాన్ని పెంచాలని అది కాకుండా ఉత్పత్తులను పెంచడం ద్వారా ఆర్థిక అభివృద్ధి సాధించలేము అని అన్నారు. ప్రజల దగ్గర కార్మికుల దగ్గర కొనుగోలు శక్తి లేకపోతే పారిశ్రామిక ఉత్పత్తులను ఎవరు కొనుక్కోవాలని ఆయన అన్నారు ఏఐటీయూసీ ప్రారంభించిన నాటినుండి నేటి వరకు కార్మికుల హక్కుల కోసం కష్టజీవుల సమస్యల పరిష్కారం కోసం నిరంతరం ఆర్థిక పోరాటాలు వర్గ పోరాటాలు నిర్వహిస్తున్నదని కానీ ప్రభుత్వాలు వాటిని పెడచెవిన పెట్టి పెట్టుబడుదారులకు లాభాలు చేకూర్చే విధంగా తమ యొక్క ఆర్థిక విధానాలను మార్చుకుంటున్నాయని ఆయన విమర్శించారు,ప్రభుత్వాల ఆర్థిక విధానాలలో మార్పు రాకుండా దేశ ఆర్థిక వ్యవస్థ ఎంత మాత్రం అభివృద్ధి కాలేదని ఆయన తెలిపారు పెట్టుబడిదారులకు రాయితీలు ఇచ్చే ప్రభుత్వాలు పేదలకు కష్టజీవులకు కార్మికులకు ఎందుకు రాయితీలు ఇవ్వడం లేదని ఆయన అన్నారు నరేంద్ర మోడీ తీసుకొచ్చిన కార్మిక కర్షక వ్యతిరేక చట్టాలు భారతదేశ ఆర్థిక విధానానికి కూడ గొడ్డలి పెట్టు లాంటివని ఆయన అన్నారు కార్పొరేట్లకు మాత్రమే ఉపయోగపడే చట్టాలను తేవడం ద్వారా భారత ఆర్థిక వ్యవస్థ మరింత దిగజారుతుందని ఆయన అన్నారు ఏఐటీయూసీ జిల్లా ప్రధాన కార్యదర్శి పానుగంటి పర్వతాలు అధ్యక్షతన ఈ సెమినార్ కార్యక్రమం నిర్వహించారు. ఈకార్యక్రమంలో ఏఐటీయూసీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఎస్ బాలరాజు రాష్ట్ర అధ్యక్షుడు ఎండి యూసుఫ్ సిపిఐ జిల్లా కార్యదర్శి పాలమాకుల జంగయ్య రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు ఆందోజు రవీంద్ర చారి ఏఐటీయూసీ రాష్ట్ర ఉపాసన ప్రధాన కార్యదర్శి ఎం నరసింహ గౌరవ అధ్యక్షుడు వాసిరెడ్డి సీతారామయ్య ఏఐటీయూసీ రాష్ట్ర నాయకులు రత్నాకర్ రావు ప్రేమ పావని పల్లా దేవేందర్ రెడ్డి ఏఐటీయూసీ జిల్లా అధ్యక్షుడు కే రామస్వామి జిల్లా కార్యదర్శులు వనంపల్లి జైపాల్ రెడ్డి వడ్ల సత్యనారాయణ కే చంద్ర యాదవ్ సామెడి శేఖర్ రెడ్డి హరి సింగ్ నాయక్ ఎస్ మల్లేష్ టి నరసింహారెడ్డి వెంకన్న ఎం శ్రీను రంగారెడ్డి మహేశ్వరంమండల అధ్యక్ష కార్యదర్శులు దేవేందర్ గౌడ్ రాజు తదితరులు పాల్గొన్నారు.

# ఉత్తర తెలంగాణ వర ప్రదాయిని కాళేశ్వరం

**అవగాహన లేకుండా మాట్లాడుతున్న కాంగ్రెస్ నేతలు**

**మాజీఎంపి వినోద్ కుమార్ విమర్శలు**



**కరీంనగర్,(క్రైమ్ మిర్రర్):** ఉత్తర తెలంగాణ వర ప్రదాయిని కాళేశ్వరం ప్రాజెక్టుపై ఇష్టమొచ్చి నట్లు మాట్లాడుతున్న కాంగ్రెస్ ప్రజాప్రతినిధులపై మాజీ బీఆర్ఎస్ ఎంపీ వినోద్ కుమార్ మండిపడ్డారు. ఏదైనా మాట్లాడే ముందు.. అవగాహనతో మాట్లాడాలని వినోద్ కుమార్ కాంగ్రెస్ నేతలకు సూచించారు. కరీంనగర్‌లో కౌశిక్ రెడ్డి తదితరులతో కలసి ఆయన మీడియాతో మాట్లాడారు. కాళేశ్వరంపై కాంగ్రెస్ మంత్రులు, నాయకులు అవగాహనరాహిత్యంతో మాట్లాడుతున్నారని వినోద్ కుమార్ మండిపడ్డారు. కాళేశ్వరం అంటే మేడిగడ్డ, అన్నారం, సుందిళ్ళ బ్యారేజీలే అన్న అవగాహనతోనే కాంగ్రెస్ నాయకులు ఉన్నారని పొన్నం ప్రభాకర్ మాటల్లో తెలుస్తున్నదని వినోద్ కుమార్ పేర్కొన్నారు. ఇంతకంటే అవగాహనారాహిత్యం మరొకటి ఉండదు. కాళేశ్వరంలో నిర్మించిన వందలాది కాంపోనెంట్స్‌లో ఈ మూడు బ్యారేజీలు కూడా ఉన్నాయి తప్ప అవే కాళేశ్వరం ప్రాజెక్టు కాదు. కాళేశ్వరం స్వరూపాన్ని పొన్నం ప్రభాకర్‌కు, అతని సహచరులకు మరొక్కసారి వివరించాల్సిన అవసరం ఉన్నదని వినోద్ కుమార్ తెలిపారు.

బ్యారేజీలు, జలాశయాలు, గ్రావిటి కాలువలు, పైప్ లైన్లు, సొరంగాలు, భూగర్భ పంప్ హౌజ్ లు, సర్జ్ పూల్స్, విద్యుత్ సబ్ స్టేషన్లు, విద్యుత్ లైన్లు.. ఇవన్నీ కలిపితే ఒక ప్రాజెక్టు తయారవుతుందని వినోద్ కుమార్ స్పష్టం చేశారు. ఈ ప్రాజెక్టు ప్రయోజనాలు 20 జిల్లాల్లో విస్తరించి ఉండడం, కొత్త ఆయకట్టు, స్థిరీకరణ కలుపుకొని మొత్తం 45 లక్షల ఎకరాలకు సాగునీరు అందించడం లక్ష్యమన్నారు. తాగునీటి అవసరాల కోసం 40 టీఎంసీలు, పారిశ్రామిక అవసరాల కోసం 16 టీఎంసీలు సరఫరా చేసే విధంగా ప్రాజెక్టుల రూపకల్పన జరిగిందన్నారు. కాంగ్రెస్ హయాంలో ప్రతిపాదించిన ప్రాణహిత ? చేవెళ్ళ ప్రాజెక్టులో మొత్తం నీటి నిల్వ సామర్థ్యం 14 టీఎంసీలు మాత్రమే అని వినోద్ కుమార్ గుర్తు చేశారు. 160 టీఎంసీల నీటిని ఎత్తిపోసి ఎక్కడ నిల్వ చేసుకుంటారని సీడబ్ల్యూసీ అభ్యంతరం వ్యక్తం చేసింది. మీ ప్రాజెక్టులో నీటి అవసరాలకు, ప్రాజెక్టులో ప్రతిపాదించిన ఆన్‌లైన్ జలాశయాల నిల్వ సామర్థ్యానికి అసలు పొంతనే లేదని చెపుతూ ఆన్‌లైన్ జలాశయాల నిల్వ సామర్థ్యాన్ని పెంచుకోవాలని లేదా కృత్రిమ జలాశయాలు నిర్మించమని సలహా ఇచ్చింది. అందుకే కాళేశ్వరం ప్రాజెక్టులో నిల్వ సామర్థ్యాన్ని 141 టీఎంసీలకు పెంచుకోవడం జరిగిందని వినోద్ కుమార్ తెలిపారు.

# కెసిఆర్ కుటుంబాన్ని కాపాడుతున్న పొంగులేటి

**కాంగ్రెస్ పెద్దలతో కెసిఆర్ లోపాయకారి ఒప్పందం**

**బిజెఎల్పీ నేత మహేశ్వర్ రెడ్డి ఆరోపణలు**

**హైదరాబాద్, (క్రైమ్ మిర్రర్):** మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్ కుటుంబాన్ని కాపాడుతుందే కాంగ్రెస్ పార్టీ అంటూ బీజేఎల్పీ నేత ఏలేటి మహేశ్వర్‌రెడ్డి సంచలన వ్యాఖ్యలు చేశారు. సోమవారం మీడియాతో మాట్లాడుతూ.. కేసీ వేణు గోపాల్ దగ్గర కేసీఆర్ కుటుంబం చేసుకున్న ఒప్పందంపై మాట్లాడాలన్నారు. అటు కాంగ్రెస్ ఢిల్లీ పెద్దలకు, ఇటు రాష్ట్రంలో కేసీఆర్ కుటుంబానికి మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి మధ్యవర్తిత్వం చేస్తూ కాపాడుతుంది నిజం కాదా.. కాంగ్రెస్ ఇప్పటి వరకు బీఆర్ఎస్‌పైన ఈడీ విచారణ, సీబీఐ విచారణకు ఎందుకు ఆదేశాలు ఇవ్వడం లేదు. సీబీఐ విచారణ నేరుగా రాష్ట్రంలో చేయడానికి వీలు లేదని జీవో తెచ్చింది బీఆర్ఎస్ కాదా అని ప్రశ్నించారు. బీఆర్ఎస్ ఎమ్మెల్యే కేటీఆర్ నా మీద చేసిన వ్యాఖ్యలను ఖండిస్తున్నా. ప్రజా సమస్యలపై బీజేపీ ఎన్నో పోరాటాలు చేసింది. శాసనసభలో నేను మాట్లాడింది ప్రజలు విన్నారు. రాష్ట్రానికి సీబీఐ వచ్చే రోజు దగ్గర్లోనే ఉంది. ధరణి, కాళేశ్వరం, విద్యుత్‌లతో అనేక అంశాల్లో బీఆర్స్ చేసిన అవినీతి బయటకు రాబోతుంది. తెలంగాణలో కేంద్ర ప్రభుత్వం ప్రతి అంశాన్ని పరిశీలిస్తోంది. రాష్ట్ర ప్రభుత్వం అంగీకరిస్తే 24 గంటల్లో సీబీఐ దించుతాం. డ్రామా రావు డ్రామాలు ఆపితే బాగుంటుందని అంటూ మహేశ్వర్‌రెడ్డి దుయ్యబట్టారు. ఇటు రాష్ట్రంలో రేవంత్ రెడ్డి బావమరిది సృజన్ రెడ్డికి వేల కోట్ల రూపాయల కాంట్రాక్టులు అప్పగిస్తూ ప్రజా ధనం వృధా చేస్తున్నారని మండిపడ్డారు. దీనికి బీఆర్ఎస్, కాంగ్రెస్‌లు ఒకరిపై ఒకరు నిందలు వేసుకుంటున్నారన్నారు. ఇది ప్రాఫిట్ ఆఫ్ ఇంట్రెస్ట్ అవునా.. కదా అని ప్రశ్నించారు. కొడంగల్ లిఫ్ట్ ఇరిగేషన్ విషయంలో టెండర్లు అన్నీ రాఘవ కంపెనీకి పొంగులేటి శ్రీనివాసరెడ్డి ఇచ్చారని.. ఇంకా కొన్ని మేఘ కంపెనీకి ఇచ్చారని తెలిపారు. ఈ రెండు కంపెనీలకు నాలుగు వేల ఐదు వందల కోట్ల రూపాయల వరకు కాంట్రాక్ట్ వర్క్‌లు ఇచ్చారన్నారు. ఇలా విచ్చల విడిగా కాంట్రాక్టులు ఇచ్చుకుంటూపోతున్న పొంగులేటిని ప్రభుత్వం తక్షణమే బర్తరఫ్ చేయాలని డిమాండ్ చేశారు. ఆయన గంట పాటు మంత్రిగా కొనసాగే అర్హత లేదన్నారు. పొంగులేటి శ్రీనివాసరెడ్డికి, కేటీఆర్‌లకు నేను ఛాలెంజ్ చేస్తున్న. స్టేట్‌లో కాంట్రాక్టులన్నీ కాంగ్రెస్, బీఆర్ఎస్‌లు పంచుకోవడం వాస్తవం కాదా. ఇది నేను నిరూపిస్తే మీరు దేనికి సిద్ధం. లేదంటే నేను అయినా నా పదవికి రాజీనామా చేస్తా. హైడ్రా సంగతి, ఇతర కమిషన్‌ల సంగతి నేను తెలుస్తా. లేదంటే నా ఎమ్మెల్యే పదవికి రాజీనామా చేస్తా. రాజకీయాల నుంచి శాశ్వతంగా తప్పుకుంటా. అనేక అంశాలపై నేరుగా ముఖ్యమంత్రికి బహిరంగ లేఖలు రాశాను. కేంద్ర ప్రభుత్వానికి నివేదికలు ఇచ్చాను‘ అని ఏలేటి మహేశ్వర్‌రెడ్డి పేర్కొన్నారు.

# గాంధీపై డ్రామాలు కట్టిపెట్టాలి

**పదేళ్లలో ఏనాడైనా గాధీని సందర్శించారా**

**కెటిఆర్, హరీష్ రావుల డ్రామాలు నడవవు**

**ప్రభుత్వ విప్ బీర్ల ఐలయ్య ఘాటు విమర్శలు**

**హైదరాబాద్, (క్రైమ్ మిర్రర్):** కేసీఆర్ రైతులను ముంచారని.. హరీష్ డెయిరీలను నాశనం చేశారని ప్రభుత్వ విప్ బీర్ల ఐలయ్య విమర్శించారు. ప్రతిపక్ష నాయకుడి హోదా కోసం బావబామ్మర్దులు కొట్టుకుంటు న్నారన్నారు. ఈ మేరకు మాజీ మంత్రులు హరీష్‌రావు, కేటీఆర్‌లపై ఐలయ్య తీవ్రస్థాయిలో విరుచుకు పడ్డారు. సోమవారం మీడియాతో మాట్లాడుతూ.. డ్రామారావు డ్రామాలు ఆపేయాలన్నారు. గత పదేళ్లలో.. పాలనలో కల్తీ, పాలల్లో కల్తీ అంటూ వ్యాఖ్యలు చేశారు. రుణమాఫీ చేస్తే రాజీనామా చేస్తానన్న హరీష్ ఎక్కడ పన్నడు అని ప్రశ్నించారు. హరీష్, కేటీఆర్‌కు సిగ్గు శరం ఉండాలంటూ మండిపడ్డారు. కేటీఆర్ కమిటీ వేయడం సిగ్గుమాలిన పని అంటూ దుయ్యబట్టారు. ప్రజాపాలనకి వస్తున్న ఆదరణ చూసి రంగా, బిల్లాలు ఓర్వలేకపోతున్నారు అంటూ ఎద్దేవా చేశారు. వాళ్ళ నాన్న ముఖ్యమంత్రిగా ఉన్నట్టు, కేటీఆర్ మంత్రిగా ఉన్నట్టు భావిస్తున్నారని అన్నారు. గాంధీ హాస్పిటల్ సిబ్బంది మనోధైర్యం దెబ్బతీసేలా కేటీఆర్ వ్యవహరిస్తున్నారన్నారు. పదేండ్లలో ఒక్కసారైనా గాంధీ హాస్పిటల్ గురించి ఆలోచించారా అని నిలదీశారు. డీప్యూటీ సీఎం గా ఉంటే ఓర్వలేని రాజయ్య ఈరోజు అవసరం వచ్చారా అని అడిగారు. పదేండ్లలో ఉస్మానియా హాస్పిటల్ ఎందుకు కట్టలేకపోయారంటూ మరో ప్రశ్న సంధించారు. స్థానిక సంస్థల ఎన్నికల్లో బీఆర్ఎస్ పార్టీకి ప్రజలు మరోసారి బుద్ధి చెప్తారన్నారు. విజయ డెయిరీని, మదర్ డెయిరీని గత పదేళ్లలో పూర్తిగా నిర్వీర్యం చేశారన్నారు. గత పదేళ్లలో డెయిరీల్లో బీఆర్ఎస్ నాయకులు పంది కొక్కుల్లా మెక్కారని ఆరోపించారు. డెయిరీలపై జరిగిన అవినీతిపై విచారణ జరిపిస్తామన్నారు. నకిలీ పాలు తెచ్చి విజయ డెయిరీ, మదర్ డెయిరీని నాశనం చేశారన్నారు. హరీష్ తన భార్య పేరుతో డెయిరీ పెట్టి విజయ, మదర్ డెయిరీలను ఆగం పట్టించారని విమర్శించారు.



# ఘనంగా పూర్వ విద్యార్థుల సమ్మేళనం

**గండిపేట్, (క్రైమ్ మిర్రర్) :** ఏరా మిత్రమా.. ఎలా ఉన్నావ్.. చాలా కాలమైంది నిన్ను చూసి.. ఏం చేస్తున్నావ్.. ఎక్కడ ఉంటున్నావ్.. అంటూ ఒకరిని ఒకరు పాత మిత్రులు ఆప్యాయంగా పలుకరించుకున్నారు. రాజేంద్రనగర్ సర్కిల్ శివరాంపల్లి జిల్లా పరిషత్ హై స్కూల్ 1999-2004 వ పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం సోమవారం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో మాస్టర్లు సురేందర్ రెడ్డి సార్, కృపాకర్ రెడ్డి, యాదయ్య, రామ్ నాథ్ రెడ్డి, నాగయ్య, అరుణ మేడం, నరసింహ చారి, కిషన్, పడమటి శ్రీధర్ రెడ్డి లు పాల్గొన్నారు. ఈ సందర్భంగా పూర్వ మిత్రులు ఉపాధ్యాయులను సన్మానించారు. అనంతరం ఒకరితో ఒకరు ఆప్యాయంగా పలుకరించుకున్నారు. ఈ కార్యక్రమంలో మంచుకొండ శ్వేత, జే.సంగీత, ఉమాసాగర్, ఎం.మాధవి, ప్రభాకర్, రాజేష్, నరేష్, ఎంజీ శంకర్, రవి తదితరులు పాల్గొన్నారు.

# దేవాలయాలకు విజయ డెయిరీ నెయ్యి: గుత్తా అమిత్

**హైదరాబాద్, (క్రైమ్ మిర్రర్):** రాష్ట్రంలోని అన్ని దేవాలయాలకు విజయ డెయిరీ నెయ్యినే సరఫరా చేస్తామని తెలంగాణ డెయిరీ డెలవప్‌మెంట్ సొసైటీ చైర్మన్ గుత్తా అమిత్‌రెడ్డి తెలిపారు. బీఆర్ఎస్ ప్రభుత్వంలో పాల సేకరణ రేటును మూడు సార్లు రూ.12.48 రూపాయలు పెంచారు. దేశంలో ఏ రాష్ట్రంలో లేని విధంగా బీఆర్ఎస్ ప్రభుత్వంలో పాల సేకరణ రేటు పెంచడంతో పాల సేకరణ గణనీయంగా పెరిగిందన్నారు. ఇక నుంచి విజయ డెయిరీ పాల అమ్మకాలు మరింత పెంచడానికి రాష్ట్రంలోని ప్రభుత్వ కార్యాలయాలకు, సంక్షేమ హాస్టళ్లకు, పాఠశాలలకు, జైళ్లు, హాస్పిటల్స్‌కు అవసరమైన పాలు, పాల పదార్థాలు సరఫరా చేస్తామని పేర్కొన్నారు. అలాగే పెండింగ్ పాల బిల్లులను కూడా త్వరలోనే చెల్లిస్తామని ఆయన చెప్పారు.

# బదిలీలపై పవన్ కళ్యాణ్ సమీక్ష

అమరావతి:ఏపీలో చేపట్టిన బదిలీలపై డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్ సమీక్ష నిర్వహించారు. డ్వామా ప్రాజెక్ట్ డైరెక్టర్స్, జిల్లా పంచాయతీ అధికారులు, జడ్పీ సీఈఓ, డీఎల్‌డీఓ బదిలీల ప్రక్రియలో నిబంధనలను అనుసరించాలని అన్నారు. మాతృ శాఖలో ఉన్న అధికారులకే పోస్టింగ్స్ ఇవ్వడం చెప్పుకోదగిన పరిణామమని పవన్ కళ్యాణ్ పేర్కొన్నారు. బదిలీలకు ఉద్దేశించిన మార్గదర్శకాలు, నిబంధనలు పాటించడం వల్ల అప్రాధాన్యమైన స్థానాల్లో ఉన్నవారికి తగిన పోస్టింగ్స్ ఇవ్వడం సాధ్యమవుతుందని తెలిపారు. అందుకు అనుగుణంగా ఉన్నతాధికారులు పారదర్శకంగా కసరత్తు చేశారని డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్ వివరించారు.


క్రైమ్ THE మిర్రర్ ®
Voice of Anti Corruption
విలేకరులు కావలెను
క్రైమ్ మిర్రర్ తెలుగు దినపత్రికలో
పనిచేయుటకు సిటీ బ్యూరో, జిల్లా బ్యూరోలు,
నియోజకవర్గం, మండలాలవారీగా
అనుభవం కలిగిన రిపోర్టర్లు కావలెను.
ఆసక్తిగలవారు ఈ క్రింది
నెంబరుకు సంప్రదించగలరు.
93934 46188



# కింగ్ అర్జున్

ప్రతిష్ఠాత్మక చెస్ ఒలింపియాడ్‌లో భారత్ విజయ పతాక ఎగురవేసింది. హంగరీ దేశాన మువ్వన్నెల పతాకాన్ని సగర్వంగా రెపరెపలాడించింది. ఇన్నాళ్లు అందని ద్రాక్షగా ఊరిస్తూ వచ్చిన ఒలింపియాడ్‌లో పసిడి పతక ధమాకాతో కొత్త చరిత్ర లిఖించింది. ఓపెన్, మహిళల విభాగాల్లో స్వర్ణాలు కైవసం చేసుకుని భారత్ సత్తాచాటింది. ఈ చారిత్రక విజయంలో మన తెలంగాణకు చెందిన ఇరిగేసి అర్జున్ అద్భుత ప్రదర్శనతో అదరగొట్టాడు. దేశానికి పసిడి పతకం అందించడమే ఏకైక లక్ష్యంగా పెట్టుకున్న ఈ ఓరుగల్లు ముద్దుబిడ్డ అనుకున్నది సాధించాడు.

వరుస విజయాలతో ప్రత్యర్థుల పాలిట సింహస్వప్నంలా నిలుస్తూ చిరకాల కలను సాకారం చేయడంలో కీలకమయ్యాడు. రౌండ్ రౌండ్‌కు గెలుపు వాడిని పెంచుకుంటూ పోయిన అర్జున్ వ్యక్తిగత స్వర్ణం సహా టీమ్ ఈవెంట్‌లో పసిడి కొల్లగొట్టి ఔరా అనిపించాడు.

**చెస్ ఒలింపియాడ్‌లో భారత్ విజయంపై?**

సుదీర్ఘ చరిత్ర కల్గిన చెస్ ఒలింపియాడ్‌లో భారత్ చిరస్మరణీయ విజయం చిరకాలం గుర్తుండిపోతుంది. మేము ప్రాతినిధ్యం వహించిన ఓపెన్ విభాగంతో పాటు మహిళల కేటగిరీలోనూ భారత్ పసిడి పతకాలతో మెరువడం మరిచిపోలేనిది. ఇప్పటి వరకు సాధ్యపడని డబుల్ ధమాకా(రెండు స్వర్ణాలు) ప్రదర్శన ఇన్నేండ్లకు సాధ్యపడింది. టోర్నీ ఆసాంతం ప్లేయర్లందరూ అద్భుత ప్రదర్శన కనబరిచారు. ప్రత్యర్థి ఎవరన్నది లెక్కచేయని నైజంతో ముందుకుసాగుతూ ట్రోఫీ కైవసం చేసుకున్నాం.

**మెగాటోర్నీలో మీపై అంచనాలు?**

ఒలింపిక్స్‌కు సమానంగా భావించే చెస్ ఒలింపియాడ్‌లో టోర్నీకి ముందు నాపై పెద్దగా అంచనాలేమి లేవు. అదీ నా విజయానికి కారణమైందని చెప్పొచ్చు. చెస్ ఒలింపియాడ్ కోసం ప్రత్యేకంగా దృష్టిపెట్టలేదు. సాధారణ టోర్నీల్లాగే బరిలోకి దిగాను. కానీ ఈసారి ఎలాగైనా స్వర్ణం సాధించాలన్న లక్ష్యాన్ని మనసులో అనుకున్నాను. ఇలా చేయడం వలన ఒత్తిడి దరిచేరకుండా చేయవచ్చన్న ఆత్మవిశ్వాసంతో సాగడం కలిసివచ్చింది.

**ఈ విజయాన్ని ఎలా ఆస్వాదిస్తున్నారు?**

ఇన్నేండ్ల నా కెరీర్‌లో దక్కిన అపూర్వ విజయాన్ని బాగా ఆస్వాదిస్తున్నాను. నాపై పెట్టుకున్న అంచనాలను వమ్ముచేయకుండా జట్టు విజయంలో కీలకమైనందుకు సంతోషంగా ఉంది. జట్టు వ్యూహాల్లో భాగంగా నేను, గుకేశ్ ప్రత్యర్థుల ఎత్తులకు చిక్కకుండా ముందుకు సాగాం. ముందే నిర్దేశించుకున్న వ్యూహం ప్రకారం గుకేశ్ తొలి బోర్డులో ఆడితే నేను మూడో బోర్డులో పోటీకి దిగడం కలిసివచ్చింది. టోర్నీ తొలి రౌండ్లలో ఒకింత తడబడినా..ప్రత్యర్థులకు తలొగ్గలేదు. ఆడిన 11 రౌండ్లలో 10 పాయింట్లతో టాప్‌లో నిలిచినందుకు గర్వంగా ఉంది. మొత్తం 11 రౌండ్లలో తొమ్మిది విజయాలు రెండు డ్రాలు ఎదుర్కొన్నాను. డ్రా అయిన రెండింటిలో గెలిచే అవకాశాన్ని తృటిలో చేజార్చుకున్నాను.

**టోర్నీలో మరిచిపోలేని సందర్భం?**

టోర్నీ మొత్తమ్మీద అమెరికాతో జరిగిన 10వ రౌండ్ పోరు హోరాహోరీగా సాగింది. స్వర్ణం సాధించాలంటే తప్పక గెలువాల్సిన పరిస్థితుల్లో మన ప్లేయర్లు సత్తాచాటారు. తొలుత ఫాబియానో కరువానపై గుకేశ్ గెలువడం కలిసొచ్చింది. అయితే వెస్లీ చేతిలో ప్రజ్ఞానంద ఓడిపోవడం, లెవాన్ ఆరోనియాన్‌తో విదిత్ గుజరాతి గేమ్ డ్రా చేసుకోవడంతో సమీకరణాలు పూర్తిగా మారిపోయాయి. కీలకమైన ఆఖరి పోరులో నేను డోమింగెజ్ పెరెజ్‌పై గెలువడంతో భారత్ 2.5–1.5తో విజయాన్ని ఖాతాలో వేసుకుంది. దీంతో మరో రౌండ్ మిగిలుండగానే 19 పాయింట్లతో టాప్‌లోకి దూసుకొచ్చాం. చివరిదైన 11 రౌండ్‌లో స్లోవేనియాపై 3.5–0.5తో విజయంతో స్వర్ణం మన ఖాతాలో చేరింది.

# లంకదే తొలి టెస్టు



**గాలె:** సొంతగడ్డపై న్యూజిలాండ్‌తో జరిగిన తొలి టెస్టులో శ్రీలంక 63 పరుగులతో జయకేతనం ఎగురవేసింది. 275 పరుగుల ఛేదనలో భాగంగా కివీస్ 211 పరుగులకే ఆలౌట్ అయింది. ఆఖరి రోజు ఆ జట్టు విజయానికి 68 పరుగులు కావాల్సి ఉండగా ఆ జట్టు మరో 5 పరుగులే జతచేయగలిగింది.

న్యూజిలాండ్ భారీ ఆశలు పెట్టుకున్న రచిన్ రవీంద్ర (92) ఒక్క పరుగు మాత్రమే జోడించి ఔటయ్యాడు. లంక స్పిన్నర్ ప్రభాత్ జయసూర్య ఐదు (5/68) వికెట్లతో విజృంభించాడు.

# యూరోప్ జట్టుదే లేవర్ కప్

**వరల్డ్ టీమ్‌పై 13-11 పాయింట్లతో విజయం**



బెర్లిన్: రెండేళ్ల తర్వాత లేవర్ కప్ టీమ్ టెన్నిస్ టోర్నీలో యూరోప్ జట్టు విజేతగా నిలిచింది. వరల్డ్ టీమ్‌తో మూడు రోజులపాటు జరిగిన ఈ టోర్నీలో యూరోప్ జట్టు 13%-%11 పాయింట్ల తేడాతో వరల్డ్ టీమ్ జట్టును ఓడించి ఐదోసారి విన్నర్స్ ట్రోఫీని దక్కించుకుంది. యూరోప్ జట్టు తరఫున అలెగ్జాండర్ జ్వెరెవ్ (జర్మనీ), కార్లోస్ అల్‌కరాజ్ (స్పెయిన్), డానిల్ మెద్వెదెవ్ (రష్యా), కాస్పర్ రూడ్ (నార్వే), దిమిత్రోవ్ (బల్గేరియా), సిట్సిపాస్ (గ్రీస్), ఫ్లావియో కొబోలి (ఇటలీ), జాన్ లెనార్డ్ స్ట్రఫ్ (జర్మనీ) బరిలోకి దిగారు. జాన్ బోర్గ్ (స్వీడన్) కెప్టెన్‌గా, థామస్ ఎన్‌క్విస్ట్ (స్వీడన్) వైస్ కెప్టెన్‌గా వ్యవహరించారు. వరల్డ్ టీమ్ తరఫున టేలర్ ఫ్రిట్జ్, ఫ్రాన్సెస్ టియాఫో, బెన్ షెల్టన్ (అమెరికా), అలెజాండ్రో తబిలో (చిలీ), ఫ్రాన్సిస్కో సెరున్‌డొలో (అర్జెంటీనా), థనాసి కొకినాకిస్ (ఆస్ట్రేలియా) పోటీపడ్డారు. జాన్ మెకన్రో (అమెరికా) కెప్టెన్‌గా, ప్యాట్రిక్ మెకన్రో (అమెరికా) వైస్ కెప్టెన్‌గా వ్యవహరించారు. రోజుకు మూడు చొప్పున మొత్తం తొమ్మిది సింగిల్స్ మ్యాచ్‌లు... రోజుకు ఒక డబుల్స్ మ్యాచ్ చొప్పున మొత్తం మూడు డబుల్స్ మ్యాచ్‌లు నిర్వహించారు. తొలి రోజు మ్యాచ్‌లో గెలిచిన ప్లేయర్‌కు 1 పాయింట్... రెండో రోజు మ్యాచ్‌లో నెగ్గిన ప్లేయర్‌కు 2 పాయింట్లు... మూడో రోజు మ్యాచ్‌లో విజయం సాధించిన ప్లేయర్‌కు 3 పాయింట్లు కేటాయించారు. తొలుత 13 పాయింట్లు సాధించిన జట్టును విజేతగా ప్రకటిస్తారు. రెండు రోజుల మ్యాచ్‌ల తర్వాత వరల్డ్ టీమ్ 8%-%4 పాయింట్లతో ఆధిక్యంలో నిలిచింది. అయితే చివరిరోజు యూరోప్ జట్టు మూడు మ్యాచ్‌ల్లో నెగ్గి 9 పాయింట్లు సాధించగా... వరల్డ్ జట్టు ఒక మ్యాచ్‌లో గెలిచి 3 పాయింట్లు సంపాదించింది. ఓవరాల్‌గా యూరోప్ జట్టు 13–11తో విజయాన్ని దక్కించుకుంది. ఆఖరి రోజు డబుల్స్ మ్యాచ్‌లో కార్లోస్ అల్‌కరాజ్ కాస్పర్ రూడ్ (యూరోప్) జోడీ 6%-2, 7-%6 (8/6)తో బెన్

# కెరీర్ బెస్ట్ ర్యాంక్‌లో సహజ, రష్మిక

హైదరాబాద్: మహిళల టెన్నిస్ సంఘం (డబ్ల్యూటీఏ) సింగిల్స్ ర్యాంకింగ్స్‌లో భారత రైజింగ్ స్టార్స్, తెలంగాణ క్రీడాకారిణులు సహజ యామలపల్లి, భమిడిపాటి శ్రీవల్లి రష్మిక కెరీర్ బెస్ట్‌ర్యాంక్‌లను అందుకున్నారు. సోమవారం విడుదల చేసిన తాజా ర్యాంకింగ్స్‌లో 23 ఏళ్ల సహజ మూడు స్థానాలు ఎగబాకి 295వ స్థానంలో... 22 ఏళ్ల రష్మిక 22 స్థానాలు పురోగతి సాధించి 318వ స్థానంలో నిలిచారు. సహజ భారత నంబర్‌వన్‌గా కొనసాగుతుండగా... రష్మిక భారత మూడో ర్యాంకర్‌గా ఉంది. ఈ ఏడాది సహజ అంతర్జాతీయ టెన్నిస్ సమాఖ్య (ఐటీఎఫ్) సర్క్యూట్‌లో నిలకడగా రాణిస్తోంది. మొత్తం 23 టోర్నీల్లో పోటీపడింది. 29 మ్యాచ్‌ల్లో విజయం సాధించి, 22 మ్యాచ్‌ల్లో ఓడిపోయింది. లాస్‌ఏంజె లిస్‌లో జరిగిన ఐటీఎఫ్ డబ్ల్యూ15 టోర్నీలో సహజ సింగిల్స్ విభాగంలో టైటిల్ సాధించింది. మరోవైపు రష్మిక కూడా ఆకట్టుకునే ప్రదర్శన చేసింది. 21 టోర్నీల్లో పాల్గొన్న రష్మిక 25 మ్యాచ్‌ల్లో గెలిచి, 21 మ్యాచ్‌ల్లో పరాజయం పాలైంది. ఇండోర్‌లో జరిగిన ఐటీఎఫ్ డబ్ల్యూ35 టోర్నీలో సింగిల్స్ టైటిల్‌ను సొంతం చేసుకుంది.





GHMC
hmda Growing Global
TS-bPASS
MAKAM GANGADHAR NETHA
President (GHMC)
Telangana Building Planners Association
E-mail ID : sriswamiplanners@gmail.com



SRI SWAMI ASSOCIATES
ARCHITECTS • ENGINEERS • SURVEYORS
We Undertake Building Plans, Lay-Out Plans & Permissons, LRS, BRS, Tax Assesments
GHMC, HMDA, DTCP, TS-bpass, Layout, Building Permissions
వాస్తుకి బిల్డింగ్ ప్లానింగ్, నక్ష చేయబడును
డిజిటల్ లాండ్స్ సర్వే, లే-అవుట్లు,
నక్ష ప్లానింగ్ చేయబడును,
Auto DCR Online Up Loading, Pre DCR Cad Drawing
భవన నిర్మాణం దరఖాస్తు కొరకు సంప్రదించండి.
H.No. 11-5-565, Bhagya Laxmi Towers,
Opp: GHMC Circle Office,
Saroornagar, Hyderabad - 500035
Mob : 9393929595

# కామన్వెల్త్ మహిళా పార్లమెంటరీ కమిటీ సభ్యురాలిగా పురందేశ్వరి

న్యూఢిల్లీ,సెప్టెంబర్23(ఆర్ఎన్ఎ): బిజెపి రాష్ట్ర అధ్యక్షురాలు, రాజమండ్రి ఎంపీ దగ్గుబాటి పురందేశ్వరి కామన్వెల్త్ పార్లమెంటరీ అసోసియేషన్ (సిపిఎ) ఇండియా రీజియన్ ప్రతినిధిగా కామన్వెల్త్ మహిళా పార్లమెంటరీ స్టీరింగ్ కమిటీ సభ్యురాలిగా నామినేట్ అయ్యారు. ఈమేరకు లోక్‌సభ స్పీకర్ ఓ బిర్లా ఉత్తర్వులు ఇచ్చారు. 2026 చివరి వరకు ఈ నియామకం వర్తిస్తుంది. సిపిఎ ఇండియా రీజియన్ ఎగ్జిక్యూటివ్ కమిటీ సభ్యురాలుగానే కాకుండా మహిళా పార్లమెంటేరియన్లు, స్టీరింగ్ కమిటీకి చైర్‌పర్సన్‌గా కూడా ఆమె వ్యవహరిస్తారని ఉత్తర్వుల్లో పేర్కొన్నారు.







# కర్నూలులో హైకోర్టు బెంచ్ ఏర్పాటు

## 100 ఎకరాల్లో న్యాయకళాశాల

## సీఎం చంద్రబాబు సమీక్షలో వెల్లడి

**అమరావతి,,(క్రైమ్ మిర్రర్):** కర్నూలులో హైకోర్టు బెంచ్ ఏర్పాటుకు రాష్ట్ర ప్రభుత్వం సిద్ధంగా ఉందని ఏపీ సీఎం చంద్రబాబు అన్నారు. అలాగే బార్ కౌన్సిల్ ఆఫ్ ఇండియా ట్రస్టు ద్వారా 100 ఎకరాల్లో న్యాయకళాశాల ఏర్పాటు చేయాలని నిర్ణయించారు. సోమవారం ఆయన న్యాయశాఖపై సమీక్ష నిర్వహించారు. హైకోర్టు బెంచ్ ఏర్పాటు ప్రతిపాదనలను త్వరలోనే కేంద్రానికి పంపనున్నట్లు స్పష్టం చేశారు. మంత్రివర్గ భేటీలో తీర్మానం చేసి కేంద్రానికి పంపిస్తామన్నారు. అమరావతిలో అంతర్జాతీయ న్యాయ కళాశాల ఏర్పాటుపైనా సీఎం సమీక్ష నిర్వహించారు. జూనియర్ న్యాయవాదులకు నెలకు రూ.10 వేల గౌరవ వేతనం ఇవ్వాలని నిర్ణయించారు. ఈ పక్రియ ప్రారంభించాలని అధికారులను ఆదేశించారు. జూనియర్ న్యాయవాదులకు శిక్షణ అకాడమీ ఏర్పాటుకు కార్యాచరణ సిద్ధం చేయాలన్నారు.అంతకుముందు మైనారిటీ సంక్షేమ శాఖపై ఏపీ సీఎం చంద్రబాబు సమీక్ష నిర్వహించారు. మైనార్టీ సంక్షేమ పథకాల పునర్వ్యవస్థీకరణపై చర్చించారు. కడప హజ్ హౌస్, గుంటూరు క్రిస్టియన్‌భవన్‌ను పూర్తి చేయాలని అధికారులను సీఎం ఆదేశించారు. నూర్ బాషా కార్పొరేషన్ ఏర్పాటు చేయాలని నిర్ణయించారు. ఇమామ్‌లకు రూ. 10 వేలు, మౌజన్‌లకు రూ. 5 వేలు గౌరవ వేతనం ఇవ్వాలని నిర్ణయించారు. మైనార్టీలకు లబ్ది జరిగేలా వక్ఫ్ భూములను అభివృద్ధి చేయాలని అధికారులను ఆదేశించారు.

# చైల్డ్ పోర్నోగ్రఫీ ముమ్మాటికీ నేరమే

## దీనిని పోక్సో చట్టంలో చేర్చాలని కేంద్రానికి సూచన

## మద్రాస్ హైకోర్టు తీర్పును రద్దు చేస్తూ సుప్రీం తీర్పు

**న్యూఢిల్లీ,,(క్రైమ్ మిర్రర్):** చైల్డ్ పోర్నోగ్రఫీ ముమ్మాటికీ నేరమేనని సుప్రీంకోర్టు స్పష్టం చేసింది. దీనిని చూడటం నేరం కాదని మద్రాసు హైకోర్టు ఇచ్చిన తీర్పును సవాలు చేస్తూ దాఖలైన పిటిషన్‌పై సుప్రీంకోర్టు సోమవారం తీర్పు వెలువరించింది. చైల్డ్ పోర్నోగ్రఫీ చూడటం, ఆ వీడియోలను డౌన్‌లోడ్ చేసుకోవడం పోక్సో చట్టం కింద నేరమేనని వెల్లడించింది. ఈమేరకు మద్రాసు హైకోర్టు ఇచ్చిన తీర్పును అత్యున్నత న్యాయస్థానం పక్కనబెట్టింది. ఇలాంటి తీర్పునిచ్చి హైకోర్టు ఘోరమైన తప్పిదం చేసిందని ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ డి.వై. చంద్రచూడ్ నేతృత్వంలోని ధర్మాసనం తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేసింది. ఈ సందర్భంగా కేంద్రానికి పలు సూచనలు చేసింది. పోక్సో చట్టంలో 'చైల్డ్ పోర్నోగ్రఫీ అనే పదాన్ని 'చైల్డ్ సెక్సువల్ ఎక్స్‌ప్లాయిటేటివ్ అండ్ అబ్యూసివ్ మెటీరియల్' అనే పదంతో మారుస్తూ పోక్సో చట్టానికి సవరణలు చేయాలని పార్లమెంట్‌కు తెలిపింది. ఆ సవరణలు అమల్లోకి వచ్చేవరకు దీనిపై ఆర్డినెన్స్ జారీ చేసుకోవచ్చని తెలిపింది. ఇకపై కోర్టులు 'చైల్డ్ పోర్నోగ్రఫీ' పదాన్ని ఉపయోగించవద్దని ఆదేశించింది. చైల్డ్ పోర్నోగ్రఫీని డౌన్‌లోడ్ చేసుకున్నాడని ఆరోపణలు ఎదుర్కొంటున్న యువకుడిపై క్రిమినల్ చర్యలను నిలిపివేస్తూ జనవరి 11న మద్రాసు హైకోర్టు ఆదేశాలిచ్చింది. పోక్సో, ఐటీ చట్టాల ప్రకారం.. చైల్డ్ పోర్నోగ్రఫీని చూడటం తప్పేమీ కాదంటూ ఆ సందర్భంగా వ్యాఖ్యానించింది. ఆరోపణలు ఎదుర్కొంటున్న 28 ఏళ్ల యువకుడు వీడియోలు చూడటం తప్ప ఏమీ చేయలేదని, వాటిని ఇతరులకూ పంపలేదని పేర్కొంది. పోర్నోగ్రఫీకి అలవాటుపడిన యువతను శిక్షించడం కన్నా వారిని సరైన మార్గం వైపు నడిపించడంపై దృష్టి పెట్టాలని అభిప్రాయపడింది. ఈ తీర్పుపై పలు ఎన్జీవోలు, చిన్నారుల సంక్షేమ సంఘాలు సుప్రీంకోర్టులో పిటిషన్ దాఖలు చేశాయి. వీటిపై విచారణ జరిపిన సర్వోన్నత న్యాయస్థానం.. హైకోర్టు తీర్పును తోసిపుచ్చింది. సదరు యువకడిపై క్రిమినల్ చర్యలను పునరుద్ధరించింది.

# కులగణన పేరు చెబితేనే ప్రధానికి భయం

## భాజపా బహుజన వ్యతిరేకి అంటూ రాహుల్ విమర్శలు

**న్యూఢిల్లీ,,(క్రైమ్ మిర్రర్):** కులగణన పేరు చెప్పడానికే ప్రధాని భయపడుతున్నారని కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీ భాజపాపై మండిపడ్డారు. భాజపా బహుజన వ్యతిరేకి ఆయన ఆరోపించారు. కేంద్రం తమకు వ్యతిరేకంగా ఎన్ని ప్రచారాలు చేసినా.. రిజర్వేషన్లను కాపాడుకుంటామన్నారు. బహుజనులు వారి హక్కులను పొందడం బహుశా ఇష్టం లేదేమోనని సోషల్ మీడియా వేదికగా ఆరోపించారు. బహుజన వ్యతిరేక భాజపా ఎన్ని అబద్దాలు వ్యాప్తి చేసినా - రిజర్వేషన్లకు నష్టం జరగనివ్వం. రిజర్వేషన్లపై 50 శాతం పరిమితిని తొలగించి సమగ్ర కులగణన జరిపి ప్రతీ వర్గానికి హక్కులు, వాటా, న్యాయం జరిగేవరకు ఆగబోము' అని రాహుల్ అన్నారు. కులగణన అనేది దేశంలోని రాజకీయ సమస్య మాత్రమే కాదని, వెనకబడిన వర్గాల వారికి న్యాయం చేయడమే తన జీవిత లక్ష్యమని

పేర్కొన్నారు. రాహుల్ గాంధీ ఇప్పటికే పలుమార్లు రిజర్వేషన్ల గురించి మాట్లాడిన విషయం తెలిసిందే. ఇటీవల అమెరికా పర్యటనలో ఉన్న కాంగ్రెస్ ఎంపీ రాహుల్ గాంధీ రిజర్వేషన్ల అంశంపై చేసిన వ్యాఖ్యలు వివాదాస్పదంగా మారాయి. ప్రస్తుతం భారత్‌లో ఆదివాసీలు, దళితులు, ఓబీసీలకు సరైన ప్రాధాన్యం దక్కడం లేదని రాహుల్ గాంధీ అన్నారు. అప్పటివరకు అభివృద్ధిలో వారి భాగస్వామ్యం అంతంత మాత్రంగానే ఉందన్నారు. దేశంలో అన్నివర్గాల వారికీ పారదర్శకంగా అవకాశాలు లభించే పరిస్థితులు వచ్చిన తర్వాతే రిజర్వేషన్ల రద్దు గురించి తమ పార్టీ ఆలోచిస్తుందని వ్యాఖ్యానించారు. దీంతో ఆయన వ్యాఖ్యలు తీవ్ర చర్చనీయాంశంగా మారాయి.

# తిరుమల ఆలయంలో శాంతిహోమం

## పంచగవ్యాలతో శ్రీవారి ఆలయంలో ప్రోక్షణ

## ఒకరోజు హోమంతో అంతటా సంప్రోక్షణ కార్యక్రమం

## స్వచ్ఛమైన నేతితోనే లడ్డూలు..ఇతర ప్రసాదాల తయారీ

## తితిదే ఈవో శ్యామలరావు, ప్రధానార్చకుల వివరణ



**తిరుమల,(క్రైమ్ మిర్రర్):** శ్రీవారి ఆలయంలో జరిగిన దోషాలకు ప్రాయశ్చిత్తంగా శాంతి హోమం నిర్వహించారు. ఆలయంలోని అన్ని విభాగాల్లో ప్రోక్షణ కార్యక్రమాలు చేపట్టారు. తిరుమల శ్రీవారి లడ్డూ ప్రసాదంలో కల్తీ నెయ్యి వాడకంతో అపచారం జరిగిన విషయం తెలిసిందే. ఈ నేపథ్యంలో సోమవారం ఉదయం శ్రీవారి ఆలయంలో మహా శాంతియాగం చేపట్టారు. పూర్ణాహుతితో శాస్త్రోక్తంగా హోమం పూర్తి అయ్యింది. సోమవారం రోహిణి నక్షత్రం శ్రీవారికి ముహూర్త బలం కావడంతో ఉదయం 6 గంటల నుంచి 10 గంటల వరకు మహాశాంతి యాగాన్ని నిర్వహించారు. ఆలయంలోని యాగశాలలో ఆగమ పండితులు, అర్చకులు హోమం నిర్వహించారు. ముందుగా మహాశాంతి యాగం, వాస్తు హోమం నిర్వహణ జరిగింది.

కాగా శ్రీవారికి నిర్వహించే ఆర్జితసేవలకు ఆటంకం కలగకుండా ఒక్కరోజు మాత్రమే యాగం నిర్వహించేలా ఆగమ పండితులు నిర్ణయించారు. ప్రస్తుతం మహాశాంతియాగం ముగియగా.. పంచగవ్యాలతో శ్రీవారి ఆలయంతో పాటు వకుళ మాత పోటు, లడ్డు పోటు, బూందీ పోటు, ప్రసాద విక్రయశాలల్లో అర్చకులు సంప్రోక్షణ చేపట్టారు. ఆలయంలో శాంతి హోమం, పంచగవ్య ప్రోక్షణ నిర్వహించారు. ఈ కార్యక్రమాల అనంతరం తితిదే ఈవో శ్యామలరావు, ఆలయ అర్చకులు మీడియాతో మాట్లాడారు. ఆలయంలోని అన్ని విభాగాల్లో ప్రోక్షణ కార్యక్రమాలు చేసినట్లు ఆలయ ప్రధానార్చకులు వేణుగోపాల దీక్షితులు తెలిపారు. స్వామి వారికి మహానైవేద్యం పూర్తి చేసినట్లు తెలిపారు. ప్రసాదాల తయారీ కేంద్రాల్లో ప్రోక్షణ చేస్తున్నామని అన్నారు. దోషం కలిగిందన్న భావన లేకుండా ఈ కార్యక్రమం చేపట్టామన్నారు. చివరిగా పూర్ణాహుతి కార్యక్రమంతో అన్ని దోషాలు తొలగుతాయని తెలిపారు. భక్తులెవరూ ఆందోళన చెందవద్దన్నారు. ఇటీవల జరిగిన దోషాలు తొలగిపోవాలని శాంతి హోమం చేశాం. పవిత్రోత్సవాలకు ముందే నెయ్యి మార్చేశాం. లడ్డూ ప్రసాదం విషయంలో ఇకపై ఎలాంటి అనుమానాలొద్దు. పవిత్రోత్సవాల ముందు జరిగిన దోషం.. పవిత్రోత్సవాలతో పోయింది. మార్చిన నెయ్యితోనే ఆ తర్వాత ప్రసాదాలు తయారుచేశాం. తెలిసీ తెలియక జరిగిన దోషాలు శాంతిహోమం, ప్రోక్షణతో తొలగుతాయని వేణుగోపాల దీక్షితులు అన్నారు. తిరుమలలో కలకలం రేపిన కల్తీ నెయ్యి దోషాన్ని గత నెల ఆగస్టులో సంప్రోక్షణతో పోగొట్టామని, భక్తులు ఎవరూ ఆందోళన చెందవద్దని టీటీడీ కార్యనిర్వహణాధికారి శ్యామలరావు వెల్లడించారు. తిరుమల ఆలయంలో నిర్వహించే అనేక కార్యక్రమాల్లో తెలుసో తెలియక జరిగే దోష నివారణకు ప్రతి ఏడాది శ్రావణ మాసంలో పవిత్రోత్సవాలు నిర్వహిస్తాం. ఇందులో భాగంగా ఆగస్టులోనే ఆలయంలో అన్న ప్రసాదపోటు, లడ్డూ పోటులో సంప్రోక్షణ చేశాం. అందులోని కృష్ణస్వామి మూర్తులకు పవిత్రాలను సమర్పించాం. కల్తీ నెయ్యి వలన ఏమైనా దోషాలు ఉండుంటే కూడా తొలగిపోయాయి. అయినప్పటికీ భక్తుల్లో నెలకొన్న ఆందోళన దృష్ట్యా ఆగమశాస్త్ర పండితులు, పెద్దజియ్యంగార్లను సంప్రదించిన తర్వాత సీఎం చంద్రబాబు శ్రీవారి ఆలయంలో ఒకరోజు శాంతి హోమం నిర్వహిస్తే బాగుంటుందని సూచించారు. ఇందులో భాగంగా సోమవారం ఉదయం 6 నుంచి 10 గంటల వరకు శాంతిహోమం చేపట్టామని అన్నారు. శ్రీవారి ఆలయంలోని యాగబావి వద్ద యాగశాలలో, మూడు హోమగుండాలు (వాస్తు, సభ్యం, పౌండరీక) ఏర్పాటు చేసి శాస్త్రోక్తంగా నిర్వహించామని అన్నారు. అదేవిధంగా అన్ని ఆలయాల్లో పంచగవ్య ప్రోక్షణ చేపట్టామని ఈవో శ్యామలరావు వివరించారు.

# అఖిలాండం వద్ద ప్రమాణానికి యత్నం

## కరుణాకర్ రెడ్డిని తరలించిన పోలీసులు


**తిరుమల,,(క్రైమ్ మిర్రర్):** లడ్డూ కల్తీపై ప్రమాణం చేస్తానంటూ తితిదే మాజీ ఛైర్మన్ భూమన కరుణాకర్ రెడ్డి తిరుమలకు వెళ్లారు. పుష్కరిణిలో స్నానం చేసి, మాఢవీధుల్లో ప్రదక్షిణ చేసిన అనంతరం అఖిలాండం వద్ద కొబ్బరికాయ కొట్టి హారతి ఇచ్చారు. ఆ తర్వాత భూమన ప్రమాణం చేస్తుండగా శాంతిభద్ర తలకు విఘాతం కలుగుతుందంటూ పోలీసులు అడ్డుకున్నారు. భూమన కరుణాకర్ రెడ్డిని అదుపులోకి తీసుకున్నారు. అఖిలాండం వద్ద కరుణాకర్ రెడ్డిని అదుపులోకి తీసుకొని.. అతని వాహనంలోనే తిరుపతికి తరలించారు. ఈ సందర్భంగా కరుణాకర్ రెడ్డి మాట్లాడుతూ... కొద్ది రోజులుగా తన మనస్సు తల్లడిల్లిపోతోందని.. తాను ఏ తప్పు చేయలేదని... ఏ పరీక్షకైనా సిద్ధమని కరుణాకర్ రెడ్డి చెప్పారు. తన హయాంలో ఏదైనా తప్పు చేసి ఉంటే.. తాను.. తన కుటుంబం నాశనం అయిపోతామని కరుణాకర్ రెడ్డి ప్రమాణం చేశారు. ఈ సందర్భంగా కూటమి ప్రభుత్వంపై విమర్శలు చేసేందుకు కరుణాకర్ రెడ్డి యత్నించారు. లడ్డూలు కలంకితమైందని.. కలుషిత రాజకీయ మనుషులు ఆరోపణలు చేశారని అన్నారు. ఈ సమయంలో కరుణాకర్ రెడ్డిని పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. తిరుమల శ్రీవారి లడ్డూ ప్రసాదంలో నెయ్యి కల్తీ వ్యవహారం రాజకీయంగా పెను ప్రకంపనలు సృష్టిస్తోంది. వైసీపీ హయాంలో కొన్నాళ్లు భూమన కరుణాకర్ రెడ్డి కూడా టీటీడీ ఛైర్మన్ గా ఉన్నారు. వైసీపీ ఓడిపోయిన తర్వాత రాజీనామా చేశారు. దీంతో నెయ్యి కల్తీ అంశంపై ఆయనపై కూడా ఆరోపణలు వస్తున్నాయి. దీంతో తాను కొండపై ప్రమాణం చేస్తానని ఆయన అనుచరులతో కలిసి తిరుమలకు వచ్చారు. తిరుమల ఆలయం ముందు నమస్కరించి బేడీ ఆంజనేయ స్వామి దర్శనం చేసుకున్న తర్వాత అఖిలాండం వద్ద కరుణాకర్ రెడ్డి కర్పూరం వెలిగించి హారతి ఇచ్చారు. ఆ తర్వాతా టెంకాయ కొట్టి ప్రమాణం చేస్తున్నట్లుగా మీడియా ప్రతినిధులతో రాజకీయ అంశాలు మాట్లాడుతూండటంతో టీటీడీ అధికారులు, పోలీసులు ఆయనను అడ్డుకున్నారు.

# గుజరాత్‌లో దారుణ ఘటన

## బాలికపై అత్యాచారానికి ప్రిన్సిపల్ యత్నం

## ప్రతిఘటించడంతో గొంతునులిమి హత్య

**గాంధీనగర్,,(క్రైమ్ మిర్రర్):** గుజరాత్‌లో మరో దారుణం వెలుగు చూసింది.స్కూల్ ప్రిన్సిపల్ చేతిలో బాలిక హత్యకు గురైంది. కారులో విద్యార్థినిపై ప్రిన్సిపాల్ అత్యాచార చేయడానికి ప్రయత్నించడం తో బాలిక ప్రతిఘటించింది. ఈ క్రమంలో బాలిక గొంతు నులిమి చంపేసి అనంతరం మృతదేహాన్ని స్కూల్ వెనుక పడేసిన సంఘటన గుజరాత్ రాష్ట్రం దాహోద్ జిల్లా సింగ్వాద్‌లో జరిగింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం?. గోవింద్ నాథ్ అనే పంతులు ఓ గ్రామంలోని ప్రభుత్వ పాఠశాలలో ప్రధానోపాధ్యాయుడి గా పని చేస్తున్నాడు. 10.20 నిమిషాలకు గోవింద్ తన కారులో స్కూల్ కు వెళ్తుండగా బాలికను(6) తీసుకెళ్లాలని ప్రిన్సిపాల్‌ను తల్లి బతిమాలింది. దీంతో ఆరేళ్ల బాలికను కారులో ఎక్కించుకున్నాడు. మార్గం మధ్యలో బాలికపై ప్రిన్సిపాల్ అత్యాచారం చేయడానికి ప్రయత్నిస్తుండగా విద్యార్థిని ప్రతిఘటించింది. ఈ విషయం బయటకు తెలిస్తే తన పరువు పోతుందని వెంటనే బాలిక గొంతునులిమి చంపేశాడు. బాలిక మృతదేహాన్ని కారులో డిక్కీలో పడేసిన అనంతరం స్కూల్ కు వెళ్లాడు.



ఎవరు లేని సమయంలో కారు డిక్కీలో నుంచి మృతదేహాన్ని బయటకు తీసి స్కూల్ వెనుక బాగంలో పడేశాడు. స్కూల్ బ్యాగ్, చెప్పులు తరగతి గదిలో పడేశాడు. సాయంత్రం కూతురు ఇంటికి రాకపోవడంతో గ్రామంలో తల్లిదండ్రులు వెతికారు. పాఠశాల ఆవరణంలో వెతకగా స్కూల్ వెనుకభాగంలో బాలిక మృతదేహం కనిపించింది. తల్లిదండ్రుల ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసి ప్రిన్సిపాల్‌ను గోవింద్‌నాథ్‌ను అదుపులోకి తీసుకొని ప్రశ్నించారు. తానే చంపినట్లు ఒప్పుకోవడంతో అతడిని అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించారు.

# నటి కాదంబరి జెత్వాని కేసు

## కోర్టుకు విద్యాసాగర్ రిమాండ్ రిపోర్టు

## ముగ్గురు సీనియర్ పోలీసు అధికారుల పేర్లు

**విజయవాడ,,(క్రైమ్ మిర్రర్):** ముంబయి నటి కాదంబరి జెత్వాని కేసులో ఏ1 నిందితుడిగా ఉన్న కుక్కల విద్యాసాగర్ రిమాండ్ రిపోర్టును పోలీసులు కోర్టుకు సమర్పించారు. నిందితులుగా పలువురు ఐపీఎస్ అధికారుల పేర్లను అందులో చేర్చారు. ఏ2గా పీఎస్ఆర్ ఆంజనేయులు, ఏ3గా కాంతిరాణా, ఏ4గా వెస్ట్‌జోన్ మాజీ ఏసీపీ హనుమంతరావు, ఏ5గా ఇబ్రహీంపట్నం మాజీ సీఐ సత్యనారాయణ, ఏ6గా విశాల్‌గున్నీ పేర్లు చేర్చారు. ఈ కేసులో ఏపీ ప్రభుత్వం ఇప్పటికే ఐదుగురిని సస్పెండ్ చేసింది. విద్యాసాగర్‌తో కాంతిరాణా, ఆంజనేయులు, విశాల్‌గున్నీ కుమ్మక్కైనట్లు రిమాండ్ రిపోర్టులో పోలీసులు వెల్లడించారు. కాదంబరి జెత్వానిని అక్రమంగా అరెస్టు చేసినట్లు పేర్కొన్నారు. జెత్వానిని చేయాలని ఈఏడాది జనవరి 30న కాంతిరాణా తాతా, విశాల్ గున్నీలను పీఎస్ఆర్ ఆంజనేయులు ఆదేశించారు. ఫిబ్రవరి 1న ముంబయి వెళ్లే పోలీసు బృందానికి అప్పటి సీపీగా ఉన్న కాంతి రాణా విమాన టిక్కెట్లను బుక్ చేశారు. అయితే హీరోయిన్‌పై ఫిబ్రవరి 2న కేసు నమోదు చేశారు. కేసు నమోదు కంటే ముందే టిక్కెట్లు కొనుగోలు చేసిన తీరును పరిశీలిస్తే ముందస్తు ప్రణాళిక ప్రకారమే నటిపై కేసు నమోదు చేసినట్లు స్పష్టమవుతుందని రిమాండ్ నివేదికలో తేల్చారు. అనంతరం ముంబయి వెళ్లి ఫిబ్రవరి 3న నటితో పాటు ఆమె తల్లిదండ్రులను సైతం అరెస్ట్ చేసి విజయవాడకు తరలించారన్నారు. వైకాపా నేత విద్యాసాగర్ పలుకుబడికి ఐపీఎస్ అధికారులు ప్రభావితమైనట్లు రిమాండ్ రిపోర్టులో పేర్కొన్నారు. నిందితుడు విద్యాసాగర్ నకిలీ ల్యాండ్ డాక్యుమెంట్స్ తయారు చేశారని తెలిపారు. ఆ డాక్యుమెంట్లపై జెత్వానీ సంతకం లేదని, ఆమెకు తెలియకుండానే ఆమె బ్యాగులో డాక్యుమెంట్లను ఉంచినట్లు పేర్కొన్నారు. ముంబయి నటిపై అక్రమంగా కేసు బనాయించినట్లు స్పష్టమవుతోందన్నారు. విద్యాసాగర్‌ను డెహ్రాడూన్ నుంచి రైలులో అర్ధరాత్రి తీసుకొచ్చిన పోలీసులు ఇబ్రహీంపట్నం పోలీస్‌స్టేషన్‌కు తీసుకెళ్లిన సంగతి తెలిసిందే. అక్కడి నుంచి విజయవాడ ప్రభుత్వ ఆస్పత్రికి తరలించి, వైద్య పరీక్షల అనంతరం న్యాయమూర్తి ఎదుట హాజరుపరిచారు. న్యాయమూర్తి వచ్చే నెల 4 వరకు రిమాండ్ విధించగా.. విజయవాడ సబ్‌జైలుకు తరలించారు.

# ఆది హీరోగా సస్పెన్స్ థ్రిల్లర్ 'షణ్ముఖ'




తెలుగులో మంచి కంటెంట్‌తో వచ్చిన డివోషనల్ థ్రిల్లర్‌కు మంచి ఆదరణ వుంటుందన్న విషయం తెలిసిందే. అయితే తెలుగులోనే కాకుండా ఆసక్తిని కలిగించే నేపథ్యంతో రూపొందే డివోషనల్ చిత్రాలకు అన్ని భాషల్లో మంచి ఆదరణ వుంటుంది. ఇప్పుడు ఆ జాబితాలో చేరడానికి రెడీ అవుతున్న మరో పాన్ ఇండియా సూపర్ డివోషనల్ సస్పెన్స్ థ్రిల్లర్ 'షణ్ముఖ'. పవర్‌ఫుల్ టైటిల్‌తో రూపొందుతున్న ఈ చిత్రంలో ఆది సాయికుమార్ కథానాయకుడు. అవికాగోర్ కథానాయికగా నటిస్తున్న ఈ చిత్రానికి షణ్ముగం సాప్పని దర్శకుడు. సాప్పని బ్రదర్స్ సమర్పణలో తులసీరామ్ సాప్పని, షణ్ముగం సాప్పని, ఈ చిత్రాన్ని నిర్మిస్తున్నారు. చిత్రీకరణ పూర్తిచేసుకున్న ఈ చిత్రం ప్రస్తుతం నిర్మాణానంతర పనులను శరవేగంగా జరుపుకుంటోంది. కాగా ఈ చిత్రాన్ని దీపావళి కానుకగా విడుదల చేస్తున్నట్లు ప్రకటించి ఓ పోస్టర్‌ను విడుదల చేశారు మేకర్స్. ఈ పోస్టర్ అందరిలోనూ ఉత్కంఠను ఆసక్తిని రేపుతుంది. ఈ చిత్రంలో పవర్‌ఫుల్ పోలీసాఫీసర్‌గా ఆది నటిస్తున్న విషయం తెలిసిందే. పోస్టర్ చూసిన అందరిలోనూ పాజిటివ్ వైబ్ కనిపిస్తుంది.ఈ సందర్భంగా దర్శకుడు మట్లాడుతూ.. ఇప్పటి వరకు ఎవరూ టచ్ చేయని ఓ అద్భుతమైన పాయింట్‌తో రూపొందుతున్న డివోషనల్ థ్రిల్లర్ ఇది. విజువల్ వండర్‌లా, అద్భుతమైన గ్రాఫిక్స్‌తో ఈ చిత్రాన్ని తెరకెక్కిస్తున్నాం. డివోషనల్ థ్రిల్లర్‌గా తెరకెక్కుతున్న ఈ చిత్రంలో ప్రతి పాత్ర హైలైట్‌గా వుంటుంది. అన్ని భాషల్లో ఒకేసారి విడుదల చేయడానికి ఎ÷-లాన్ చేస్తున్నాం.



# నటీమణులు ధైర్యంగా ఉండాలి

## నటి ఐశ్వర్య రాజేశ్


**జ**స్టిస్ హేమ కమిటీ రిపోర్ట్ వైరల్‌గా మారిన తరుణంలో చిత్ర పరిశ్రమలో వేధింపులపై నటి ఐశ్వర్య రాజేశ్ స్పందించారు. నటీమణులు ధైర్యంగా ఉండాలని తాజాగా ఓ ఆంగ్ల పత్రికకు ఇచ్చిన ఇంటర్వ్యూలో తెలిపారు. నేను చిత్ర పరిశ్రమలోకి అడుగుపెట్టి దాదాపు 12 ఏళ్లు అవుతోంది. కాలానుగుణంగా ఎన్నో మార్పులు జరిగాయి. చిత్ర పరిశ్రమలో నేను ఎలాంటి వేధింపులు ఎదుర్కోలేదు. వేధింపులకు పాల్పడిన దోషులకు సరైన శిక్ష పడాలి. చిత్ర పరిశ్రమకు సంబంధించి మహిళలకు నేను ఇచ్చే సలహా ఒక్కటే. మీరు ధైర్యంగా ఉండండి. చొరవ తీసుకోవాలని ఎవరైనా ప్రయత్నిస్తే వెంటనే స్పందించండి. గట్టిగా మీ స్వరాన్ని వినిపించండని తెలిపారు. అవుట్‌డోర్ షూట్స్‌కు వెళ్లినప్పుడు సరైన వసతుల్లేక మహిళలు ఇబ్బందులు పడుతున్నారని.. టాయిలెట్స్ కూడా సరిగ్గా ఉండటం లేదని ఆమె వ్యాఖ్యలు చేశారు. దాదాపు ఏడేళ్లపాటు శ్రమించి జస్టిస్ హేమ కమిటీ ఓ నివేదికను సిద్ధం చేసింది. మలయాళ సినీ పరిశ్రమలో మహిళలు ఎదుర్కొంటున్న సమస్యలు, వర్కింగ్ కండీషన్లు, రెమ్యూనరేషన్, సాంకేతిక రంగంలో మహిళల భాగస్వామ్యం వంటి అంశాలను అధ్యయనం చేసిన కమిటీ.. కాస్టింగ్ కౌచ్ మొదలు వివక్ష వరకు మాలీవుడ్‌లో మహిళలు పలు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని పేర్కొంది. ఇదేతరహా కమిటీని అన్ని చిత్ర పరిశ్రమల్లో ఏర్పాటుచేయాలని నటీనటులు కోరుకుంటున్నారు. ఈ క్రమంలోనే నటి రోహిణి అధ్యక్షతన కోలీవుడ్‌లో ఓ కమిటీ ఏర్పాటు అయింది. వేధింపులు ఎదురయ్యాయని ఎవరైనా తమ వద్దకువస్తే.. ఆ ఫిర్యాదును సైబర్ పోలీస్ విభాగానికి అందజేస్తామని రోహిణి తెలిపారు. దోషిగా తేలినవారిని దాదాపు ఐదేళ్లు కోలీవుడ్ నుంచి బ్యాన్ చేస్తామని అన్నారు.




# ఎమర్జెన్సీ మూవీకి విడుదల కష్టాలు

బాలీవుడ్ క్వీన్, మండి లోక్‌సభ బీజేపీ ఎంపీ కంగనా రనౌత్ కీ రోల్‌లో నటించిన చిత్రం 'ఎమర్జెన్సీ' దివంగత భారత ప్రధాని ఇందిరాగాంధీ జీవిత చరిత్ర ఆధారంగా రూపొందిన ఈ సినిమాలో ఇందిరాగాంధీగా కంగనా నటించిన విషయం తెలిసిందే. ఈ చిత్రం గతేడాది నవంబరు 24న విడుదల కావాల్సి ఉండగా.. అనుకోని కారణాల వలన విడుదల వాయిదా పడింది. ఆ తర్వాత కూడా ఈ సినిమా థియేటర్స్ వద్దకు వెళ్లలేదు. ఇక ఇప్పటి వరకూ ఈ చిత్రానికి సెన్సార్ బోర్డు నుంచి సర్టిఫికెట్ జారీ చేయలేదు. దీనిపై కంగన తీవ్ర అసహనం వ్యక్తం చేశారు. సినిమా రిలీజ్ ఆలస్యమయ్యే కొద్దీ ఎన్నో నష్టాలు ఎదుర్కొంటున్నట్లు ఆవేదన వ్యక్తం చేశారు. ఈ చిత్రాన్ని ఏ విధంగా తెరకెక్కించానో నాకు తెలుసు. చిత్ర పరిశ్రమ నుంచి నాకు ఎలాంటి మద్దతూ లభించలేదు. జీ, కొందరు వ్యక్తుల భాగస్వామ్యంతో దీన్ని నిర్మించాను. ఈ సినిమా రిలీజ్ ఆలస్యం కారణంగా ఎన్నో నష్టాలు ఎదుర్కొంటున్నాం. మా చిత్రాన్ని వీలైనంత త్వరగా విడుదల చేయాల్సిన బాధ్యత సెన్సార్‌పై ఉంది' అని కంగన ఆవేదన వ్యక్తం చేశారు. మాజీ ప్రధాని ఇందిరా గాంధీ 1972లో విధించిన ఎమర్జెన్సీ కాలంనాటి రాజకీయ పరిణామాల గురించి ఈ సినిమాలో వివరించారు.

# దేవర స్పెషల్ షోలకు అనుమతి



ఎపి ప్రభుత్వానికి కృతజ్ఞతలు తెలిపిన ఎన్టీఆర్

ఎన్టీఆర్ హీరోగా కొరటాల శివ దర్శకత్వంలో తెరకెక్కిన చిత్రం 'దేవర'జాన్వీకపూర్ కథానాయిక కాగా సైఫ్ అలీఖాన్ కీలక పాత్ర పోషించారు. ఈ నెల 27న ఇది ప్రేక్షకుల ముందుకురానుంది. ఈ నేపథ్యంలోనే ఎన్టీఆర్ అభిమానులకు ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం గుడ్‌న్యూస్ చెప్పింది. ప్రత్యేక షోలకు అనుమతి ఇస్తున్నట్లు ప్రకటించింది.టికెట్ ధరలు, స్పెషల్ షోల విషయంపై ఇటీవల 'దేవర' టీమ్ ఇటీవల ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వాన్ని సంప్రదించింది. దీనిపై ప్రభుత్వం సానుకూలంగా స్పందిస్తూ తాజాగా జీవో విడుదల చేసింది. ఈమేరకు తొలిరోజు అర్ధరాత్రి 12 గంటల షోతో పాటు ఆరు ఆటలకు అనుమతిచ్చింది. 28వ తేదీ నుంచి ఐదు ఆటలకు పర్మిషన్ ఇచ్చింది. అలాగే టికెట్ ధరలను సైతం పెంచుకోవడానికి వెసులుబాటు కల్పించింది. సింగిల్ స్క్రీన్స్‌లో జీఎస్టీతో కలిసి అప్పర్ క్లాస్ రూ.110, లోవర్ క్లాస్ రూ.60, మల్టీప్లెక్స్ థియేటర్స్‌లో రూ.135 వరకూ పెంచుకునేందుకు అవకాశం కల్పించింది. మరోవైపు తెలంగాణలోనూ స్పెషల్ షోలకు ప్రభుత్వం ఓకే చెప్పినట్లు వార్తలు వస్తున్నాయి. తొలిరోజు అర్ధరాత్రి 1 గంట షోకు అనుమతివ్వడంతో పాటు, రోజూ ఆరు ఆటలను 14 రోజుల పాటు ప్రదర్శించేందుకు అంగీకరించారట. సింగిల్ స్క్రీన్ థియేటర్స్‌లో రూ.50, మల్టీప్లెక్స్‌ల్లో రూ.100 పెంచుకునే వెసులుబాటు కల్పించినట్లు తెలుస్తోంది. ఇందుకు సంబంధించిన అధికారిక ప్రకటన ఇంకా వెలువడలేదు. స్పెషల్ షోలకు అనుమతించడంతో సీఎం చంద్రబాబునాయుడు.. ఉప ముఖ్యమంత్రి పవన్‌కల్యాణ్‌కి నటుడు ఎన్టీఆర్ ధన్యవాదాలు తెలిపారు. తెలుగు సినిమాకు సహకారం అందిస్తున్న మీకు కృతజ్ఞతలు. సినిమాటోగ్రఫీశాఖ మంత్రి కందుల దుర్గేశ్‌గారికి కూడా ప్రత్యేక ధన్యవాదాలు తెలియజేస్తున్నా' అంటూ ఎక్స్ వేదికగా పోస్ట్ పెట్టారు.



# రొమాంటిక్ కామెడీ మూవీగా రాజసాబ్

## చిత్ర విశేషాలు పంచుకున్న మాళవిక

వరుస విజయాలతో జోష్ మీదున్న ప్రభాస్ ప్రస్తుతం 'రాజాసాబ్'తో బిజీగా ఉన్నారు. మారుతి దర్శకత్వంలో సిద్ధమవుతోన్న ఈ చిత్రం రొమాంటిక్ హారర్ కామెడీ నేపథ్యంలో తెరకెక్కుతోంది. ఇందులో ప్రభాస్ సరసన మాళవిక మోహనన్, నిధి అగర్వాల్, రిద్ధి కుమారి తదితరులు ఆడి పాడనున్నారు. తాజాగా ఈ సినిమా గురించి మాళవిక ఓ ఇంటర్వ్యూలో మాట్లాడారు. తన తాజా చిత్రం 'యుద్రా' ప్రచారంలో పాల్గొన్న ఆమె 'రాజాసాబ్' షూటింగ్‌పై ఓ అప్‌డేట్ ఇచ్చారు. రాజాసాబ్ రొమాంటిక్ కామెడీగా రానుంది. నేను ఈ చిత్రంతో తెలుగు పరిశ్రమలో అడుగుపెట్టబోతున్నందుకు ఆనందంగా ఉంది. ఇప్పటివరకు సరైన స్క్రిప్ట్ కోసం ఎదురుచూశాను. ఇందులో నా పాత్రకు ప్రాధాన్యం ఉంది. ఇలాంటి సినిమాలో అవకాశం రావడం నా అదృష్టంగా భావిస్తున్నా. అవుట్ అండ్ అవుట్ ఎంటర్‌టైనర్‌గా ఇది ముస్తాబవుతోంది. ప్రస్తుతం సగం షూటింగ్ పూర్తయింది. ప్రభాస్ ఇంటి భోజనానికి ఎవరైనా ఫిదా కావాల్సిందే. భోజనమంటే ఏదో ఒక కర్రీ, బిర్యానీ తెప్పించడం కాదు.. ఏకంగా పెద్దపెద్ద పాత్రల్లో ఒక గ్రామానికి సరిపోయేంత ఆహారాన్ని ఏర్పాటుచేస్తాడు. ఇప్పటివరకు నేను అలాంటి రుచికరమైన ఆహారాన్ని తినలేదు అంటూ ప్రభాస్‌పై మాళవిక ప్రశంసలు కురిపించారు. 'రాజాసాబ్' విషయానికొస్తే.. యూవీ క్రియేషన్స్ పతాకంపై ఇది రానుంది. విలేజ్ బ్యాక్‌డ్రాప్‌లో హారర్ ఎలిమెంట్స్‌తో తీర్చిదిద్దుతున్నట్లు టాక్. ఇప్పటివరకూ ప్రభాస్ చేయని సరికొత్త పాత్రలో కనిపించనున్నారు. అంతేకాదు, మూవీ విజువల్ వండర్‌లా ఉంటుందని నిర్మాత ఓ సందర్భంలో తెలిపారు. 'బాహుబలి' తర్వాత భారీ బ్జడెట్ చిత్రాల్లో కనిపించిన ప్రభాస్ పాత్ర ఇందులో రిఫ్రెషింగ్ ఉంటుందని, అభిమానులను ఎంటర్‌టైన్ చేస్తుందని ఆయన అన్నారు. ఈ సినిమా వచ్చే ఏప్రిల్ 10న విడుదల కానున్న విషయం తెలిసిందే.

Printed, Published and Edited by Makam Gangadhar, H.No. 11-13-1100, Dwarakanagar Colony, Saroornagar, Ranga Reddy Dist. 500 035. T.S. Owned by Makam Gangadhar and Printed at MGR Publications, H.No. 11-13-1100, Dwarakanagar Colony, Saroornagar, Ranga Reddy Dist. 500 035. T.S. Editor & Managing Director: Makam Gangadhar +919393446188, RNI No. APTEL/2012/45151.